సమీక్ష
గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-1-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 334 పేజీలు: 10+4 వెల: 8.00



కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం
sricharanamedia.in


## వెనిజులాపై అమెరికా దాడి

### కరాకస్‌పై భీకర దాడులు

యుద్ధ విమానాల గర్జనతో వణికిపోయిన రాజధాని



# మదురో బందీ

## ప్రత్యేక విమానంలో అమెరికాకు తరలింపు

ధ్రువీకరించిన యుఎస్ అధ్యక్షుడు ట్రంప్

డ్రగ్స్‌ను అమెరికాలోకి పంపుతున్నారని ఆరోపణ

ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టీకరణ 5లో

వారి ఆధారాలు ఇవ్వండి: వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్

ఇది సైనిక దురాక్రమణే: రష్యా మండిపాటు



అమెరికా సైనికుల బందీగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో

# పెట్టుబడుల ఊపు

కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభం

దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం మనదే

అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానం ఏపి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రం మారిందని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.ఈ మేరకు ఆయన 'ఎక్స్'సామాజిక మాధ్యమం వేదిక సీఎం ట్వీట్ చేసారు.ఇదే అంశంపై సీఎంవో కార్యాలయం సమాచారం విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటితొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3శాతం వాటా ఏపీ దక్కించుకున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ)నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల జోరు, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని వ్యాఖ్యానించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టమని అన్నారు. పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అన్న ఆయన, ముందుచూపుతో అమలు చేస్తున్న పాలసీ సంస్కరణల ప్రభావం ఇదని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. >>2



శనివారం గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ

# తేట తెలుగు!

భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు

అది మన జీవన విధానం, సంస్కృతి

శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఒక ప్రపంచాన్ని సృష్టించే బలం భాషలో ఉంది

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్ నరసింహా

గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు ఆరంభం

ఆకట్టుకున్న ఎన్టీఆర్ విగ్రహం, ఛాయాచిత్రపదర్శన



ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు అనేది కేవలం మాట్లాడే భాష మాత్రమే కాదని, అది మన జీవన విధానం. సంస్కృతి అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఉద్ఘాటించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరులో మూడో ప్రపంచతెలుగు మహాసభలు నేడు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు.సభా ప్రాంగణంలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేసి,అక్కడ అతిథులు నీరాజనాలు అర్పించారు.నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలకు తెలుగు భాషాభిమానులు, సాహితీప్రియులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చన నడుమ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, విశ్వయోగి విశ్వంజీ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రధాన వేదిక ముందు ఏర్పాటు చేసిన రామోజీరావు హస్తకళల ప్రాంగణంలో తెలుగు భాష ప్రాచీనత్వాన్ని ప్రస్ఫుటించేలా పురాతన సాహిత్యం, ప్రాచీన నాణేలు, తెలుగు సంప్రదాయ వంటకాలు సందడి చేశాయి. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.హెచ్. మానవేంద్రనాథ్ రాయ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశ్వ హిందీ పరిషత్తుసభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాల సభకు ముఖ్యఅతిథిగా ఒడిశా గవర్నర్ కంభం పాటి హరిబాబు హాజరు కానున్నారు.మహాసభల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథి >>2



ట్రయల్ రన్‌కు సిద్ధమైన భోగాపురం ఎయిర్ పోర్టు

# భోగాపురానికి నేడు ఫస్ట్ ఫ్లైట్!

ట్రయల్ రన్ ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికి విమానంలో రాక

మారనున్న ఉత్తరాంధ్ర రూపు రేఖలు

**విజయనగరం, జనవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉత్తరాంధ్ర చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంటోంది. ఈ పరిణామంతో ఉత్తరాంధ్ర రూపు రేఖలు మారిపోనున్నాయి. జిల్లాలోని భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ >>2

# అంజన్న దయతోనే నాకు పునర్జన్మ



శనివారం కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న డిసిఎం పవన్

ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు

కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గానికి కృషి

అవసరమైతే తానే కరసేవకుడిగా మారుతా

రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

కొండగట్టులో వాయుపుత్ర సదన్ ధర్మశాల నిర్మాణానికి శంకుస్థాపన

**జగిత్యాల, జనవరి 3 ప్రభాతవార్త బ్యూరో:** కొండగట్టు ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు అని గిరిప్రదక్షిణ మార్గానికి నా వంతు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం డిప్యూటీ సిఎంపవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. వీరితోపాటు టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడుటిటిడిసభ్యులు పాల్గొన్నారు. మొదటహెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూకు చేరుకున్న పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ >>2

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

## సుక్మా జిల్లాలో 12 మంది మావోలు మృతి

మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు

ఎకె-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు స్వాధీనం

అటు బీజాపూర్‌లోనూ ఎదురుకాల్పులు

ఇద్దరు మావోయిస్టులు మృతి



**చర్ల, జనవరి 3 ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి వరస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకపక్క డిజిపి శివధర్ రెడ్డి ఎదుట పిఎల్‌జిఏ కమాండర్ మావోయిస్టు కీలకనేత బాడ్సే సుక్కా అలియాస్ దేవా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకనాల రాజిరెడ్డితో సహా 21మంది మావోయిస్టులు లొంగిపోయిన సమయంలోనే ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా, బీజపూర్‌జిల్లాలలో జరిగిన రెండు వేర్వేరు >>2



దేవా

## గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు

తెలంగాణ డిజిపి ఎదుట కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది మావోయిస్టులు కూడా.. 2లో



బళ్లారి ఎస్పీ పవన్ నెజ్జూర్(ఫైల్)

## బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం

మొన్న పోస్టింగ్.. నిన్న సస్పెన్షన్

2లో

## డ్రగ్స్‌తో పట్టుబడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు

హైదరాబాద్ ఓ ఇంటిపై ఈగల్ టీం దాడి

సుధీర్‌రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు


PATANJALI®
సింథటిక్ దగ్గు సిరప్‌లు అమాయక బిడ్డల ప్రాణాలు పోవటానికి కారణం అవుతున్నాయి...
సింథటిక్ మందులు మన జీవకణాల స్మరణ మరియు ప్రకృతి సహజ చట్టాలకు విరుద్ధం. సింథటిక్ మందులు, విటమిన్‌లు, సబ్బులు, షాంపూలు వగైరాలు మన ఆరోగ్యానికి పూర్తిగా రక్షణ ఇవ్వలేవు.
దగ్గు మరియు జలుబు కొరకు, 100% సురక్షితం మరియు సత్ఫలితం


బ్రోన్‌కామ్, స్వసారివాటి, స్వసారి గోల్డ్, స్వసారి ప్రవాహి మరియు స్వసారి అవలేహ
రసాయనిక సంయోజనిక & జంతు-ఆధారిత న్యూట్రాస్యూటికల్స్ రిప్లేస్ చేయండి. బదులుగా నూట్రేలా యొక్క ప్రకృతి పోషక సత్తువ శ్రేణి ఎంచుకోండి


సింథటిక్‌కు ఒక ప్రత్యామ్నాయం-దంత, కేశ మరియు చర్మ సంరక్షణ, పతంజలి నుండి ప్రకృతి సహజ ఉత్పత్తులను ఎంపిక చేసుకోండి


పతంజలి బాడీ క్లీన్సర్, దంత్ కాంతి, కేశ్ కాంతి & చర్మ సంరక్షణ శ్రేణి



కొండగట్టు అంజన్న ఆలయంలో డిసిఎం పవన్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

# అంజన్న దయతోనే నాకు పునర్జన్మ

>> వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ టీటీడీ సహకారంతో రూ 35.19 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని జనసేన అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో ఆలయ అధికారులు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు.కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయం అన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కర సేవకుడిని అవుతానని మాట ఇచ్చారు. భవిష్యత్తులో సైతం ఆలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కొండగట్టు అంజనేయ స్వామికి నిధులు కేటాయించినందుకు ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబుకు మరియు టిటిడికి నా ధన్యవాదాలు అని అన్నారు. కొండగట్టు అంజన్న స్వామి ఆశ్రిత వల్లే టిటిడి వారు ఆమోదం లభించిందని తెలిపారు. కొండగట్టు అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించడం అభినందనీయం అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఘనంగా స్వాగతం తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిప్రదక్షిణ తెలుగు రాష్ట్రాలకే, దేశానికే కూడ రక్ష అని అన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణ కి అందరం కలిసి కరసేవా చేద్దాం అని తెలిపారు. అలాగే కొండగట్టు ఆలయ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మరియు తన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూతూతెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంను ఏపి ఉప ముఖ్యమంత్రి వచ్చి 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి చేయడంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంకు వచ్చే దీక్ష విరమణ, దర్శనం కొరకు వచ్చే భక్తుల కొరకు గదుల వసతి సముదాయానికి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని భవిష్యత్తులో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం లాగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘటించారు. 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు సమకూర్చడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూకొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంకు ఏపి డిప్యూటీ సిఎం సహకారంతో 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు.కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధిలో పాలు పంచుకున్న ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే గా ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి మరింత ఆలయం అభివృద్ధి చేయడంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్.ఎ.సీ. చైర్మన్ ఎన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్ , జిల్లా అధికారులు, ఆలయ ఈ.వో, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు

## తెలంగాణ డిజిపికి ఆయుధాలు అప్పగింత, రూ.20 లక్షల నగదు పోలీసులు స్వాధీనం

## బేషరతుగా లొంగిపోండి: నక్సల్స్‌కు తెలంగాణ శివధర్ రెడ్డి పిలుపు

## దేవాపై ఎన్ఐఎ రూ.75 లక్షల రివార్డు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎపిలలో ఓ వై పు నిర్బంధం, మరోవైపు ఎదురు కాల్పులు, లొంగుబాట్లు జరుగుతుండగా తాజాగా శనివారం నాడు ఆ పార్టీ అగ్రనేత పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆ ర్మీ (పిఎల్‌జిఎ) కమాండర్ బడ్సె సుక్కా అలియాస్ దేవా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది నక్సలైట్లు ఆయు ధాలతో డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీరిలో ఆరుగురు మహిళలు వున్నారు. వీరి వద్ద నుంచి రెండు ఎల్ఎంజి, అమెరికాలో తయా రైన అధునాతన తుపాకి, ఇజ్రాయిల్‌లో తయారైన మరో తుపాకి. ఎనిమిది ఎకె 47 తుపాకులు, పది ఇన్సాస్ తుపాకులు, ఎనిమిది ఎస్ఎల్ఆర్ తుపాకులు, నాలుగు బిజిఎల్ తుపాకులు, 11 సింగిల్ షాట్స్ తుపాకులు, రెండు గ్రేనేడ్లు, ఒక ఎయిర్ గన్ పెద్ద ఎత్తున తూటాలను స్వాధీనం చే సుకున్నారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు వుండగా మిగతా వారంతా ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారు.

వచ్చే మార్చి నెలాఖరుకు దేశంలో నక్సలైట్ల ఉనికి లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ దిశగా గట్టి చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించిన నేపథ్యంలో తెలంగాణ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు ఓవైపు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు లొంగుబాట్లను ప్రోత్సహిస్తోంది. తెలంగాణలో గత ఏడాది 576 మంది నక్సలైట్లు ఆయుధాలతో పాటు లొంగిపోగా ఈ ఏడాదిలో మొదటి లొంగుబాటులో భాగంగా 20 మంది స రెండర్ అయ్యారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ కమాండర్ ఛత్తీస్‌ఘడ్‌లోని పువర్తికి చెందిన దేవాతో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి వున్నారు. ఇందులో దేవాపై 75 లక్షల రూపాయల రివార్డు వుంది. ఇతను మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామానికి చెందిన వ్యక్తి. మావోయిస్టు పిఎల్‌జిఎలో దేవాల కీలకంగా వున్నాడు. కాగా దేవాతో పాటు లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందినమ అవులం సోమా (32), కుంజం పొడియా అలియాస్ శ్రీకాంత్ (30). కోవసి పైకు (20), మడకం లక్కె (20), కర్టం జోగ (20), మడవి అందు (31), కుంజం చోట (21), మడకం అండా (23), కుంజం భీమా (27), మడవి కోసి (25), వేముల రాజు (35), పోడియం చైతే (25) పునెం భీమా (25) మడ కం నందయ్య (22), పుల్సం (24)తో పాటు ఎపికి చెందిన కంకణాల రాజిరెడ్డి సతీమణి ఈశ్వరి (45), హనుమకొండకు చెందిన దార సారయ్య (49)లు వున్నారు. వీరంతా దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగానూ, పార్టీ క్షేత్రస్థాయి సభ్యులుగానూ వున్నారు.

**అజ్ఞాతంలో వున్న నక్సలైట్లు లొంగిపోవాలి, తెలంగాణ నుంచి 17 మందే మిగిలారు..డిజిపి వెల్లడి**

గత ఏడాది తెలంగాణలో 576 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 17 మంది డివిజన్ కమిటీ సభ్యులు, 57 మంది ఏరియా కమిటీ సభ్యులు వున్నారని డిజిపి శివధర్ రె డ్డి తెలిపారు. నక్సలైట్లు ఇంత భారీ సంఖ్యలో లొంగి పోవడం వెనుక పోలీసుల సమిష్టి వ్యూహం, ప్రభుత్వ ప్రోత్సాహం వుందని ఆయన తెలిపా రు. ఇది మావోయిస్టులపై పోలీసుల విజయంగా డిజిపి తెలిపారు. గత అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నక్సలైట్లను లొంగిపోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగిపోతున్నట్లు డిజిపి తెలిపారు. మావోయిస్టు పా ర్టీలో జాతీయ స్థాయిలో కేవలం అజ్ఞాత కేడర్‌లో వున్న వారు తెలంగాణకు చెందిన వారు కేవలం 17 మంది మాత్రమే వున్నారని ఆయన తెలిపా రు. పిఎల్‌జిఎ పతనం దిశగా సాగుతోందని ఆయన తెలిపారు. అజ్ఞాతంలో వున్న మావోయిస్టులు జనంలోకి రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లొంగిపోయిన వారికి రివార్డులు ఇవ్వడంతో పాటు సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం కల్పిస్తామని, వారిపై ఎలాంటి కేసులు వుం డకుండా చూస్తామని ఆయన తెలిపారు. తాజాగా ఛత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణకు వచ్చి ఆయుధాలతో పాటు వారే లొంగిపోయారని డిజిపి తెలిపా రు. వీరిని ఛత్తీస్‌ఘడ్‌కు పంపి అక్కడ పునరావాసం అమలయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. లొంగిపోయిన వారి పేరిట వున్న కోటీ 81 లక్షల రూపాయల రివార్డును వారికే ఇస్తున్నామని డిజిపి తెలిపారు. నక్సలైట్ల లొంగుబాటులో విశేషంగా కృషి చేస్తున్న ఎస్ఐబి పోలీసులను డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్. గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, ఇంటెలి జెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు సాల్గొన్నారు.

# పెట్టుబడుల ఊపు

>> ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాలవారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. విజన్‌పై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ బృందం చేసిన కృషిని ప్రశంసనీయమన్నారు. ఇది విజయానికి ముగింపుగా కాకుండా భవిష్యత్ అభివృద్ధికి పునాదిగా అభివర్ణిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏపీ తర్వాత స్థానాల్లో ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) ఉన్నాయి. గతంలో ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, ఒడిశాలను దాటి పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ 9.5 శాతం, గుజరాత్ 7.1 శాతం పెట్టుబడులతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. పెట్టుబడుల సదస్సుకు ముందే జరిగిన ఎంఓయూల ద్వారా భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. పలు కీలక సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రెన్యూ పవర్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, యాక్సిస్ ఎనర్జీ ఉన్నాయి. ఓర్వకల్లులో సాలిడ్ స్టేట్ బ్యాటరీ పరిశ్రమ, కుప్పంలో పాదరక్షల తయారీ యూనిట్ కి తైవాన్ సంస్థలు ముందుకు వచ్చాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో జాయింట్ వెంచర్ ద్వారా ఎడ్వాన్స్డ్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఈజౌల్ ఇండియా ముందుకు వచ్చింది. 19వేల 500 కోట్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థ్యంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆర్థిక అభివృద్ధి బోర్డు(ఈడీబీ)తో ఒప్పందం చేసుకుంది.కుప్పంలో 400 కోట్లతో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అలీజియన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. పాదరక్షల తయారీ సంస్థ పౌ చెన్ గ్రూప్ ఓ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సర్ యూనిట్ల ఉత్పత్తికి క్రియేటివ్ సెన్సర్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించాలని కోరింది.విశాఖ వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంతో దేశవిదేశాల పెట్టుబడిదారులు 613 ఒప్పందాలు ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని గతంలో సంబంధిత అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. వీటి ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భాగస్వామ్య సదస్సులో దాదాపు 5,587 మంది పాల్గొని కలసికట్టుగా విజయవంతం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 19 నెలల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాధించామన్నారు. విశాఖ వేదికగా జరిగిన 30వ సీఐఐ 2 రోజుల భాగస్వామ్య సదస్సులో 613ఒప్పందాలు ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని వెల్లడించారు.వీటి ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 2019-24 రాష్ట్రానికి చీకటి పాలన అని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు 5ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు హామీ ఇచ్చామని ఇప్పటి వరకూ చేసుకున్న ఒప్పందాలు ద్వారా 25 లక్షల ఉద్యోగాల హామీ ఇస్తున్నామని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

>> ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకున్నదన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఒకేరోజు కీలక నేతల లొంగుబాటు, ఎన్ కౌంటర్లలో 14 మంది మృతిచెందడం సంచలనంగా మారింది.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విధించిన గడువుకు ఇంకా తొమ్మిది నెలల సమయం ఉండగా ఇప్పటికే అగ్రనేతలు అందరూ లొంగిపోతున్నారు. మరికొందరు ఎన్ కౌంటర్లలో మృతిచెందారు.కాగా మావోయిస్టు చీఫ్ తిప్పిరి తిరుపతి ( దేవ్ జీ) గణపతి పాపారావు దామోదర్ తోపాటు మరో ఇద్దరు నాయకులే మావోయిస్టు పార్టీని నడిపిస్తున్నారు.వీరు సైతంలొంగిపొయే ఆస్కారం ఉందని వదంతులు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. అదే జరిగితే మావోయిస్టు పార్టీ కనుమరుగు అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి..కాగాబస్తర్ రేంజ్ పరిదిలోని సుక్మా జిల్లా కిష్టారం అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్న సమాచారంతో డిఆర్జి సిఆర్ పి ఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి.ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరు వర్గాల మధ్య పలు దఫాలుగా హోరాహోరీగా కాల్పులు చోటుచేసుకోగా 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. మరోవైపు బీజపూర్ జిల్లా దక్షణ ప్రాంతంలో చోటు చేసుకున్న మరో ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. రెండు ఎన్ కౌంటర్ల నుండి మొత్తం 14 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాదీన పరుచుకున్నారు. వీరిని గుర్తించాల్సి ఉంది. ఎన్ కౌంటర్ ప్రాంతం నుండి ఏకే 47, ఇన్ సాస్ రైఫిల్స్, ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్, భారీ సంఖ్యలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, ఇతర మావోయిస్టు వస్తువులను స్వాదీన పరుచుకున్నారు. ఎన్ కౌంటర్లను బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్, సుక్మా జిల్లా ఎస్ పి గౌరవ్ రాయ్, బీజపూర్ జిల్లా ఎస్ పి డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ ధృవీకరించారు.

# బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం

**బళ్లారి,జనవరి 3:** కర్ణాటకలో సంచలనం సృష్టించిన బళ్లారి కాల్పుల ఘటన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఎస్పీ పవన్ నెజ్జూర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, తుమకూరు జిల్లాలోని తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈనెల ఒకటోతేదీ బళ్లారిలో జరిగిన హింసాత్మక ఘటనకు కేవలం రెండు గంటల ముందే పవన్ నెజ్జూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 11 ఏళ్ల సర్వీసులో ఆయనకు ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ పోస్టింగ్. ఈ ఘటనలో ఓ కాంగ్రెస్ కార్యకర్త మరణించడంతో, ప్రభుత్వం ఆయనపై నిర్లక్ష్యం ఆరోపణలతో వేటు వేసింది. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ సర్కార్ ఒక హంతక ప్రభుత్వంగా మారిందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ ఘటనలో ఎస్పీని బలిపశువును చేశారు. బళ్లారిలో ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిని హత్య చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రయత్నించి, తమ సొంత కార్యకర్తనే కాల్చి చంపుకున్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. ఇది ఆత్మహత్య గ్యారెంటీ ఇచ్చే ప్రభుత్వమని అశోక తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఎస్పీ సస్పెన్షన్‌ను కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఘటనా స్థలానికి వెంటనే వెళ్లడంలో ఎస్పీ విఫలమయ్యారని, అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన 30 నిమిషాలైనా సరే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారి వెంటనే స్పందించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌తో పట్టుబడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు

**హైదరాబాద్ (నార్సింగి), జనవరి 3 ప్రభాతవార్త :** డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నానక్‌రాంగూడలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సుధీర్‌రెడ్డి డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సమయంలో ఇంట్లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ముగ్గిరిని పోలీసులు అదుపులోకి తీసుకొని పరీక్షలు చేయగా సుధీర్‌రెడ్డికి పాజిటివ్, మిగితా ఇద్దరికి నెగెటివ్ వచ్చినట్లు తెలిసింది. దీంతో సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆతరువాత ఇతడిని బంజారాహిల్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఇతడిపై గతంలో రెండు డ్రగ్స్ కేసులు ఉన్నట్లు తెలిసింది. గత కొంత కాలంగా ఈగల్ టీం ప్రతినిధులు గంజాయి, డ్రగ్స్ విక్రేతలు, వాడకం దారులపై ప్రత్యేక నిఘాను ఉంచి తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలలో భాగంగానే శనివారం సుధీర్‌రెడ్డి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అంశంపై అధికారికంగా పోలీసులు స్పందించడం లేదు. సుధీర్‌రెడ్డి కుటుంబ సమస్యల కారణంగానే మనస్థాపం చెంది డ్రగ్స్‌కు అలవాటుపడ్డట్లు తెలుస్తుంది. ఇతడికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తుంది?ఎవరు సరఫరా చేస్తున్నారు? ఇతడితో పాటు ఎవరెవెరూ డ్రగ్స్‌కు బానిసలుగా ఉన్నారు?అన్న అంశాలను విచారణఅనంతరం పోలీసులువెల్లడించే అవకాశం కనిపిస్తుంది.

**డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదు : ఇన్‌స్పెక్టర్:** డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే కుమారుడు సుధీర్‌రెడ్డిని అరెస్టు చేశారా? అని ప్రభాతవార్త నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ అడిగితే... డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదని వివరించారు. నేను చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఎలాంటి డ్రగ్స్ కేసులు నమోదు చేయలేదు. ఓ ఎమ్మెల్యే కుమారుడిని అదుపులోకి తీసుకుంటే ఇంత ప్రశాంతంగా స్టేషన్‌లో ఎలా కూర్చుంటా అన్నారు. ఎవరు డ్రగ్స్ కేసును నమోదు చేశారో? ఎవరిని అరెస్టు చేశారో? నాకెలాంటి సమాచారం లేదు. నార్సింగి పోలీసు స్టేషన్‌లో అలాంటి కేసులు నమోదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.



శనివారం గుంటూరులో తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలు అర్పిస్తున్న ప్రముఖులు



ప్రపంచ తెలుగు మహాసభలో ఆకట్టుకున్న ఎన్టీఆర్ విగ్రహం, ఛాయాచిత్ర ప్రదర్శన

# తేట తెలుగు!

>> పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలకు మన ఆచారాలు, సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమ్మలు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారని, కానీ నేడు సెల్ ఫోన్లను చూపిస్తూ అన్నం తినిపించే పరిస్థితి దాపురించిందన్నారు. అమ్మ పాడే లాలిపాటలో, చెప్పే కథల్లో, జరుపుకునే పండుగల్లో తెలుగు మాధుర్యం దాగి ఉందని గుర్తుచేశారు. **పండుగల శోభ మళ్ళీ రావాలి:** గ్రామాల్లో ఒకప్పుడు సంక్రాంతి, దసరా, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగలు వస్తే పండగ వాతావరణం ఉట్టిపడేదని, హరిదాసులు, గంగిరెద్దులతో సందడిగా ఉండేదని ఆయన గుర్తుచేసుకున్నారు. కానీ నేడు గ్రామాల్లో ఆ కళ కనుమరుగవుతోందన్నారు. మన పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని హితవు పలికారు. తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకుంటూ పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.తెలుగు ఖ్యాతిని దేశవిదేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని స్పీకర్ కొనియాడారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ద్వారానే సామాన్యులైన ఎంతోమంది రాజకీయాల్లోకి రాగలిగారని, 25 ఏళ్ల వయసులో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి నేడు సభాపతి స్థానంలో కూర్చునేలా చేసింది ఎన్టీఆరేనని భావోద్వేగంతో పేర్కొన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసంలో మాతృభాష ఆవశ్యకతను నొక్కిచెప్పిన స్పీకర్.. ప్రభుత్వం తరపున తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో మేధావులు చేసే తీర్మానాలను తనకు పంపాలని కోరారు. ఆ తీర్మానాలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, చర్చించి, ప్రభుత్వం ద్వారా అమలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సత్యసాయి బాబా సన్నిధిలో, ఎన్టీఆర్ కళావేదికపై ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు. మాట ఇచ్చిన ప్రకారం మూడు రోజులూ తాను ఈ సభల్లోనే ఉంటానని స్పష్టం చేశారు.

మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ పాల్గొని ప్రసంగించారు. 'ఇంత పెద్ద తెలుగు సభ జరుగుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. మనిషికి పుట్టుకతోనే మాతృబంధం, భాషాబంధం ఏర్పడతాయి. భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు. ఒక ప్రపంచాన్ని సృష్టించేంత బలం భాషలో ఉంది. మనందరం భాష వల్ల బంధువులం. తెలుగు భాష వల్ల మనకు ఓ గుర్తింపు ఉంది. అధికార వ్యవహారాల్లో తప్పనిసరిగా తెలుగు ఉండాలి. జిల్లాస్థాయి వరకు కోర్టు కార్యకలాపాలు తెలుగులో జరగాలి' అని ఆకాంక్షి ంచారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మహాసభలకు అధ్యక్షత వహించి మాట్లాడారు. "తెలుగు భాష ప్రభుత్వానికి అధికార భాష, మాకు మాత్రం మమకార భాష. ఐదో తరగతి వరకు మాతృభాషలోనే చదవాలని జాతీయ విద్యా విధానం చెబుతోంది. నాకు తెలుగు బాగా వచ్చు కాబట్టే ఐదు భాషలు నేర్చుకున్నా. ప్రపంచంలో వివిధ రంగాల ప్రముఖులు వారి మాతృభాషలో చదువుకున్నారు. ఇంగ్లీష్ వల్లే ఉద్యోగాలు రావు. విషయ పరిజ్ఞానం ఉంటే వస్తాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి పెట్టాలి" అని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. పరిషత్తు తరఫున మూడోసారి ప్రపంచ మహాసభలు నిర్వహిస్తున్నారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రాచీన భాష తెలుగు. నన్నయ్య, తిక్కన, ఎర్రన వంటి వారు తెలుగు భాషకు పట్టం కట్టారు. ఎన్టీఆర్, రామోజీరావు తెలుగుకు గుర్తింపు తెచ్చిన వారిలో ప్రముఖులు" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహకులు పలువురు న్యాయమూర్తులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఛాయచిత్ర ప్రదర్శన ,ఆయన కృష్ణ ఆహార్యంలో విగ్రహం ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఇక 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సభలకు మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. శనివారం రాత్రికే ఆయన గుంటూరు చేరుకోనున్నారు. ఉత్తరాఖండ్ జ్యోతిష్మఠ్ జగద్గురు ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి స్వామి ప్రత్యక్ చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనమండలి చైర్మన్ పి.మోషేనురాజు, మంత్రులు పాల్గొంటారు. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి హాజరవుతారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాల ప్రదానం జరగనుంది.

# భోగాపురానికి నేడు ఫస్ట్ ఫ్లైట్!

>> విమానాశ్రయానికి ట్రైల్ రన్‌గా జనవరి 4న తొలి విమానం దిగబోతోంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఈఎయిర్ ఇండియా విమానం ఉదయం 11గంటలకు కేంద్ర పౌర విమాన యానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు విమానయానశాఖ అధికారులతో రానుంది. ఈ చివరి ట్రయల్ రన్ విజయవంతం అయిన తర్వాత, ఈమే నెల నుంచే ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు సిద్ధంగా ఉన్న ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనున్నది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, విశాఖపట్నం దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రధాన ఆర్థిక కేంద్రంగా మారే అవకాశం ఉంది. 24 గంటల పాటు విమాన సర్వీసులు, అంతర్జాతీయ కనెక్టివిటీ, వేలాది ఉద్యోగాలతో ఉత్తరాంధ్ర దశ దిశ మారిపోతుంది. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రూపు దిద్దుకుంటోంది. ఇది కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఒక అద్భుతం. భూ సేకరణ, న్యాయపరమైన చిక్కులు అధిగమించి 2023మే 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఆ రోజే ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పర్యవేక్షణలో పనులు ఊహించని వేగంతో సాగుతూ అనుకున్న దాని కంటే ముందే సిద్ధం అయ్యింది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా టెర్మినల్ నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో దీనిని 1.8 కోట్ల వరకు పెంచే అవకాశం ఉంది. విమానాశ్రయంలో డిసెంబర్ 2025 నాటికి 91.7 పైగా పనులు పూర్తయ్యాయి. జనవరి 4న విమానాల ట్రయల్‌రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభించనుంది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణ, గ్రౌండ్ స్టాఫ్, సెక్యూరిటీ, టికెటింగ్,కార్గో హ్యాండ్లింగ్‌లో సుమారు 5,000 నుండి 10,000 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. క్యాబ్ సర్వీసులు, హోటల్ పరిశ్రమ, టూరిజం గైడ్‌లు మరియు మెయింటెనెన్స్ సర్వీసుల ద్వారా మరో 20,000 మందికి పైగా ఉపాధి లభిస్తుంది. భోగాపురం అందుబాటులోకి వస్తే రుషికొండ, భీమిలి బీచ్‌లు, అరకు తదితర పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ పర్యాటకుల రాక పెరుగుతుంది.

## వారం - వర్జ్యం

04-01-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
కృ.పాడ్యమి మ.12.34
పునర్వసు మ.3.15
వర్జ్యం : ఉ.10.12-12.07
దు.సా.4.15-5.00
శుభసమయం : సా.6.25-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఎదుటివారు చెప్పేది ఆశాంతం వినండి. తొందరపాటు మాటలు, పరుష సంభాషలు తగాదాలు లాభించవు.

**వృషభం:** ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండూ కలిసి రావు.

**మిథునం:** సినీ, కళా రంగాలలోని వారు వస్త్ర వ్యాపారస్తులు జాగరూకతతో మెలగవలసి వుంటుంది. ప్రయాణాలు.

**కర్కాటకం:** ఒకటికి రెండు సార్లు ఆలోచించి విదానంగా అడుగులు వేయడం మంచిది. పనులు మందకొడిగా సాగుతాయి.

**సింహం:**పలురంగాల పట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది. వెనువెంటనే పూర్తవుతాయి. ఇంటా బయటా అనుకూలం.

**కన్య :** కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందనంగా ఎవరికీ సర్ది చెప్పలేరు.

**తుల :** దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** సాధ్యమైనంత వరకు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. ప్రయత్నంలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**ధనుస్సు:** బాధ్యతలు అధికమవుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఉద్యోగులకు బదిలీలువుంటాయి.

**మకరం:**రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కొంతవరకు అనుకూలంగా వుంటుంది. నూతన ఒప్పందాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:**ఉపయుక్తం లేని అంశాలు ఈరోజు కాలహరణానికి కారణం అవుతాయి. కోర్టు తీర్పులు అలసటకు గురిచేస్తాయి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

## దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే

### - సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:**దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ఘన నివాళి అర్పించారు. మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధిలో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని సీఎం గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యకు వెలుగులు నింపిన సావిత్రిబాయి పూలేకు మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో తెలిపారు.

దేశ మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే .. లోకేశ్ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అనీ అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని లోకేశ్ పేర్కొన్నారు.

## కూటమి పాలనలో నగదు రహిత వైద్యసేవల్లో భారీ పురోగతి

### మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,జనవరి 3,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణలో ప్రజలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యసేవలు అందించడంలో సానుకూలమైన మార్పు స్పష్టంగా కనిపిస్తుందని వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల అమలును, 108 మరియు 104సేవలను శనివారం వర్చువల్‌గా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ననపెరిగిన లబ్దిదారలు,వ్యయం గత వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రొసీజర్ల సంఖ్యను 3257కు పెంచి పూర్తిస్థాయిలో అమలు పరిచిన 2022న23 మరియు 2023న24కాలంలో ఫలితాలను,గత 19నెలల కూటమి పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద మరియు సాధించిన ఫలితాలను మంత్రి తులనాత్మకంగా విశ్లేషించారు. 2022-24 కాలంలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం 23,08,930మంది లబ్దిపొందారు. దీని ప్రకారం సగటున నెలకు 96,205మందికి ఆరోగ్యశ్రీ సేవలందాయి. కూటమి ప్రసభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ ఏడాది డిసెంబర్ వరకు మొత్తం 24,49,117లబ్దిదారులకు వైద్యసేవలందాయి. ఈ మేరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్దిదారుల్లో 21శాతం వృద్ధి నమోదైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. --104వాహనాల ద్వారా విస్తృత ప్రయోజనాలు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు 104వాహనాల ద్వారా త్వరలో ప్రతి ఒక్కరికి 41రకాల వైద్యపరీక్షలు చేసే ప్రక్రియను చేపడతామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈమేరకు జరుగుతున్న సన్నాహకాల గురించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ,108 మరియు 104 వాహన సేవలు ఎంతో కీలకమైనవని,వీటి అమలు,నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన సేవల్ని అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.



ఫైలాన్‌ను ఆవిష్కరణ

## వైసిపి పాలనలో డ్రగ్స్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్

### అభ్యుదయం సైకిల్‌యాత్రలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

### ఇచ్ఛాపురంలో డ్రగ్స్ వద్దు బ్రో ఫైలాన్ ఆవిష్కరించిన హోం మంత్రి అనిత

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జనవరి 3 ప్రభాతవార్త:** గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో డ్రగ్స్ రాకెట్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దారని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు ఇచ్ఛాపురంలో జరిగింది. డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నవంబర్ 12న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభించిన సైకిల్‌యాత్ర 1300 కిలోమీటర్లు మేర సాగి ఇచ్ఛాపురంలో ముగిసింది. ఇందుకు చిహ్నంగా స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఫైలాన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫైలాన్‌ను రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గతంలో దేశంలో ఏ మూలన డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండేవని అన్నారు. రాష్ట్ర ఐటి శాఖామంత్రి నారా లోకేష్ అప్పటి పాదయాత్రలో గంజాయి దుస్థితి తెలుసుకుని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గంజాయిపై ఉక్కుపాదం మోపారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడమే సంకల్పమని అన్నారు. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసై రాష్ట్రం చిన్నాభిన్నమైందని అటువంటి దుస్థితి రాష్ట్రానికి రాకూడదని ఈగల్ టీం ఏర్పాటు చేసి డేగ కళ్లతో పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గంజాయి వ్యాపారులతో కూడా కమిషన్‌కు మాట్లాడుకుని ఒరిస్సా నుంచి గంజాయి రవాణాకు ప్రోత్సహించేవారని అన్నారు. డ్రోన్ వ్యవస్థ ద్వారా గంజాయి పంటలను నాశనం చేసి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామని అన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ గంజాయి పేరెత్తితే మొక్క తేవాలన్నా భయపడే విధంగా వ్యవస్థ పని చేస్తోందని ఇది గంజాయి రవాణాకు గేట్‌వే కాదని నిరూపించాలని అన్నారు. ఇండిగో సంక్షోభం సమయంలో రామ్మోహన్‌నాయుడు విమర్శలను ధీటుగా ఎదుర్కొని వారంలోగా సమన్వయంతో గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకొచ్చారని అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే వాక్యం లోకేష్ ఆలోచన నుంచే వచ్చిందని అన్నారు. బోర్డర్‌లో చెక్‌పోస్టులు లేకుండా, సీసీ కెమెరాలు లేకుండా గతంలో పాలన సాగిందని, సున్నా నుంచి మొదలు పెట్టి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్నామని అన్నారు. అమ్మాయిలకు కూడా గంజాయి అలవాటు చేశారని అన్నారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటే ఉపాధి అవకాశాలు ఉంటాయని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఈగల్ ఐజీ రవికిషన్, విశాఖ రేంజ్ ఐజీ గోపినాథ్ జెట్టి, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, నడికుడితి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'గోవింద'రాజ ఆలయంలో భద్రతా వైఫల్యం!

### - ఏకాంతసేవ ముగిశాక ఆలయం గోడదూకి లోపలికి..

### - ఆలయగోపురంపైకి వెళ్లి కలశాలు చోరీకి తెలంగాణవాసి యత్నం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామికి అన్నగా పిలువబడే తిరుపతినగరం నడిబొడ్డున కొలువైన శ్రీగోవిందరాజస్వామి ఆలయం గోపురంపైకి ఓ వ్యక్తి రాత్రివేళ ఎక్కి కలశాలు లాగడానికి చేసిన విఫలయత్నం తిరుమల తిరుపతిదేవస్థానం పెద్దలనేగాక తిరుపతివాసులను భయభ్రాంతులకు గురిచేసింది. శుక్రవారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో ఏకాంతసేవ ముగిసిన తరువాత ఆలయ అధికారులు, అర్చకులు భద్రత సిబ్బంది ఆలయ ప్రధాన ద్వారం తలుపులు, మహద్వారం తలుపులు మూసివేశారు. అంతా వారివారి ఇళ్ళకు చేరుకున్నారు. సరిగ్గా అదే సమయంలో భక్తుడి రూపంలో ఓ వ్యక్తి అప్పటికే మద్యంసేవించిన మత్తులో ఆలయం గోడపైకి ఎగబడి లోపలకు వెళ్ళాడు. ఆలయ మహద్వారం దాటుకుని ఏకంగా గోపురంపైకి రాత్రి 11గంటల ప్రాంతంలో చేరుకున్నాడు. అక్కడ బంగారుపూతతో ఉన్న కలశాలను మూడింటిని లాగడానికి ప్రయత్నించాడు. కొంతసేపటి తరువాత చిన్నపాటి శబ్ధాలు రావడంతో స్థానికులు గమనించి భద్రత సిబ్బందికి తెలిపారు. అప్రమత్తమైన భద్రత సిబ్బంది ఆలయంలోపలకు చేరుకుని గోపురంపైన కూర్చున్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, ఈస్టు పోలీసులు, అగ్నిమాపకశాఖసిబ్బంది, టిటిడి విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గోపురంపై కూర్చున్న వ్యక్తిని క్రిందకు దించేందుకు చేసిన ప్రయత్నాలు, మంచిమాటలు ఫలించలేదు. తనకు 90ఎంఎల్ మద్యంసీసా తీసుకువస్తే క్రిందకు దిగుతానని పోలీసులతో వాదనలకు దిగాడు. తీరా రెండుగంటల తరువాత అగ్నిమాపక సిబ్బంది బలమైన త్రాళ్ళ సాయంతో గోపురంపైకి చేరుకుని అక్కడ ఉన్న వ్యక్తిని క్రిందకు దించారు. తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంతా ఊపిరిపీల్చుకున్నారు.

**- సినిమా ఫక్కీలో ఆలయంలోపలకు:** తిరుమలతిరుపతిదేవస్థానంకు అనుబంధంగా ఉన్న తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భద్రత వైఫల్యం మరోసారి ప్రస్ఫుటమైంది. నిత్యం ఇరవైవేలమంది నుండి ముప్ఫైవేలమందివరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు ఆలయంలో భక్తులకు నిరంతరంయంగా దర్శనం కల్పిస్తున్నారు. రాత్రి ఏకాంతసేవ తరువాత ఆలయంలోపల భక్తులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఆలయం తలుపులు మూసివేస్తారు. అలాంటిది శుక్రవారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత ఉండే గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు బయటపడింది. ఆలయం గోడ దూకి గోపురంపైకి చేరుకున్నా భద్రత సిబ్బందిగానీ, సిసికెమెరాలద్వారా టిటిడి కమాండ్ కంట్రోల్ కేంద్రం సిబ్బందిగానీ గుర్తించలేకపోవడం పనితీరు వైఫల్యం తేటతెల్లం చేసింది. పైకి ఎగబడిన వ్యక్తిని తెలంగాణ నిజామాబాద్ జిల్లా కూర్మవాడ పెద్దమల్లారెడ్డి కాలనీకి చెందిన "కుతడి తిరుపతి"(43)గా పోలీసులు తేల్చారు. యాత్రికులతో కలసి ఆలయంలోపల ఉన్న టెంట్‌కొయ్యలమీదుగా గోపురంపైకి ఎక్కినట్లు తెలిపాడు. మతిస్థిమితం లేని వ్యక్తిగా, మద్యం మత్తులో ఉన్నట్లు అతనిని పోలీసులు అదుపులోకితీసుకున్నట్లు టిటిడి వర్గాల ప్రకటన . తిరుపతినగరం నడిబొడ్డున ఉన్న టిటిడి గోవిందరాజస్వామి ఆలయం ఒక పవిత్రమైన క్షేత్రం. ఈ ఆలయానికి ఆనుకుని ముందుభాగంలో దుకాణాలు ఉన్నాయి. అయినా రాజగోపురంపైకి మద్యం మత్తులో ఎలా వెళ్ళాడనేది ఇతి అత్యంత దారుణమైన సంఘటనగా ప్రజలు, దుకాణాదారులు, ప్రజా సంఘాలు, నేతలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయంపైన వెళ్ళినా భద్రతా సిబ్బంది ఎందుకు గమనించ లేదనేది సందిగ్ధత.



## ప్రణాళికలతో రికార్డుస్థాయిలో వైకుంఠదర్శనాలు

### - శుక్రవారంరోజే 83వేలమంది భక్తుల దర్శనం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు పటిష్టవ్యూహంతో ముందస్తు ప్రణాళికలతో చక్కగా అమలుచేస్తున్న టిటిడి అధికారులు తొలిమూడురోజులు సఫలీకృతులయ్యారు. ఆ తరువాత సామాన్యభక్తులకు సర్వదర్శనాలు అమలుచేయడంతో నాల్గవరోజు శుక్రవారం ఏకధాటిగా 83,032మంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించడం దశాబ్ధకాలంలో టిటిడి రికార్డు సృష్టించింది. శుక్రవారం శ్రీవారికి అభిషేకసేవ జరుగుతుంది. అయినా సర్వదర్శనంలో భక్తులను ఆ సేవ నిర్వహించే సమయంలో కూడా అనుమతించడంతో తమజన్మధన్యమైందని చూసినవాళ్ళు పునీతులయ్యారు. కాగా ఐదవరోజు శనివారం తిరుమలలో సాధారణ సర్వదర్శనంలో భక్తులు ఎటువంటి టోకెన్, టిక్కెట్ లేకున్నా కృష్ణతేజ కూడలి నుండి క్యూలైన్లలోనికి ప్రవేశిస్తున్నారు. రాత్రి 7గంటల వరకు 43వేలమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించడంలో టిటిడి పూర్తిస్థాయిలో విజయవంతమవుతోంది. గత ఏడాది జనవరిలో జరిగిన వైకుంఠద్వార దర్శనాలు కల్పించడంలో పెద్ద పొరబాట్లు, నిర్లక్ష్యంతో ఈ ఏడాది టిటిడిలో బోర్డు సభ్యుల నుండి ఉన్నతాధికారులు, క్రిందిస్థాయి అధికారులు వరకు ప్రతి ఒక్కరి బాధ్యతను, భద్రతను గుర్తుచేసేలా పక్కా వ్యూహంతో సాఫీగా చేస్తున్నారు. తమిళనాడు, కర్నాటక,మహారాష్ట్ర, కేరళ తెలుగురాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. టిటిడి ఉన్నతాధికారులు ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎక్కడా చిన్నపాటి పొరబాట్లు, తప్పిదాలు జరగకుండా ఎవరికివారే అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు బాధ్యతతో ఆలయ మాఢవీధులు, వెలుపల క్యూలైన్లలో సకల సౌకర్యాలు భక్తులకు కల్పిస్తూ క్యూలైన్లను చక్కగా తోపులాటకు అవకాశం లేకుండా నిర్వహిస్తున్నారు. భక్తులు కూడా సంతోషం వ్యక్తం చేయడం టిటిడి అధికారుల పనితీరుకు నిదర్శనం, భక్తులు ప్రశాంతంగా,సాఫీగా క్యూలైన్లలోనికి చేరుకునేలా,ఆలయంలోపలకు చేరుకునే వరకు తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్‌పిఎఫ్ బలగాలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. లక్షమందికిపైగా భక్తులు చేరుకున్నా వైకుంఠమ్ 1లోని ఇంటిగ్రేటెడ్‌కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరాయంగా ఏఐ విధానంలో పర్యవేక్షిస్తూ క్యూలైన్లను కదిలేలా చూస్తున్నారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, కాఫీ,టీ,పాలు అందించేలా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వయంగా పరిశీలిస్తున్నారు. పదిరోజుల వైకుంఠ దర్శనాలను మరో ఐదురోజులు కూడా మరింత ప్రశాంతంగా, భక్తులు ఆనందించేలా విజయవంతంగా నిర్వహించేలా అధికారులు నిమగ్నమయ్యారు. వైకుంఠద్వార దర్శనాల్లో తొలిరోజు డిసెంబర్ 30న 67,053మంది భక్తులు, 31న 70,256మంది భక్తులు, జనవరి 1న 65,225మంది భక్తులు, నాల్గవరోజు శుక్రవారం 83,032మంది భక్తులకు దర్శనాలు చేయించడం టిటిడి అధికారుల సమిష్టికృషికి నిదర్శనం,



# తిరుమల సమాచారం

## ముందస్తు ప్రణాళికలతోనే ఆలయాల్లో సమయానికి కైంకర్యాలు, వాహనసేవలు

### - టిటిడి ఇఒ ఎకె సింఘాల్

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం అనుబంధంగా ఉన్న ఆలయాలు,స్థానిక ఆలయాల విశిష్టతను భక్తులకు అందించేందుకు అసవరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఆలయాల్లో క్యూలైన్లు, సిసిటివిలు, సెక్యూరిటీ, రవాణా, ట్రాఫిక్ తదితర అంశాలపై ,సరైన సమయానికి కైంకర్యాలు, వాహనసేవలకు సంబంధించి ,ప్రధాన ఉత్సవాలు నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు ఉండాలన్నారు. టిటిడి స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాల ప్రాశస్త్యం, శిల్ప సౌందర్యం ప్రధాన అంశాలను భక్తులకు చేరవేసేందుకు అవసరమైతే నిజమైన పారదర్శకతకు కృత్రిమ మేధ సాంకేతికతను సాయం తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్‌ఎసిఎఒ బాలాజీ, సిఇ టివి సత్యనారాయణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఇఒ సింఘాల్ పలు అంశాలపై సమీక్షించారు. భక్తులకు వైద్యసేవలు, శ్రీవారిసేవకుల సేవలు, పుష్కరిణిని శుభ్రంగా ఉంచేలా చర్యలు, బడ్జెట్, వ్యర్థాలనిర్వహణపై ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నప్రసాదాల కోసం ఉన్న అన్ని అకౌంట్లను ఉపయోగించుకోవాలని, ఆలయాల్లో అన్నదానం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు., టిటిడి ఆలయాల్లో విశిష్టతను భక్తులకు మరింతగా అందించేందుకు అవసరమైతే ఎస్వీబిసి ఆధ్వర్యంలో మరో ఛానెల్ తీసుకువచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇఒ సింఘాల్ తెలిపారు.



## రిలయన్స్‌సంస్థ టిటిడికి రూ.3కోట్లు విరాళం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం కు రిలయన్స్ సంస్థ పలు పథకాలకు మూడుకోట్ల రూపాయలు విరాళం అందించింది. ఆ సంస్థ సిఇఒ ,ఇడి పిఎంఎస్ ప్రసాద్ శనివారం ఉదయం టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్‌కు డిడిని అందజేశారు. రిలయన్స్‌సంస్థ పలు దఫాలుగా పలు రకాలుగా టిటిడికి ఇతోధిక సేవలందించడమే గాక విరాళాలు అందిస్తోంది.



## ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు దాత విరాళం అందించాడు. ఒడిశ్శాకు చెందిన శివకాండీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిని ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందించారు.



## సూర్యజయంతికి విస్తృత ఏర్పాట్లు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దు చేసింది. ఈ మినీబ్రహ్మోత్సవం కోసం అన్ని రకాల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు,జర్మన్ షెడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు.


**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR**
ANANTHAPURAMU - 515 002 (A.P.) INDIA

**XV CONVOCATION NOTIFICATION**

The XV Convocation of Jawaharlal Nehru Technological University Anantapur, Ananthapuramu is tentatively scheduled in the month of February/March, 2026. All UG, PG and Ph.D. Candidates who are qualified for the award of degree during the Academic year 2024-25 are hereby informed to submit the applications through Online only (https://jntuaebranchpayment.in/originaldegree) on or before **15.02.2026.** Only Ph.D. Awardees and Gold Medalists will receive the degrees on the dais and others will receive their degrees through registered Post/Courier. Further details can be seen in the web site: www.jntua.ac.in under Examinations section.

Date: 04.01.2026 **Sd/- REGISTRAR**

**AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.**
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237

**CORRIGENDUM**

**Employment Notification No.3/2025, Dt. 03.01.2026**

In continuation of the recruitment notification Issued earlier for various **contract/ deputation posts** in **Amaravati Growth and infrastructure Corporation Limited (AGICL)**, it is hereby informed that the **salary and allowance details for the following posts stand revised** as indicated below:

| Sl. No. | Name of the Post | Details as Published | Revised Details |
|---|---|---|---|
| 1 | Receptionist | Salary: Rs.50,000/-p.m. | Salary: Rs. 25,000/-p.m. |
| | | Health Insurance Allowance: Rs. 10,000/- p.m. | Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 2 | Data Entry Operator (DEO) | As per earlier notification | Salary: Rs. 25,000/-p.m. |
| | | | Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 3 | ITSupport/IT Executive | As per earlier notification | Salary: Rs. 40,000/-p.m. |
| | | | Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 4 | Assistant Engineer(AE) | As per earlier notification | Salary: Rs. 55,000/-p.m. |
| | | | Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 10,000/- p.m. |
| 5 | Administrative Officer(AO) | As per earlier notification | Salary: Rs. 40,000/-p.m. |
| | | | Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |

All other **terms and conditions, including nature of engagement, eligibility, selection process, and contract conditions,remain unchanged.**
This corrigendum shall form an **integral part of the original recruitment notification** and shall be read in conjunction with the same.

**Sd/- Managing Director, AGICL, Amaravati.**


## సంక్రాంతి పండుగ దృష్ట్యా - విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపే వాహనాలకు అనుమతి



**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ దృష్ట్యా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపు వాహనాలకు అనుమతినిచ్చింది. తొలుత కార్లు, ద్విచక్ర వాహనాలను ఈ మార్గంలో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్ మీదుగా నేరుగా గొల్లపూడి, అక్కడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లవచ్చు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాక్షికంగా ఒక వైపు వాహనాలు వెళ్లేందుకు అనుమతినిచ్చే దిశలో ఆలోచన చేస్తున్నారు. వెస్ట్ బైపాస్‌లో భాగంగా కాజ- గొల్లపూడి మధ్య 17.88 కి.మీ, గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య 30 కి.మీ. ఆరు వరుసల హైవే నిర్మాణం చేపట్టారు. గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య నిర్మాణం పూర్తికాగా నవంబరు నుంచి ఇందులో అన్ని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఇప్పుడు కాజ- గొల్లపూడి మధ్య కూడా ఒకవైపు వాహనాలను అనుమతించనున్నారు. కాజ నుంచి గొల్లపూడి వైపు (ఒకవైపు) మార్గాన్ని సంక్రాంతికి సిద్ధం చేస్తున్నారు. చెన్నై- కోల్‌కతా హైవేకు ఈ వెస్ట్ బైపాస్‌లోకి అనుసంధానం అయ్యే పనుల్లో ఒకవైపు పూర్తయ్యాయి. దీంతో చెన్నై, ఒంగోలు, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను కాజ సమీపంలో వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి గొల్లపూడి చేరుకొని, అక్కడ విజయవాడ- హైదారాబాద్ హైవేలో కలవవచ్చు. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు గొల్లపూడి వద్ద దిగకుండా నేరుగా చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు రోడ్డుపైకి చేరుకోవచ్చు. దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే కార్లు విజయవాడ నగరంలోకి రావాల్సి అవసరం లేకుండానే బైపాస్‌లో ఒకవైపు ప్రయాణించి హైదరాబాద్ వైపుగాని, ఏలూరువైపు వెళ్లవచ్చు. ఇందుకు వీలుగా సంక్రాంతి నాటికి అధికారులు పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్‌లో అటు ఏలూరు, గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైకులు తదితర వాహనాలను ప్రస్తుతం రాష్ట్ర సచివాలయం, హైకోర్టులకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ వాహనాలు కృష్ణా నది వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత వచ్చే టోల్‌ప్లాజా సమీపంలో మంగళగిరి మందడం రోడ్డులోకి చేరుకొని, అక్కడి నుంచి సచివాలయం [illegible] వెళ్తున్నాయి. ఇలా గొల్లపూడి వైపు నుంచి వాహనాలను ఈ నెలాఖరుకు హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతించేలా బైపాస్‌లో రెండో వైపు కూడా పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్ నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్‌లో దిగే వాహనాలు చెన్నైకోల్‌కతా హైవే సర్వీస్ రోడ్డులోకి వెళ్తాయి. మార్చి నెలాఖరులోపు వెస్ట్ బైపాస్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయనున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చెన్నై- కోల్‌కతా హైవేపై వెళ్లే అన్ని వాహనాలను వెస్ట్ బైపాస్ మీదుగా ఇరు వైపులా పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించేలా అనుమతిస్తారు. అధికారికంగా ఆనాటి నుంచే వెస్ట్ బైపాస్ పూర్తిగా తెరిచినట్లు అవుతుందని, అప్పటి వరకు చిన్న వాహనాలను ప్రయోగాత్మకంగానే

జిల్లాల మార్పులు అధికారికంగా అమల్లోకి గత నెలాఖరు నుంచే వచ్చాయి, జిల్లాల పునర్విభజన, రెండు కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకుమరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని సీఎం చంద్రబాబు కేబినెట్ భేటీలో స్పష్టం చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పడిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల స్థానిక అభివృద్ధి, పాలనా సమన్వయానికి కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడం, అభివృద్ధి వికేంద్రీకరణ, పాలనా వేగం పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గూడురులోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. రంపచోడవరం ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కుంటుపడకుండా ఉండేందుకు, ఒకే పార్లమెంట్ పరిధిలో మూడు జిల్లాలు ఉన్నా కూడా ఈ జిల్లా ఏర్పాటు చేశామని వివరించారు. సామర్లకోట మండలాన్ని పెద్దాపురం నియోజకవర్గానికి మార్చినట్లు తెలిపారు. అలాగే పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండగా పేరు మార్చినట్లు వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్చినట్లు వివరించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండ పాలెం నియోజకవర్గాలను కలిపి మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలోకి చేర్చామని తెలిపారు. రాజంపేటను ఎప్పటి నుంచో జిల్లా కేంద్రంగా చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రజల అభిప్రాయం మేరకు కడప జిల్లాలోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మదనపల్లిని జిల్లాగా చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదని, అందువల్ల రాయచోటి నుంచి మదనపల్లికి హెడ్ క్వార్టర్ మార్చి అన్నమయ్య జిల్లాగా మార్పు చేశామని వివరించారు.

# సంస్కరణల బాటలో రెవెన్యూ వ్యవస్థ

**ఘంటా విజయకుమార్**

ఏపీలో రెవెన్యూ వ్యవస్థలో వినూత్న సంస్కరణలతో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సంచలనాలు సృష్టించింది. గత ఏడాది రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా పునర్విభజన జరిపింది. ఈ అంశంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో పార్లమెంటు నియోజకవర్గం పరిధి హద్దుగా 26 జిల్లాలను ఏర్పాటు చేసారు. అయితే ఈజిల్లాల ఏర్పాటుపై తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకుంది. జిల్లా కేంద్రాలకు దగ్గర ఉండే మండలాలను మరో జిల్లా చేర్చిన పరిస్థితి. వీటన్నింటిని గమనించి రాష్ట్రంలో కొత్తగా అయిదు రెవెన్యూ డివిజన్‌లు, కొత్తగా పోలవరం, మార్కాపురం జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. అభ్యంతరంగా పలకడానికి కష్టంగా కొన్ని గ్రామాలు, మండలాల పేర్లను మార్చారు. రవాణా సదుపాయాలు, మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకుని మొత్తం 17 జిల్లాల్లో మార్పులు చేసింది. జిల్లా కేంద్రాన్ని మార్చింది. రైతాంగం గత ప్రభుత్వంలో భూముల సమగ్ర సర్వే విధానం, పాస్‌పుస్తకాలపై నాటి సీఎం చిత్రం, సరిహద్దు రాళ్లపై నాటి సీఎం బొమ్మలు వివాదానికి గురయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పట్టదారు పుస్తకాలను వెనుక తీసుకుంది. రాజముద్రతో దగ్గర,దగ్గరగా 22లక్షల మందికిపైగా రైతులకు పట్టాదారు పాస్‌లు అందజేస్తుంది. ఇందుకుగాను గ్రామ సభలు నిర్వహిస్తుంది.ఈ సందర్భంలోనే రాష్ట్రంలో 22ఎ జాబితాలో ఉన్న ఐదురకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన దస్త్రంపై ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కీలక ప్రకటన చేసారు. నూతన సంవత్సరం కానుకగా రైతులకు, భూయాజమానులకు ఉపశమనం కల్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో ఐదు రకాల భూములను 22ఎ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. మాజీ, ప్రస్తుత సైనిక ఉద్యోగులు, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954 జూన్ 18కు ముందు అసైన్ చేసిన భూములు, ప్రైవేట్ పట్టా భూములను 22ఎ నుంచి తొలగించినట్లు చెప్పారు. భూ కేటాయింపులు కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్ గానీ 10(1) రిజిస్టర్, అడంగల్స్, ఎస్ఎఫ్ఎ వంటి పాత రెవెన్యూ రికార్డులు, ఎసైన్‌మెంట్ రిజిస్టర్లు లేదా డిఆర్ డికెటి పట్టాల్లో ఏదైనా ఒకటి ఉన్నా 22ఎ నుంచి తొలగించాలని అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. అధిక పత్రాలు కావాలంటూ భూ




యజమానులను తిప్పుకోవద్దన్నారు. కొంత భూమి కోసం ఆ సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంటే అటువంటి భూమిని సబ్ డివిజన్ చేసి నిషేధిత జాబితాలో ఉంచుతామని తెలిపారు.షరతులు గల పట్టా భూములు, సర్వీస్ ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ సర్వే సమయంలో మరలా 22ఎ చేర్చిన చుక్కల భూములు, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని అదనపు సిబ్బందిని ఈ శాఖలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రజలకు అనుకూలంగా మార్చేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్లను ఏమాత్రం ఉపేక్షించబోమని, వీటిని రద్దు చేసే అధికారం జిల్లాల కలెక్టర్లకు ఇస్తున్నామని వివరించారు. గ్రామసభలు నిర్వహించి పాస్ పుస్తకాలను అందజేస్తామని ఆయన తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివరాల ప్రకారమే, ఎలాంటి తప్పులు లేకుండా పాస్‌పుస్తకాల పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.అయితే పాస్‌పుస్తకాలు ఇచ్చేటప్పుడు రైతుల వద్ద నుంచి తప్పకుండా వేలిముద్ర తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఆ పాసు పుస్తకాల్లో తప్పులు ఉంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులే స్వయంగా రైతుల ఇళ్లకు వచ్చి తప్పులు సరి చేస్తారని మంత్రి వెల్లడించారు. అన్ని జిల్లాల్లో రెవెన్యూ క్లినిక్‌లను విస్తరించి భూసమస్యలను త్వరగా పరిష్కారిస్తామని తెలిపారు. ప్రభుత్వ చర్యలవల్ల ఈసంవత్సరం భూమి నామ సంవత్సరంగా ఉంటుందని ఆయన అన్నారు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వైరామవరం,గుర్తేడు, అడ్డతీగల,గంగవరం,మారేడుమిల్లి, రాజవొమ్మంగి, మండలాలున్నాయి.చింతూరు రెవెన్యూ డివిజన్‌లోఎటపాక, చింతూరు, కూనవరం, వర రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా మార్కాపురం కేంద్రంగా నూతనంగా ఏర్పాటైన జిల్లాలో 21 మండ లాలు ఉన్నాయి. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లుఉన్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలో గిద్దలూరు, బేస్త వారిపేట, రాచర్ల, కొమరోలు,కంభం, అర్ధవీడు, మార్కాపురం, తర్లుపాడు, యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపు రాంతకం, దోర్నాల,పెద్దారవీడు, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో హనుమంతుని పాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు మండలాలు ఉన్నాయి. కొత్త రెవెన్యూ డివిజనలలో అద్దరోడ్డు జంక్షన్ (7 మండలాలు)లో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్ రాయవరం. అద్దంకి (10మండలాలు)లో అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్ల మూరు, తాళ్లూరు, దర్శి,దొనకొండ, కురిచేడు పీలేరు, అన్న మయ్య జిల్లా (8 మండలాలు)లో సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ,కంభంవారిపల్లి, కలికిరి, వాల్మీకీపురం మడకశిర, సత్యసాయిజిల్లా (5మండలాలు)లో మడకశిర, గుడిబండ, రోళ్ల, అమరాపురం,అగలి బనగానపల్లి,నంద్యాల జిల్లా (5 మండలాలు)లో బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల కొత్త మండలం ఆదోని మండలం రెండుగా విభజన ఆదోని1 (29 గ్రామాలు), ఆదోని2 (17 గ్రామాలు) అన్నమయ్య జిల్లా సర్దుబాటుల్లో రైల్వే కోదూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి చేరింది. కందుకూరు డివిజన్‌లోని వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లో కలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని 5మండలాలను బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి మార్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలిపారు. తిరుపతి జిల్లాలోని గూడూరు రెవెన్యూడివిజన్‌లో మార్పులు, చేర్పులు చేశారు. గూడూరు,చిల్లకూరు, కోట మండలాలతో కూడిన గూడూరు రెవెన్యూడివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలిపారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోకి కలువాయి మండలాన్ని కలిపారు.నెల్లూరు డివిజన్‌లో రాపూరు,సైదాపురం మండలాలు కొనసాగనున్నాయి.సిద్దవటం,ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆదోనిలో పరిపాలనా సౌలభ్యం కోసం మండలాల సంఖ్యను పెంచి ఆదోని-1,ఆదోని-2గా విభజించినట్లు ప్రకటించారు. రాయచోటి జిల్లాకేంద్రం అంశంపైప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లాస్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీఇచ్చారు.ముఖ్యంగా జిల్లాలపునర్విభజన, పరిపాలనా మార్పులు,రెవెన్యూ, పోలీస్‌వ్యవస్థల సరిపోలిక, అలాగే కొన్ని ప్రాంతాల అభివృద్ధి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో మంత్రులకు,ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేశారు.రాష్ట్రపరిపాలన మరింత సమర్థవంతంగా ఉండాలంటే భౌగోళిక,జనాభా,పరిపాలనా అవసరాలకు అనుగుణంగా జిల్లాలనిర్మాణం ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ●

---

రాష్ట్రం
మహారాష్ట్ర

# మరో మలుపు!

**ఎ.వి.వి ప్రసాద్**

పోరు నష్టం, పొందు లాభం.. అన్నారు. ఎన్నికల విజయమే పరమావధి అయినప్పుడు ఎలాంటి సైద్ధాంతిక అవరోధాలు ఉండవనడానికి ఇద్దరు పవార్‌ల తాజా ఎత్తుగడే ఉదాహరణ. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం థాకరే సోదరులిద్దరూ చేతులు కలుపుతున్నపుడు తామెందుకు దూరంగా ఉండడం అనుకున్నారో ఏమో! శరద్ పవార్, అజిత్ పవార్ కూడా ఒక్క పీటపైకి వచ్చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో గతవారం ఇది కీలక పరిణామం. విడిపోయిన రాజకీయ కుటుంబాలు తిరిగి కలవడంలో తప్పులేకపోయినా ఎన్నికలే లక్ష్యంగా సాగడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పుడందరి దృష్టి ముంబయి కార్పొరేషన్ పైనే పడింది. అక్కడ పట్టు దొరికితే రాష్ట్ర రాజకీయాలను శాసించవచ్చని నాయకులు భావిస్తుండడంతో ప్రత్యర్థులు కూడా చేతులు కలిపి తమ సత్తా నిరూపించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. శివసేన ఒకవర్గం అధినేత ఉద్ధవ్ థాకరే,మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధినేత రాజ్ థాకరే రెండు వారాల క్రితం కార్పొరేషన్ ఎన్నికలకు పొత్తు కుదుర్చుకొనడంతో మిగిలిన పక్షాల్లో కూడా ఆలోచన మొదలయింది. 'కయ్యమెందుకు, కలిసి సాగుదాం' అనుకొంటూ ఒకరితో ఒకరు పొత్తులు కుదుర్చుకొంటున్నారు. అదే బాటలో ఎన్సీపి వర్గాల అధినేతలు అజిత్ పవార్, ఆయన బాబాయ్ శరద్ పవార్ జతకట్టడం తాజా విశేషం.కుటుంబ మంతా ఒక్కచోటకు చేరిందని అజిత్ పవార్ ప్రకటించడంతో ఇతర పార్టీల అధినేతలలోకూడా 'పునరేకీకరణ' ఆలోచనలు మొదలయ్యాయి.తమ గుర్తు గడియారం, శరద్‌పవార్ గుర్తు బాకా కలిసి పోయాయని అజిత్ అనడం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సూచిక అని చెప్పవచ్చు. పింప్రి చించ్వాడ్ కార్పొరేషన్ విషయంలో సీట్ల సర్దుబాటు జరిగిందనీ, పుణే, ముంబయి కార్పొరేషన్‌లకు సంబంధించి కూడా వారిద్దరి మధ్య లోపాయికారీగా ఒక అవగాహన కుదిరిందనీ తెలుస్తోంది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో మెజారిటీ సంఖ్య దక్కించుకొనడానికి అటు అధికార మహా యుతితో పాటు ఇటు విపక్షాలు కూడా ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే అధికార కూటమిలోనే ఉన్న అజిత్ ఎన్సీపి విపక్ష ఎన్సీపీతో చేతులు కలపడంతో కార్పొరేషన్ ఎన్నికలు చాలా ఆసక్తికరంగా మారాయి. 1999లో శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పటినుంచి రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్రనే పోషిస్తోంది. అంతకు ముందు కాంగ్రెస్‌లో చక్రం తిప్పినశరద్ పవార్ సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కూడా జాతీయ రాజకీయాల్లో సైతం కీలక పాత్రనే పోషిస్తూ వచ్చారు. తర్వాత కాంగ్రెస్, బిజెపి కూడా ఆయనతో జతకట్టే ప్రయత్నాలు చేశాయి. అదే ఎన్సీపి చరిత్రను అనేక మలుపులు తిప్పింది.శరద్ సోదరుని కుమారుడైన అజిత్ పవార్ పార్టీలో సీనియర్ నాయకుడే గాక పలుమార్లు డిప్యూటీసీఎం


అజిత్,శరద్

కూడా కావడంతో ఆయన శరద్‌కు దీటుగా ఎదిగారు. 2023 జులైలో ఎన్సీపికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అజిత్ నాయకత్వంలో ఎన్డీయేతో చేతులు కలపడంతో ఇద్దరు పవార్‌ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరి పార్టీలో చీలికకు దారితీశాయి. శరద్ పవార్ అంతకు ముందు బిజెపితో పొత్తుకు యత్నించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన అజిత్ తర్వాత అదే బాటపట్టడం అప్పట్లో తీవ్ర విమర్శలకు గురైంది. డిప్యూటీ సీఎం పదవి కోసమే ఆయన అలా ప్లేటు ఫిరాయించారని కూడా అప్పట్లో వినిపించింది. ఆయనకు అప్పటి లక్ష్యం (ఇప్పటికీ) ముఖ్యమంత్రి పదవి. కాంగ్రెస్, శివసేనతో పొత్తుల కారణంగా అజిత్ ఆ పదవిని సాధించలేకపోయారు. చివరికి బిజెపితో చేతులు కలిపినా మళ్లీ డిప్యూటీ సీఎం దగ్గరే ఆగిపోయారు. శరద్ కుమార్తె సుప్రియా సులే పార్టీలో కీలకం కావడాన్ని భరించలేకపోయిన అజిత్ పార్టీలో చీలిక తెచ్చినా, ఎన్డీయేలో చేరినా ఆశించిన ఫలితం దక్కకపోవడంతో ఇప్పుడు మళ్లీ శరద్‌తో చేతులు కలిపే ప్రయత్నాలు చేస్తున్నారు. కుమారునిపై గల వివిధ భూ కుంభకోణ ఆరోపణలు కూడా అజిత్‌ను ఆలోచింపజేస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలోని షిండే శివసేన ఎన్నికలు జరిగినప్పటి నుంచీ అంటీ ముట్టనట్లుగానే ఉంటోంది.దానికి కారణం షిండేకు మళ్లీ సిఎం పదవి లభించకపోవడం.కూటమి నుంచి ఆయన బయటకు వెళ్లిపోవచ్చని అప్పుడే అంతా అనుకున్నారు కానీ ఎదురుదెబ్బలు తప్పవని గ్రహించి అలాగే కొనసాగుతున్నారు.అయితే తాజా స్థానిక ఎన్నికల్లో ఆయన వర్గానికి తక్కువ సీట్లు కేటాయించడంతో పొరుగు పార్టీల వైపు దృష్టి సారించడం ఆరంభించారు. ఇప్పుడుకార్పొరేషన్ ఎన్నికల కోసం శరద్ అజిత్ వర్గంతో చేతులు కలపడానికి షిండే నిర్ణయించడం మరో ఆసక్తికర పరిణామం. నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసినా ఆయా పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరుగుతున్నట్లు సమాచారం. మునిసిపల్ కౌన్సిల్, పంచాయతీ ఎన్నికల్లో అధికార కూటమి ఘనవిజయం సాధించడంతో కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బిజెపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వచ్చాయి. దానివల్లే షిండే, అజిత్ వర్గాలు బిజెపికి దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది.అజిత్ కుమారునిపై గల భూకుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు ఫడ్నవీస్ ప్రభుత్వం సిద్ధం కావడం కూడా తాజా పరిణామాలకు కారణం కావచ్చు. సమీకరణాలు ఇలాగే మారితే మళ్లీ అసెంబ్లీ ఎన్నికల నాటికి చాలా రాజకీయ పరిణామాలే సంభవించవచ్చు. శివసేన వర్గాలు,ఎన్సీపి వర్గాలు, కాంగ్రెస్ తిరిగి ఏకమైతే అసెంబ్లీ ఫలితాలు కూడా తారుమారు కావొచ్చు. అయితే బిజెపి అలాంటి పరిణామాలను సాగనివ్వకపోచ్చని కూడా అంటున్నారు. ఏదిఏమైనా కార్పొరేషన్ ఎన్నికలతో మహారాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతాయనే చెప్పాలి. ●

---

దేశం
ఇరాన్

# 'జెన్‌జెడ్' వణుకు

**గన్ని మోహన్**

జెన్‌జడ్ ఉద్యమం ఇప్పుడు మరో దేశానికి పాకింది. మొదట శ్రీలంక,ఆ తర్వాత నేపాల్ తాజాగా బంగ్లాదేశ్ ఇప్పుడు పశ్చిమాసియా పర్షియన్‌దేశం ఇరాన్‌కు ఎగబాకింది. ఇరాన్ దేశ ప్రజలు ప్రత్యేకించి యువత ఆదేశ సుప్రీం అధినేత అయ్‌తొల్లా ఖమైనీ పేరుచెపితే చాలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లోకి ఎగబాకిన ఈఉద్యమం ఎటువైపు వెళుతుందోనన్న ఆందోళన పెరుగుతోంది.ఓపక్క అధికార పెద్దలు అయితే ఇదంతా అమెరికా ఎగదోస్తున్న కుట్రలని చెపుతున్నా దేశంలోని టీనేజిలోకం మొత్తం జెన్‌జడ్ ఉద్యమంవైపు పరుగులు తీసారు. అయొతొల్లాఖమైనీ శకం ముగిసిపోవాలని దేశం అభివృద్ధిలోకి రావాలని యువత కోరుతోంది. దేశంలో చమురు, సహజవాయునిల్వలు అపారంగా ఉన్నప్పటికీ అమెరికా ఆంక్షలు, యాజమాన్యలోపం, పెచ్చుమీరిన అవినీతి కారణంగా ఇప్పటికీ అల్పాదాయ దేశంగానే కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం ముందెన్నడూ లేని విధంగా 42శాతానికి పెరిగింది. అంటే ఇక నిత్యావసర వస్తువులేవీ కూడా సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో లేనట్లే. ఉపాధికొరవడి పేదరికం పెరిగిపోతోంది.అత్యధిక ఉన్నత విద్యావంతులున్నప్పటికీ ఆర్థికంగా ఎదిగేస్థాయి ఉన్నప్పటికీ అగ్రరాజ్యాల ఆంక్షలు ఇరాన్‌ను ఎదగనీయడంలేదన్న దుగ్ధ ఆదేశ యువతలో పేరుకుపోయింది. ఇందుకు ప్రధాన కారణం దేశంలో ఉన్న ఛాందసవాద ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నది. దేశంలోని లార్గెడాన్, కుహ్‌దష్ట్, ఇస్ఫాహన్‌లో హింస ప్రజ్వరిల్లింది. నిరసనకారులకు భద్రతా సిబ్బందికి తీవ్రస్థాయిలో జరిగిన ఘర్షణల కారణంగా పదిమందికిపైగా ఈ ఆందోళనలకు బలైపోయారు. షియామతాధికారులున్న కోమ్‌కు సైతం ఈ నిరసనలు చేరాయి. టెహ్రాన్, మషద్, ఇస్ఫహాన్, లోరెస్తాన్, ఖుజెస్తాన్ వంటి నగరాల్లో ఈ ఆందోళనలు మరింతగాపెరిగాయి. దేశంలో ఉన్న పదికిపైగా యూనివర్సిటీల విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. దేశంలో నియంతలకు మరణశిక్ష విధించాలంటూపెద్ద పెట్టున నినాదాలతో వీధుల్లో ర్యాలీకి సైతం తెగబడ్డారు. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, అమెరికా డాలర్‌తో ఇరాన్ రియాల్ విలువలు భారీగా పడిపోయాయి. ఒక డాలరు విలువ ఏకంగా 1.38 మిలియన్ రియాల్స్‌గా మారింది.మూడేళ్ల క్రితం సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహ్మద్ రెజా ఫర్జిన్ బాధ్యతలు చేపట్టినపుడు కరెన్సీ విలువ డాలరుకు 4.30లక్షల రియాల్స్‌గా ఉండేది. మూడేళ్లలోనే విలువలు మిలియన్ దాటిపోయాయి. సగటు ఉద్యోగి నెలకు 100 డాలర్లు అంటే 9 వేలు సంపాదించగులుగుతున్నారు. కేవలం నిత్యావసర సరుకుల కొనుగోలుకే సరిపోతున్నాయి. చమురు ఉత్పత్తి, విక్రయాలపై అమెరికా ఆంక్షలతో ఇప్పుడు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా కూడా చేసారు. ఆహారం, మందులు కొనలేనిపరిస్థితి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు వంటి వాటితోప్రజలు విసిగిపోయారు. ముఖ్యంగా 1997 నుంచి 2010 మధ్య జన్మించిన జెనరేషన్ జూమర్స్‌లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఫలితంగానే కొత్తసంవత్సరం ముందు నుంచే ఆందోళనలు మిన్నంటాయి. దీనికితోడు గత ఏడాదిఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరిగిన యుద్ధం కూడా ఇరాన్‌కు షాక్ తగిలింది. ఇరాన్ రక్షణ వ్యవస్థ, అణుకేంద్రాలు ధ్వంసం అయ్యాయి. ఖమేనీ ఇక ఉనికిలో ఉండకూడదన్న ఇజ్రాయెల్ వ్యాఖ్యలతో ఇరాన్‌మనుగడకు సైతం గండిపడే పరిస్థితి దాపురించింది. ప్రస్తుత సుప్రీం లీడర్ ఖమేనీకి 86 ఏళ్లు. ఖమేనీ వారసుడుగా ఎవరు వస్తారన్న అంశంపైనా దేశంలో అంతర్గతపోరు సాగుతోంది. నిరసనలు తీవ్రం అయితే ఖమైనీ అధికారం నుంచి అనివార్యంగా తప్పుకుంటారని వినిపిస్తోంది. అయితే అదేమీ అంత సులువేమీ కాదని, భద్రతా సంస్థలు, మతపరమైనసంస్థల్లో ఆయనకు మంచి పట్టుఉందని అందువల్లనే ఇప్పట్లోవారసుడు అనేప్రశ్న ఉత్పన్నం కాదన్నవాదన వస్తోంది.ప్రస్తుతం దేశంలో ఉన్నపరిస్థితుల దృష్ట్యా తలసరి ఆదాయం 4300 డాలర్లుగా ఉంది. పేదరికం36శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా పెరిగింది. కేవలం కొద్ది మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతమైంది. సుపరిపాలన కొరవడి,అవినీతి పెచ్చుమీరడం, వనరులు బదలాయింపు పెరిగిపోవడం వల్లనేఇరాన్ పతనం అంచున ఉన్నట్లు తెలుస్తోంది. చమురు రాబడులు సంక్షేమం కంటే ఎక్కువగా మిలిటరీ, ప్రాంతీయ కార్యకలాపాలకే కేటాయింపులు జరుగుతుండటంతో యువతలో ఆక్రోశం పెరిగిపోయింది. విద్యుత్,మంచినీటి కొరత కూడా మరో పక్క ప్రజలనుపీడిస్తోంది. మూడేళ్లక్రితంమెహసా అమ్నిఅనే యువతి బురఖా సరిగ్గా వేసుకోలేదని మొరాలిటీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఆమె కస్టడీలోనే మరణించింది. ఆనాడే పెద్దఎత్తున నిరసనలు పెరిగాయి.ఈపరిస్థితిలోనే అమెరికా జోక్యం తప్పదంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. ప్రజలను కాల్చిచంపుతుంటే ఉపేక్షించేదిలేదని అమెరికా జోక్యం అనివార్యమంటూ ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్ పాలకుల్లో ఆగ్రహం రప్పించాయి. దేనికైనా రెడీయేనని ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలన్నీ కూడా ఈ పాశ్చాత్య కుట్రలేనని ప్రత్యారోపణలు చేసారు. కేవలం 9.28 కోట్లమందికి మించిన జనాభాలేని ఇరాన్‌లో 90 శాతం షియాముస్లింలే ఉన్నారు.సున్నీముస్లింలు మైనార్టీలు, స్వల్పమోతాదులో క్రైస్తవులు, జ్యూష్ తెగలు, జోరాస్ట్రియన్లు, బహైయిస్ ఉన్నారు. అధికారం మొత్తం షియాల అధీనంలోనే ఉంది. దీనివల్లనే ఇప్పుడు గల్ఫ్‌దేశాలు కూడా ఇరాన్‌కు మద్దతిచ్చే అంశం కూడా అంటీముట్టనట్లుగా ఉన్నాయి. ఏదిఎలా ఉన్నా ఇప్పుడు ఇరాన్‌లో వెల్లువెత్తిన ఈ జెన్‌జడ్ నిరసనలు ప్రభుత్వ పతనంవైపు దారితీస్తున్నాయి.ఆ దిశగానే ఇప్పుడు పాలకుల్లోకూడా ఆందోళనలు పెరిగాయనడంలో ఎలాంటి సందేహంలేదు. ●


ఖమైనీ

---

# ఆరావళి ఆర్తనాదం ప్రమాదంలో పర్యావరణం


**సుంకవల్లి సత్తిరాజు**

మన దేశంలో ఆరావళి పర్వత పంక్తులు, పశ్చిమ కనుమలు, హిమాలయాలు పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణలో విశేష భూమిక పోషిస్తున్నాయి. ఆరావళి పర్వత శ్రేణి సుమారు 2లేదా 3 బిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన అత్యంత ప్రాచీనమైన భారతీయ సహజ సంపదగా పేర్కొంటారు. అయితే ఆరావళి పర్వత శ్రేణుల్లో ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు జరపడంవలన పర్యావరణం దెబ్బతింటుందనే ఆందోళన ప్రారంభమైనది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని మార్చి, చట్టబద్ధత కల్పించి మైనింగ్ జరపడానికి ప్రయత్నాలు చేయడం సహించరాని విషయం.ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎలాంటి తవ్వకాలు జరపకుండా, పాత తవ్వకాలతో పాటు, ఇక ముందు జరపబోయే కొత్త తవ్వకాలపై కూడా పూర్తిగా నిషేధం విధించాలి. పర్యావరణాన్ని పణంగాపెట్టి, ప్రజలకు ప్రాణసంకటంగా మారిన మైనింగ్‌కు స్వస్తిచెప్పాలి. ఈ సందర్భంగా మనం భారత దేశంలోని పర్వత శ్రేణులను, వాటి ఉపయోగాలను, పర్యావరణానికి, జీవ వ్యవస్థల రక్షణకు వాటివలన కలిగే లాభాలను కూలంకషంగా అధ్యయనం చేయాలి. భూగ్రహంపై ఏర్పడిన సహజసిద్ధమైన భౌగోళిక వ్యవస్థలు మానవ మనుగడకు, ఇతర ప్రాణుల రక్షణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ప్రకృతిలో ఏర్పడిన భౌగోళిక వ్యవస్థలను నాశనం చేయడం వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తాయి. యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించబడిన పశ్చిమ కనుమలు సుమారు లక్షా అరవై వేల చదరపు కిలోమీటర్ల మేర పలు రాష్ట్రాల గుండా విస్తరించి వాతావరణాన్ని,రుతువులను నిర్ణయించడంలో కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి. పశ్చిమ కనుమలు గల కేరళలో అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం వలన పర్యావరణం దెబ్బతిని వయనాడ్ జిల్లాఆకస్మిక వాతావరణ మార్పులతో,భారీ వర్షాలతో అతలాకుతలమైన సంగతి మన స్మృతి పథం నుండి ఇంకాచెరిగిపోలేదు.పశ్చిమ కనుమలకు సంబంధించి, పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన చర్యల గురించి గాడ్గిల్‌కమిటీ సిఫార్సులను పట్టించుకోకుండా, ఎకనామిక్ జోన్ల ఏర్పాటుకు, ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చిన కారణంగానే ప్రకృతి ప్రకోపించి విలయ తాండవం చేసిన వాస్తవాన్ని గమనించాలి. అలాగే హిమాలయాల్లో కూడా మానవ కార్యకలాపాల వలన, పర్యాటక ప్రాంతం పేరుతో జరుగుతున్న అటవీ నిర్మూలన, రహదారుల నిర్మాణంవలన అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. హిమాలయాలు ఎన్నో మిలియన్ల సంవత్సరాల క్రిందట సంభవించిన భౌగోళిక మార్పుల వలన ఏర్పడ్డాయి. ఇవి భారత దేశానికి శతృదుర్భేద్యమైన పెట్టని గోడగా "ఎబోడ్ ఆఫ్ స్నో'గా పిలవబడుతున్నాయి. వాతావరణ పరిస్థితులను నియంత్రించడంలోను, అపారమైన జల రాశులను అందించడంలోను హిమాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గంగ, సింధు, బ్రహ్మపుత్ర వంటి నదుల ఉద్భవం హిమాలయాల్లోనే జరిగింది. గంగా నదికి ఉపనదియైన యుమునా నదితోపాటు, సింధునదికి ఉపనదులుగా పంచనదులుగా పిలవబడే జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్‌లు కూడా హిమాలయాల్లోనే ఉద్భవించాయి. హిమాలయాల వలన బయోడైవర్సిటీ, పర్యావరణం పరిరక్షించబడుతున్నాయి. ఇప్పుడు ఆరావళి పర్వత శ్రేణులు వార్తా పత్రికల్లో పతాక శీర్షికలకెక్కడం గమనార్హం. 670 కి.మీ పొడువునా విస్తరించిన ఆరావళి పర్వత శ్రేణులు హస్తినలో ఆరంభమై, హర్యానా రాజస్థాన్ ల మీదుగా గుజరాత్ వరకు విస్తరించి అహ్మదాబాద్‌లో పరిసమాప్తమౌతాయి. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత శ్రేణుల్లోని పలు కోటలు విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్ వారసత్వ సంపదగా విరాజిల్లుతున్నాయి. భారత దేశంలో రుతుపవనాలకు, వర్షాలకు అనుకూలత గల పర్వత శ్రేణులున్నాయి.ఇవి విభిన్నమైన భౌగోళిక స్వరూపాలతో సహజ సిద్ధంగా ఏర్పడ్డాయి. ఎన్నో పర్వత శ్రేణులు భౌగోళిక, సాంస్కృతిక, జీవవైవిధ్య ప్రాధాన్యతను కలిగి అంతర్జాతీయ వారసత్వ గుర్తింపును పొందాయి. ఆరావళి పర్వత శ్రేణులు, హిమాలయాలు, పశ్చిమ కనుమలు మొదలైనవి జీవవైవిధ్యాన్ని కాపాడుతున్నాయి.ప్రపంచంలో పురాతన పర్వత శ్రేణులుగా ప్రసిద్ధిగాంచిన ఆరావళి పర్వత పంక్తులు జీవ వైవిధ్య రక్షణకు అనుకూలంగా ఉన్నాయి. గాలిలో నాణ్యత లోపించి, నరకప్రాయంగా మారిన ఢిల్లీ వాసులకు ఆరావళి పర్వత శ్రేణి వరప్రదాయినిగా పని చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న విషయం విదితమే. ఆరావళి 'గ్రీన్ షీల్డ్ ఆఫ్ నార్త్ ఇండియా' గాను,'గ్రీన్ బ్యాక్ బోన్' గాను పేరొందింది. రాజస్థాన్‌లోని ఎడారి నుండి వచ్చే



ఇసుక మేఘాలు ఢిల్లీని కమ్మేయడం వలన అనేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఆరావళి మైనింగ్ జరిగితేజరగనున్న నష్టాలను అంచనా వేయలేము. థార్ ఎడారి లోని ఇసుక తూర్పు వైపు పయనించకుండా అడ్డుకుంటూ, నగరాలను, వ్యవసాయ భూములను ఎడారులు కాకుండా ఆరావళి పర్వతశ్రేణులు కాపాడుతున్నాయి. ఆరావళి తవ్వకాల వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందనే నిపుణుల వాదన వాస్తవం. పర్యావరణానికి పెట్టని గోడలా,మానవాళికి రక్షణ కవచంగా ఉన్న ప్రాచీనకాలం నాటిఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ కోసం జరుగుతున్న చర్యలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేయడం, ఇంతకు ముందు తానిచ్చిన ఉత్తర్వులను, మార్గదర్శకాలను నిలుపుదల చేయడం పర్యావరణ ప్రేమికులకు దక్కిన తాత్కాలిక ఉపశమనంగా భావించాలి. ఆరావళి పర్వత శ్రేణులపై మైనింగ్‌కు అనుకూలంగా ప్రయత్నాలు చేస్తూ ప్రాచీన ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం మార్చడం, 100 మీటర్ల కంటే ఎత్తులో ఉన్న వాటినే ఆరావళి పర్వత శ్రేణులుగా నిర్వచిస్తూ, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న పర్వతాలను మైనింగ్ రూపంలో విధ్వంసం చేసే చర్యలకు పూనుకోవడం పర్యావరణానికి పెను విఘాతం. సుప్రీం కోర్టు ఇందుకు తొలుత అంగీకరించినా, తిరిగి తన ఉత్తర్వులను రద్దు చేసి పునర్విచారణ చేపట్టాలని నిర్ణయించడం సమంజసం. పూర్తి స్థాయిలో ఆరావళిపై సుప్రీం తీర్పు వచ్చేవరకు పర్యావరణ ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. అడవులను నరికివేయడం చూస్తున్నాం. దీని పరిణామాలను ఆనుభవిస్తున్నాం. ఇప్పుడు పర్వత శ్రేణులపై దాడికి ఉపక్రమించడం అనుచితం. వర్తమాన ప్రపంచంలో అనునిత్యం భూమిపై దాడి కొనసాగుతున్నది.పర్యావరణ సమస్యల వలన వేలాది జంతువులు,వృక్ష జాతులు అంతరిస్తున్న జాబితాలో ఉన్నాయి. ఎన్నో రకాల కీటకాలు, పక్షులు, వృక్షజాతులు అధికశాతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. జీవులన్నీ ప్రకృతిలో మనతోపాటు జీవించే అవకాశాన్ని మనమే లేకుండా చేస్తున్నాం. జీవవైవిధ్యం మానవాళి మనుగడకు అవసరం.జీవ సమతుల్యత లోపిస్తే జరగబోయే పరిణామాలు మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. 'ప్రకృతి' ఈ సమస్త సృష్టికి నిండైన అందాన్ని సమకూర్చిపెట్టింది.ఇలాంటి ప్రకృతిలో మానవులతోపాటు జంతుజాలం, వృక్షజాలం, క్రిమికీటకాలు, భౌతిక, రసాయనిక పదార్థాలు నిండి ఉన్నాయి. అరణ్యాలు, నదీనదాలు, పర్వతాలు, లోయలు, ఇతర అనేకమైన ఏర్పాట్లు సహజ సిద్ధంగా నెలకొని ఉన్నాయి. భూవాతావరణాన్ని నాశనం చేసి, కోట్లాది జీవరాశులను ప్రాణ సంకటంలోకి నెట్టడంలో గల ఔచిత్యమేమిటో అర్థంకావడం లేదు. జీవవైవిధ్యం దెబ్బతినడంతో ప్రకృతిలో అనేకఅవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. మానవాళికి పలురకాలుగా ఉపయోగపడే జీవసంపద మానవ స్వార్థచింతన వలన నశించిపోయింది.ఒకవైపు ప్రకృతి విధ్వంసం వలన భూవాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాలుష్యకారకాలు పెరిగిపోయాయి. పర్యావరణం దెబ్బతిన్నది. మనతో కలిసి జీవిస్తున్న జీవరాశులెన్నో ప్రకృతిలో చోటు చేసుకుంటున్న విపరీతమైన పోకడలకు నిలవలేక ఇప్పటికే అదృశ్యమైపోయాయి.ప్రస్తుత పర్యావరణ సమస్యలకు మూలకారణాన్ని అన్వేషించి, కాలుష్యభరిత వాతావరణంనుండి మానవాళిని కాపాడాలి. ప్రపంచ వ్యాప్తంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్న వైరస్‌లు ముమ్ముందు మరింత విజృంభించవచ్చు.సకలజీవరాశుల ఉనికిని భూమండలంపై సుస్థిరం చేయడానికి ప్రయత్నాలు జరగాలి.ఈఅంశాలను పరిగణనలోకి తీసుకుని పర్వత పంక్తులను కాపాడాలి.భవిష్యత్తులో ఆరావళి పర్వత శ్రేణిలో మైనింగ్‌జరపకుండా పటిష్టమైనచట్టాలు తీసుకురావాలి. ●

# పేలుళ్లతో దద్దరిల్లిన వెనిజులా

## ఎమర్జెన్సీ విధింపు

**కారకాస్, జనవరి 3:** వెనుజులా బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అగ్రరాజ్యం అమెరికా ఈ దాడులకు దిగింది. రాజధాని కరకస్‌లో శనివారం తెల్ల వారుజామున ఏడు చోట్ల భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో దేశంలో అత్యయిక పరిస్థితి విధించాల్సిన పరస్థితి తలెత్తింది. ట్రంప్ ఆదేశాలతోనే తమ సైన్యం ఈ దాడులు చేస్తోం దని అమెరికా ధ్రువీకరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా అమెరికా శనివారం దాడులకు పాల్పడినట్లు వెనుజులా వెల్లడించింది. దీంతో సైనిక స్థావరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపింది. దాడులు జరిగిన ప్రదేశాల్లో పరిస్థితిని సమీక్షించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ దాడులతో దేశంలో జాతీయ అత్యయిక పరిస్థితి విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**అమెరికన్ ఎయిర్‌లైన్లకు నోటమ్**

ఈ దాడులకు ముందు అమెరికా విమానయాన సంస్థలకు యు ఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నోటమ్ జారీ చేసింది. అమెరికా విమానాలు వెనుజులా గగనతలాన్ని వినియోగించొద్దని హెచ్చరించింది. తాజా పరిణామాలపై కొలం బియా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనుజులా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ ముఠాలతో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ఆరోపిస్తుండడంతో అక్కడి ప్రభుత్వాన్ని కూల్చడానికి ట్రంప్‌కార్యవర్గం ప్రణాళికలు రచిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది.





**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశాడు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి కోసం అవసరమైతే వెనిజులాపై సైనిక చర్యకు దిగుతామని ప్రకటించినట్లుగా దాడికి పాల్పడింది. వెనిజులా రాజధాని కరాకస్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలు లక్ష్యంగా విరుచుకుపడింది. అంతేగాక వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, అతని భార్యను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకుని తమ దేశానికి తరలించింది. ఈ విషయాన్ని యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. మదురో తమ అదుపులో ఉన్నందున ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టం చేశారు. అంతకు ముందు అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో వెనిజులా ప్రభుత్వం దేశంలో అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించింది. చమురు నిల్వల కోసమే దాడి చేశారని ఆరోపణలు గుప్పించింది. మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆధారాలు ఇవ్వాలని అమెరికాకు విజ్ఞప్తి చేశారు. అటు రష్యా, అమెరికా చర్యను తీవ్రంగా తప్పుపట్టింది. ఇది సైనిక దురాక్రమణేనని ఆరోపించింది.**

**వెనుజులా అధ్యక్షుడు మదురో మా కస్టడీలోనే: ట్రంప్:** అమెరికా–వెనుజులా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యుఎస్ సైన్యం శనివారం తెల్లవారుజామున వెనుజులా రాజధాని కరాకస్‌పై భీకరదాడులు జరిపిన సంగతి తెలిసిందే. వాటిని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అలాగే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి తమ కస్టడీలో ఉన్నారని వెల్లడించారు. వారిద్దరిని వెనుజులా వెలుపలకు తరలించినట్లు వెల్లడించారు. దీనిపై అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నామని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా సైన్యానికి చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్‌లో భాగమైంది.

**ఆధారాలు ఇవ్వండి : ఉపాధ్యక్షురాలు**

తమ అధ్యక్షుడిని అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనుజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ స్పందించారు. మదురో, ఆయన సతీమణి ఇప్పుడు ఎక్కడున్నారో తమకు తెలియనదని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారని తెలియజేసేలా ఆధారాలు ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. ఈ పరిణామాల వేళ వెనుజులా పక్క దేశమైన కొలంబియా అప్రమత్తమైంది. ఆ దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

**ఇక సైనిక దాడులు చేయబోం: అమెరికా**

మదురో అమెరికా కస్టడీకి చిక్కడంతో వెనుజులాలో తమ సైనిక చర్య పూర్తయిందని యుఎస్ సెనెటర్ మైక్ లీ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అమెరికా ఈ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ చమురు కోసమే అమెరికా దాడులు చేయనుందని గతంలో వెనుజులా ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా గతంలోనే తాను దేశాన్ని వీడేందుకు సిద్ధమని మదురో చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. తాను, తనకుటుంబంతో సహా దేశాన్ని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే తనకు, తన కుటుంబానికి ఆంక్షల నుంచి పూర్తి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారని వారి సారాంశం. యుఎస్ విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి తాను ఎదుర్కొంటున్న కేసులను మూసివేయడం వంటి వాటి గురించి వాషింగ్టన్ వద్ద ప్రస్తావించినట్లు వెల్లడించాయి.



## బీహార్‌లో రూ.20వేలకే అమ్మాయిలు పెళ్లికి రెడీ

### ఉత్తరాఖండ్ మంత్రి భర్త వివాదాస్పద వ్యాఖ్యలు

**డెహ్రాడూన్:** బీహార్‌లో రూ.20,000కే అమ్మాయిలు పెళ్లికి అందుబాటులో ఉన్నారని ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళా మంత్రి భర్తచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన చేసిన వ్యాఖ్యల విడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన బీజేపీ మంత్రి రేఖా ఆర్య ఆ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి. ఆమె భర్త గిరిధారి లాల్ సాహు, అల్మోరాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మీరు వృద్ధాప్యంలో పెళ్లి చేసుకుంటారా మీరు పెళ్లి చేసుకోలేకపోతే మీ కోసం బీహార్ నుంచి అమ్మాయిని తీసుకు వస్తాం. రూ.20,000 నుంచి రూ.25,000కే అక్కడి నుంచి అమ్మాయిలను తెచ్చుకోవచ్చు అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మహిళా, శిశు సంక్షేమ మంత్రి రేఖా ఆర్య భర్త గిరిధారి లాల్ సాహు వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశంలోని మహిళలను ఆయన అవమానించారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ విమర్శించింది. అధికార బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మరో వైపు బీహార్ మహిళా కమిషన్ కూడా దీనిపై స్పందించింది. ఆ రాష్ట్ర అమ్మాయిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గిరిధారి లాల్ సాహుకు నోటీస్ జారీ చేస్తామని పేర్కొంది. అయితే ఆయన వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ తెలిపింది.



## రాజస్థాన్ స్కూళ్లలో దినపత్రికల పఠనం తప్పనిసరి

**జైపూర్, జనవరి 3:** ఉత్తరప్రదేశ్ దారిలోనే రాజస్థాన్ ప్రభుత్వంకూడా పాఠశాల విద్యార్థులకు దినపత్రికల పఠనం తప్పనిసరిచేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లలో రోజూ వార్తా పత్రిక చదవడం తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సెకండరీ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు వార్తాపత్రికలు తీసుకోవాలని తెలిపింది. అందులో ఒక హిందీ, ఒక ఇంగ్లీష్ పేపర్ల తప్పనిసరిగా సభ్యత్వం ఉండాలని తెలిపింది. విద్యార్థులలో పఠన అలవాట్లను ప్రోత్సహించడానికి, పదజాలాన్ని మెరుగుపరచడానికి, సాధారణ అంశాలపై అవగాహనను పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్ విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం విద్యార్థులు ఉదయం అసెంబ్లీలో కనీసం 10 నిమిషాలు వార్తాపత్రికలు చదవాలి.

# బిజెపిని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థంచేసుకోవాలనుకోడం పొరపాటే

## ఆర్‌ఎస్‌ఎస్‌-చీఫ్ మోహన్ భగవత్

**భోపాల్,జనవరి 3:** యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పారామిలటరీ సంస్థ కాదని, బీజేపీని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారతదేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. మేము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దాని నుంచి వచ్చిన బీజేపీకి ఆర్‌ఎస్‌ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్ కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఇవాళ ప్రజలు సరైన సమాచారం కోసం లోతుగా వెళ్లడం లేదని, మూలాలకు వెళ్లరని, వికీపీడియాకు వెళ్తుంటారని, అయితే అక్కడి సమచారం అంతా నిజం కాదని పేర్కొన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహల రీత్యా ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్చిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొందిస్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరితోనూ పోటీ పడటం లేదని అన్నారు. దేశంపై మొదటగా దండెత్తిన వాళ్ల బ్రిటిషర్లు కాదని, భారతీయుల కంటే తక్కువ స్థాయిలో ఉన్న కొందరు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మనలను ఓడించారని చెప్పారు. ఇది ఏడుసార్లు జరిగిందని, ఎనిమిదవ ఆక్రమణదారులు ఆంగ్లేయులని వివరించారు. అలాంటప్పుడు స్వాతంత్ర్యానికి హామీ ఏమిటి ఇది పదే పదే ఎందుకు జరుగుతోందో మనం ఆలోచించాలని భగవత్ సూచించారు. మనను మనం అర్థం చేసుకుని స్వార్థానికి అతీతంగా ఎదగాలని, సద్గుణాలతో సమాజం ఏకతాటిపై నిలిస్తే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాజకీయ బానిసత్వానికి తెరపడినా, మానసిక బానిసత్వం కొంతవరకూ కొనసాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాలన్నారు. స్వదేశీ అంటే ప్రపంచంతో వాణిజ్యాన్ని తగ్గించుకోవడం కాదని, భారతదేశంలో తయారుకాని మందులు వంటి ముఖ్యమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాణిజ్యం అనేది ఒత్తిడి, సుంకాల భయంతో జరక్కూడదని, సొంత నిబంధనల ప్రకారమే జరగాలని సూచించారు. సంఘ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, సంఘ్ ఎప్పుడూ బయట నుంచి వచ్చే నిధులు, విరాళాలపై ఆధారపడదని భగవత్ చెప్పారు. సంఘ్‌ను బాగా అర్థం చేసుకోవాలకుంటే సంఘ్ శాఖలకు రావాలని కోరారు. చక్కెర రుచి గురించి తాను రెండు గంటల పాటు వివరించినా ఒక టీ స్పూన్ చక్కర తాగితేనే అర్థమవుతుందని, అదేవిధంగా శాఖలకు వస్తేనే సంఘ్ గురించి అర్థమవుతుందని చెప్పారు.





# విజయ్ స్నేహ 'హస్తం'

**చెన్నై, జనవరి 3:** తమిళ స్టార్ హీరో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై జోరుగా అంచనాలున్నాయి. పొత్తులతోవెలుతుందా లేక ఒంటరిగా పోటీచేస్తుందా లేక మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం టీవీకే కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. దీనిపై టీవీకే జాతీయ ప్రతినిధి గెరాల్డ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే, కాంగ్రెస్ సహజ భాగస్వాములు అని చెప్పారు. రెండు పార్టీలు లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని, మత తత్వానికి వ్యతిరేకమని తెలిపారు. అందుకే రెండు పార్టీలు సహజ భాగస్వాములని, తమ అధినేత విజయ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మిత్రులని కూడా గెరాల్డ్ అన్నారు. అయితే, రెండు పార్టీలు కలిసి పనిచేసే విషయంలో కొన్ని సమస్యలున్నాయని, ముఖ్యంగా తమిళనాడు కాంగ్రెస్ విభాగంతో ఉన్న సమస్యల్ని పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్ లో టీవీకే, కాంగ్రెస్ కలిసి పనిచేయొచ్చు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై టీవీకేతో చర్చించేందుకు అడ్డు పడుతుండొచ్చు అని గెరాల్డ్ అభిప్రాయపడ్డారు. కాగా, రెండు పార్టీల పొత్తు గురించి ఇటీవల ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన టీవీకే సమావేశానికి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా హాజరవ్వడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లైంది. ఒకవేళ టీవీకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు టీవీకేతో పొత్తు కోసం తమిళనాడులోని ఏఐఏడీఎంకే పార్టీ కూడా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

# యెమెన్‌పై సౌదీ వైమానిక దాడులు

## తీవ్రంగా ప్రతిఘటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్

### దాడుల్లో 20 మంది వేర్పాటు వాదుల మృతి

**సనా,జనవరి 3:** గల్ఫ్‌లోని రెండు బలమైన దేశాల మధ్య ఇపుడు అంతర్గత పోరు ముదిరిపోయింది. గల్ఫ్‌సభ్యదేశం యెమెన్‌లోని కొన్ని ప్రత్యేకప్రాంతాలపై సౌదీ అరేబియా దాడులుచేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీవ్రంగా ప్రతిఘటించింది. యెమెన్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న వివాదం మరోసారి హింసాత్మక మలుపు తిరిగింది. సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక సంకీర్ణం సేనలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతు ఉన్న సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ)స్థానాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు ప్రారంభించాయి. ఈ దాడుల్లో కనీసం 20మంది వేర్పాటువాద యోధులు మరణించినట్లు నిర్ధారించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇటీవల యెమెన్‌లో తన సైనిక ఉనికిని ముగించినట్లు ప్రకటించిన సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వైమానిక దాడులు హద్రామౌత్ ప్రావిన్స్‌లోని సెయున్, అల్‌ఖాషా ప్రాంతాలలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడులు ఒక సైనిక స్థావరం, విమానాశ్రయాన్ని కూడా లక్ష్యంగా జరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో వైమానిక రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక గంటల పాటు ఏ విమానమూ ఎగురలేకపోయింది. దీని వల్ల పౌరులలో భయాందోళనలు నెలకొన్నాయి. మరణించిన వారందరూ ఈ సైనిక స్థావరాలలో ఉన్న తమ యోధులని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ అధికారులు తెలిపారు. ఈ వైమానిక దాడులకు ముందు, యుఎఇ యెమెన్ నుండి తన చివరి సైనిక దళాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని అబుదాబి స్పష్టం చేసింది. ముకల్లా ఓడరేవుపై దాడికి సంబంధించి కూడా వివాదం తలెత్తింది. అక్కడ ఆయుధాల రవాణా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యుఎఇ ఈ ఆరోపణలను ఖండించింది. ఇది కేవలం వాహనాల రవాణా మాత్రమే అని పేర్కొంది. సౌదీ మద్దతుగల దళాలు నమ్మక ద్రోహం చేశాయని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ నాయకులు ఆరోపించారు. సైనిక స్థావరాలను శాంతియుతంగా తమ ఆధీనంలోకి తీసుకుంటామని తాము హామీ ఇచ్చామని, కానీ వెంటనే వైమానిక దాడులు జరిగాయని వారు చెబుతున్నారు. సదరన్ ట్రాన్సిషనల్‌కౌన్సిల్ ఎస్టీసీ ప్రతినిధి ఈ పరిస్థితిని మనుగడ కోసం పోరాటంగా అభివర్ణించారు.





## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

**ఢాకా,జనవరి 3:** బంగ్లాదేశ్‌లోని షరియత్‌పూర్ జిల్లా, క్యూర్‌బంగా బజార్‌లో మరో హిందూ వ్యక్తిపై దాడిచేసి హత్యచేసారు. రానురాను బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై దాడులు పెచ్చుమీరుతున్నాయి. సజీవదహనం చేయాలనిచూస్తే నిప్పంటుకున్న ఈ వ్యాపారి తప్పించుకుని చెరువులో దూకాడు. ఫార్మసీ నిర్వహిస్తున్న హిందూ వ్యాపారి ఖోకన్ చంద్ర దాస్, ఢాకాలోని నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. ఖోకన్ చంద్ర దాస్‌పై కొందరు దుండగులు దాడి చేసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఆయన చెరువులో దూకారు. పోలీసులు, స్థానికులు ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దుకాణం మూసి ఆటోలో ఇంటికి వెళుతుండగా, మార్గ మధ్యంలో కొందరు దుండగులు ఆటోను ఆపి, పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఖోకన్ రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకారు. స్థానికులు ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో హిందువులపై హత్యాకాండా సాగుతోంది. ఇటీవల దీపూ చంద్ర దాస్ హత్య జరిగింది. ఆ తర్వాత సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూకదాడిలో మృతి చెందాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఖోకన్‌పై దాడి జరిగింది.

## కెనడాలో వలసదారులకు 'వర్క్ పర్మిట్ల' ముప్పు



### సగం మంది భారతీయులే

**ఒట్టావా, జనవరి 3:** కెనడాలో లక్షల మంది వలసదారులు 'వర్క్ పర్మిట్ల' ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 డిసెంబరుతో దాదాపు 10లక్షల మంది పర్మిట్ల కాలపరిమితి తీరిపోగా 2026లో మరో 9లక్షల మందికి ఆ గడువు ముగియనుంది. దీంతో చట్టబద్ధత కలిగిన పత్రాలులేకుండా ఆ దేశంలో నివసించే వారి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. వీరిలో సగం మంది భారతీయులే ఉన్నా రని తెలుస్తోంది. ఇమిగ్రేషన్, రిఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సిసి) డేటా ఆధారంగా ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీని వల్ల వలసదారులు మరో వీసా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా కోల్పోతారు. వలసలకు సంబంధించిన నిబంధనలను కెనడా కఠినతరం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వీసా గానీ, శాశ్వత నివాసం పొందడం గానీ అంత సులభమేమీ కాదని తెలుస్తోంది.

## మెక్సికోలో భారీ భూకంపం: రెక్టార్ స్కేల్‌పై 6.5గా నమోదు

**మెక్సికో సిటీ, జనవరి 3:** మెక్సికోను భూకంపం వణికించింది. దక్షిణ–మధ్య మెక్సికో ప్రాంతాల్లో 6.5 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. గెరెరో రాష్ట్రంలోని శాన్‌మార్కోస్‌కు సమీపంలోని అకాపుల్కో నగరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దాదాపు 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని వల్ల ఏకంగా 33 సెకండ్లపాటు భూమి కంపించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. 50వరకు ఇళ్ల వరకు ధ్వంసమయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో అకాపుల్కో సమీపంలో భూకంపం సంభవించింది. ఈ భూప్రకంపనలు ఉత్తర దిశగా సుమారు 400 కిమీ దూరంలో ఉన్న మెక్సికో సిటీ వరకు వ్యాపించింది. భూకంపం హెచ్చరికల సైరన్లు మోగడంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లు, ఆఫీసులనుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. మెక్సికో సిటీలో జనాలు బయటకు పరుగులు తీస్తున్న క్రమంలో ఓ అపార్టుమెంట్‌లోని రెండో అంతస్తు నుంచి పడి 60 యేళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో 12 మంది గాయపడ్డారని నగర మేయర్ క్లారా బ్రుగాడా తెలిపారు. అలాగే భూకంప కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఇల్లు కూలడంతో 50 యేళ్ల మహిళ మృతి చెందిందని గెరెరో గరవ్నర్ ఎవలిన్ సాల్గోడో పేర్కొన్నారు.

# సంక్షిప్తంగా..

## సైబర్‌నేరాల్లో అగ్రస్థానం మహారాష్ట్రదే..



**న్యూఢిల్లీ, జనవరి 3:** దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ప్రమాదకర స్థాయిలో కొనసా గుతున్నాయి.గడచిన ఆరేళ్లలో వివిధ రకాల మోసాల బారిన పడి భారతీయులు ఏకంగా రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నివేదిక ప్రకారం, ఒక్క 2025లోనే దేశవ్యాప్తంగా రూ.19,813 కోట్ల నష్టం వాటిల్లగా, 21.77 లక్షలకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది అత్యధికంగా నష్టపోయిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర రూ.3,203 కోట్లు అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక రూ.2,413 కోట్లు, తమిళనాడు రూ.1,897 కోట్లు, ఉత్తరప్రదేశ్ రూ.1,443 కోట్లు నిలిచాయి. ఈ జాబితాలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

## దేశంలో పెరిగిపోతున్న వైట్‌కాలర్ ఉగ్రవాదం: రాజ్‌నాథ్‌సింగ్



**భోపాల్, జనవరి 3:** దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం ఆందోళనకరంగా పెరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. విలువలు లేని ఉన్నత విద్య సమాజానికి ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది వృత్తిపరమైన విజయం మాత్రమేకాదని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లోని నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనను ప్రస్తావించారు.

## అద్దె ఇంట్లో ఉన్న బాలికపై ఇద్దరు లైంగిక దాడి




**లక్నో, జనవరి 3:** అద్దె ఇంట్లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్ప డ్డారు. ఆ తర్వాత ఆమెను టెర్రస్ పైనుంచి కిందకు తోసేశారు. ఆ బాలిక ప్రమాదవశాత్తు కిందపడి మరణించినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సికంద్రాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలోని అద్దె ఇంట్లో రాజు, వీరు కశ్యప్ అనే ఇద్దరు వ్యక్తులు నివసిస్తున్నారు.ఈనెల 2న అదే బిల్డింగ్‌లోని వేరే పోర్షన్‌లో నివసించే ఆరేళ్ల బాలిక టెర్రస్‌పై ఆడుకుంటున్నది. ఇది గమనించిన ఆ వ్యక్తులు ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత టెర్రస్ పైనుంచి ఆమెను కిందకు తోసేశారు. తీవ్రంగా గాయపడిన ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను ఆమె తల్లిండ్రులు గుర్తించారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ చిన్నారి మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

## ప్రసవంకోసం ఆరు కిలోమీటర్లు నడిచివెళ్లిన గర్భిణి మృతి



**ముంబై, జనవరి 3:** మారుమూల గ్రామంలో ఎలాంటి వైద్య సదుపాలు లేకపోవడంతో నిండు గర్భిణీ పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం భర్తతో కలిసి ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమె మరణించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. ఆల్దండి తోలా గ్రామానికి చెందిన 24 ఏళ్ల ఆషా సంతోష్ కిరంగ తొమ్మిది నెలల గర్భవతి. ఆ గ్రామంలో డెలివరీ సౌకర్యాలు లేవు. ఆ గ్రామం నుంచి ప్రధాన రహదారికి ఎలాంటి రోడ్డు మార్గం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో నిండు గర్భిణీ అయిన ఆషా పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం పెథాలోని తన సోదరి ఇంటికి బయలుదేరింది. ఈనెల 1న భర్తతో కలిసి అటవీ దారిలో ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. పెథాలోని సోదరి ఇంటికి చేరేసరికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది.

## నిజమే.. మా అబ్బాయి వివాహనిశ్చితార్థం జరిగింది: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 3:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నట్లు గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ప్రియాంక గాంధీ స్పందించారు. మీడియాలో వస్తున్న వార్తలను ధృవీకరించారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. రేహాన్‌కు తన చిన్ననాటి స్నేహితురాలు అవీవా బేగ్ తో ఎంగేజ్మెంట్ జరిగినట్లు ప్రకటించారు.

# కన్నుల పండువగా నటరాజస్వామికి షోడశాభిషేకాలు



నటరాజస్వామికి విభూధీ అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త** ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని జన్మనక్షత్రం సందర్భంగా శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష పూజలతో స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. సాధారణంగా ప్రతి ఏడాది ముక్కోటికి తరువాత 'ఆరుద్రనక్షత్రం' వస్తుంది. ఆరుద్ర శనివారం రావటంతో భక్తుల తాకిడి తక్కువగా ఉండటంతో స్థానికులు సుదర్శనం చేసుకున్నారు. వేకువ జాము నుంచి ఆలయంలో ఉద్దిపిండి లింగానికి జరిపే అభిషేకం తిలకించటానికి స్థానిక భక్తులు బారులు తీరారు. ధనుర్మాసం కావటంతో వేకువనటరాజస్వామికి విభూధీ అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం జాము నుంచి స్థానిక మహిళా భక్తులు ఆలయానికి విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఆరుద్ర రావటంతో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆరుద్ర రోజున ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని జన్మదిన సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు ఏర్పాటు చేసారు. ఈ రోజు మహాశివరాత్రికన్నా ప్రాధాన్యత సంతరించుకుంది. వేకువ జామున స్వామి గర్భాలయంలో ఉద్దిపిండితో అర్చకులు లింగాకారాన్ని తీర్చి దిద్దారు. భక్తిశ్రద్ధలతో ఉద్దిపిండి లింగానికి నేతితో అభిషేకాలు జరిపారు. ఆరుద్ర సందర్భంగా స్వామి అమ్మవార్లకు భక్తుల అభిషేక సేవల్ని రద్దు చేశారు. దేవస్థానమే సేవల్ని నిర్వహించింది. ఉదయం నుంచి ఆలయంలో భక్తులు సంబరాలు జరుపుకున్నారు. వేకువ జాము 3గంటలకు జే గంట, 3.30గంటలకు మంగళవాయిద్యాలు నిర్వహించారు. 3.45గంటలకు తిరు మంజనం, 4గంటలకు గోపూజను నిర్వహించి భక్తులకు సర్వదర్శనానికి అనుమతించారు. 4.30గంటలకు స్వామి గర్భగుడిలో లింగోద్భవ అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకం మహాశివరాత్రి నాడు నిర్వహించే 11వ కాలాభిషేకం దర్శనం కన్నా శ్రేష్టమని అర్చకులు తెలిపారు. తరువాత స్వామి గర్భగుడిలో వెలసిన మూలవిరాట్టుకు నైవేద్యదీపారాధనలు జరిపారు. ఇఓ డి.బాపిరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.

# నియోజకవర్గాల పునర్విభజన - కేంద్రం సంకేతం

## ఎపి విభజన చట్టానికి అనుగుణంగా చర్యలు

## పెరగనున్న 50 శాసన సభా నియోజకవర్గాలు

## ఆశావహుల్లో ఆనందాతిరేకాలు

**విజయవాడ,జనవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో 2026 నాటికి నియోజకవర్గాల పునర్విభజన ఖాయమనే అంశం ఇప్పుడు కీలక చర్చనీయాంశంగా మారింది. ఏపీలో వాస్తవానికి 2014 రాష్ట్ర విభజన తోనే నియోజకవర్గాల పునర్విభజన జరగాలి. ఇప్పుడు ఉన్న సంఖ్య పెరగాలి. కానీ అలా జరగలేదు. దానికి రకరకాల కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా జన గణనతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం తరువాతనే పునర్విభజన అని సంకేతాలు వచ్చాయి.అయితే జన గణనతో పాటు మహిళా బిల్లు ఆమోదం పొందనుండడంతో 2026 లో నియోజకవర్గాల పునర్విభజన అని స్పష్టమోతోంది.అదే జరిగితే ఏపీలో అదనంగా మరో 50 నియోజకవర్గాలు ఏర్పాటు కానున్నాయి అనేది ప్రచారంలో ఉన్న కీలకకథనం. దీంతో అసెంబ్లీ స్థానాల సంఖ్య 225 కు పెరగనున్నాయి. అదే జరిగితే రాజకీయ ఆశావహులకు కొంతవరకు అవకాశాలు మెరుగు పడినట్టే...

..విభజన చట్టంలో..... 2014 లో రాష్ట్ర విభజన జరిగింది. 175 అసెంబ్లీ స్థానాలతో పాటు 25 పార్లమెంటు స్థానాలతో నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పాటయింది... ఇక తెలంగాణకు సంబంధించి 117 అసెంబ్లీ స్థానాలతో పాటు 17 పార్లమెంటు స్థానాలు మిగిలాయి... ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర విభజన జరగడంతో పాలనా వికేంద్రీకరణ అవసరమని అప్పటి విభజన బిల్లులో స్పష్టం చేశారు.నియోజకవర్గాల పునర్విభజన తో నియోజకవర్గాల సంఖ్య పెరగాలని అందులో పొందుపరిచారు. కానీ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అవుతున్నా నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు, నియోజకవర్గాల సంఖ్య పెరగలేదు... కానీ 2026 నాటికి నియోజకవర్గాల పెంపు అనివార్యమని తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం... ప్రతీ పార్లమెంటు కి రెండు అసెంబ్లీ సీట్లు..!! ఏపీలో 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ప్రతి పార్లమెంటు స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ సీట్లు ఉంటాయి. ఈ లెక్కన 175 స్థానాలు కొనసాగుతున్నాయి... నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి లోక్సభ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెంచాలన్న ఆలోచన ఉంది... 2026 ద్వితీయార్థంలో పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది. వీలైనంత త్వరగా పునర్విభజన ప్రక్రియ పూర్తి చేసి కొత్త అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రకటించాలని కేంద్రం భావిస్తోంది... కొద్ది రోజుల్లో జనగణనతో పాటు మహిళా బిల్లు కూడా ఆమోదం పొందనుంది. 2025 లో జనగణను పూర్తిచేసి.. వెనువెంటనే మహిళా బిల్లును సైతం ఆమోదం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. అటు తరువాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కానుంది... అప్పుడే ఆశావహుల్లో ఆశలు. ప్రస్తుతం ఏపీ లో టిడిపి, వైసిపి, జనసేన, బిజెపి, కాంగ్రెస్, వామపక్షాలు ఉన్నాయి. టిడిపి కూటమిలో బిజెపి, జనసేన ఉంది. ప్రతిపక్ష హోదా దక్కకుండా ప్రధాన ప్రతిపక్ష పార్టీ మాత్రం వైసిపి. అదే సమయంలో కాంగ్రెస్ తో పాటు వామపక్షాలు కూడా ఉన్నాయి... అయితే అన్ని పార్టీల్లో నాయకులు ఆశావహులుగా ఉన్నారు. ప్రధానంగా టిడిపి కూటమి, వైసీపీలో ద్వితీయ శ్రేణి నాయకులు సైతం చట్టసభలకు ఎన్నిక కావాలని భావిస్తున్నారు. ఒకవేళ పునర్విభజనతో 50 అసెంబ్లీ స్థానాలు పెరిగితే.. అన్ని పార్టీల్లో ఉన్న ఆశావహు లకు చాన్స్ దక్కే అవకాశం ఉంది... అందుకే ఏపీ నేతలు నియోజకవర్గాల పునర్విభజనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. 2026 నాటికి ఇది కార్యరూపం దాల్చుతుంది.

## అన్వేష్ ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు

### - జనవరి 12న ముహూర్తం

**సూళ్లూరుపేట, జనవరి 3 ప్రభాతవార్త** ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఎల్‌విఎం3-ఎం6 రాకెట్ ప్రయోగంతో భారీ విజయాన్ని అందుకుని 2025కు ఘనంగా ముగింపు పలికి నూతన సంవత్సరంలో పిఎస్ఎల్వి-సి62 రాకెట్ ద్వారా అన్వేష్ ఉపగ్రహ ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది. జనవరి 12న శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఉదయం 10.17 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి షార్‌లోని (పిఫ్) ఇంటిగ్రేషన్ ఫెసిలిటి భవనంలో నాలుగు దశల అనుసంధాన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రయోగంలో కక్ష్యలోకి పంపే అన్వేష్ ఉపగ్రహం (ఇఓఎస్-ఎన్1) భూమి, పర్యావరణాన్ని పరిశీలించడం, పర్యావరణ మార్పులను పరిశీలించి సమాచారం సేకరిస్తుంది. అలాగే ఇది సైనిక నిఘా అవసరాల కోసం ఉపయోగపడుతుంది. ఈ ఉపగ్రహం భూమికి సుమారు 600 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలో ఉండి నిరంతరం భూమిని స్కాన్ చేస్తూ సమాచారాన్ని పంపిస్తుంది. అందుకే రాకెట్‌లో చివరి దశ అయిన పిఎస్4లో స్పానిష్‌కి చెందిన స్టార్టప్ ఆర్బిటల్ పారడైజ్ భాగస్వామ్యంతో నిర్మించిన 25 కిలోల క్రిస్టల్ ఇనిషియల్ డిమానుస్ట్రేటర్ (కెఐడి) క్యాప్సుల్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నారు. దీంతో పాటు మరో 18 రకాల పేలోడ్లను ఈ రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనున్నట్లు తెలుస్తోంది. ప్రయోగాత్మకంగా ప్రయోగించి క్యాప్సుల్స్‌ను తిరిగి భూవాతావరణంలోకి ప్రవేశించడం కోసం దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో ఓ స్మాష్‌డౌన్ జోన్‌ను గుర్తించారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), జనవరి 3, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకంగోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు.

## ఉల్లి రైతులకు ఊరటిచ్చిన కూటమి ప్రభుత్వం

### - బటన్ నొక్కి పరిహారం చెల్లింపు



కోడుమూరులో జరిగిన సభలో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెనాయుడు

**కోడుమూరు,జనవరి 3, ప్రభాతవార్త :** ఆకాల వర్షాలకు చితికి పోయిన అన్నదాత ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకుందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రా ష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాల మూలంగా భారీ ఎత్తున నష్ట పోయిన ఉల్లి రైతులకు పరిహారం చెల్లించే కార్యక్రమాన్ని శనివారం కోడుమూరులో నిర్వహించారు. ఈ వానలకు అధిక శాతం కర్నూలు జిల్లాల్లోనే అధికంగా ఉల్లి రైతులు నష్ట పోవడంతో ఆ పరిహారం అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి రైతులు భారీ స్థాయిలో తరలొచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కోడుమూరు శాసన సభ్యులు బొగ్గుల దస్తగిరి అధ్యక్షులుగా వ్యవహరించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి అచ్చెనాయుడు ప్రసంగించారు. గత ఐదేళ్ల వైసీపీ హాయంలో రైతుల జీవితాలను భ్రష్టుపట్టించారని విమర్శించారు. ఒక్క రైతులనే గాక అన్ని రంగాలను అదోగతి పాలు చేసిందని దుయ్యబట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాల మూలంగా అన్నదాతకు పెద్దఎత్తున నష్టం వాటిల్లిందన్నారు. ఈ వానలకు అధిక శాతం ఉల్లి పంటలకు భారీగా నష్టం వాటిల్లిందని వారి కష్టాలపై స్పందించి కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే ఆదుకునేందకు ముందుకొచ్చారన్నారు. ఈ మేరకు తక్షణమే రైతులు పండించిన పంటలకు క్వింటాళ్లకు 1200 రూ.లుగా మార్కెట్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారన్నారు. అంతే గాక ఈ పంటలకు పెట్టిన పెట్టుబడుల ద్వారా నష్ట పోయిన ఉల్లి రైతులను ఆదుకునేందుకు ఆ రోజు ఉల్లి రైతులకు హెక్టార్‌కు రూ.50వేల రూపాయలను అందజేస్తామని హామిచ్చారని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారం నేడు తాను రైతుల ముంగిటకు వచ్చి పరిహారం అందిస్తున్నానన్నారు. ఇలా రైతులకు నేనున్నాను అని చెప్పుకునే విధంగా చంద్రన్న రైతులకు అండగా నిలిచారన్నారు. రా ష్ట్ర వ్యాప్తంగా నష్ట పోయిన ఉల్లి రైతులకు 131 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం అందజేసిందన్నారు. టీడీపీ హాయంలోనే రైతులకు అన్ని విధాలుగా ఆదుకున్నట్లు చెప్పారు. పొగాకు,మామిడి,మెరప పంటలకు కూడా కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పించిందన్నారు.

## కన్నుల పండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



కళ్యాణ మహోత్సవంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్-శ్రీదేవి దంపతులు.

**జగ్గయ్యపేట, జనవరి 3, ప్రభాతవార్త :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపల్ పట్టణంలోని ధనశైల శ్రీరామాలయం (పెద్దరామాలయం)లో శనివారం కన్నుల పండువగా జరిగింది. కిక్కిరిసిన భక్తజన సందోహంతో శ్రీరామాలయం కిటకిటలాడింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్-శ్రీదేవి దంపతులు స్వామివారి కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, స్థానిక ప్రముఖులు కొత్తమాసు మల్లిఖార్జునరావు, పేరూరి కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధికారి శ్రీహరి ప్రసాదు, మార్కెట్ యార్డు డైరెక్టర్ దేవరశెట్టి నాగేశ్వరరావు, నాగరాజు, తుమ్మెపల్లి అంజి, తుమ్మెపల్లి వెంకటేశ్వర్లు, ఆలయ అర్చకులు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి పూజ, అభిషేకాది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను 18 ఏండ్ల వయసు పైబడిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని మెప్మా పిడి మురళీకృష్ణప్రసాద్ అన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని మెప్మా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మెప్మా ఆర్‌పిలు, సిబ్బంది సమావేశంలో పిడితోపాటు ఉద్యానవనశాఖ అధికారి బాలాజీ, టిఇ సుధారాణి, సిఎంఎం కవిత, సిఒ ప్రసాదు, డిఆర్‌పి, ఆర్‌పిలు పాల్గొన్నారు. సమావేశంలో పిడి మాట్లాడుతూ ప్రధానమంత్రి-సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ ప్రాజెక్టు ఏర్పాటు ముఖ్య ఉద్దేశ్యాలు ఆర్థిక తోడ్పాటు, సాంకేతిక శిక్షణ-తోడ్పాటు, మార్కెట్ సపోర్టు, ప్రభుత్వ గుర్తింపు కల్పన, అర్హతలు, దరఖాస్తు చేయువిధానం గురించి సోదాహరణంగా వివరించారు. ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం రుణ సౌకర్యం, 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.



# గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు

### - 15 ఫైనాన్స్ నిధులు రావడం పోరాట ఫలితమే

### - ఎపి సర్పంచుల సంఘం ఉత్తరాంధ్ర ప్రతినిధులను అభినందించిన ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం, జనవరి 3 ప్రభాతవార్త** గ్రామ పంచయతీలకు సకాలంలో నిధులు రావడం సంతోషదాయకమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలో ఓ హోటల్‌లో ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్, ఏపీ సర్పంచ్‌ల సంఘం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం సకాలంలో డైరెక్టుగా సర్పంచుల ఖాతాల్లోని 15 ఫైనాన్స్ నిధులు జమ చేయడం అభినందనీయమని, పల్లె పండుగ వన్, టు కింద నాలుగు వేల కిలోమీటర్ల రహదారుల నిర్మాణం, విద్యుత్తు లైట్లు, పారిశుద్ధ్యం మెరుగు, మురుగు కాలువల ఆధునికీకరణ, పెద్ద ఎత్తున మౌళిక సదుపాయాలు కల్పించుట, త్రాగునీరు, సాగునీరు, పిల్ల కాలువలు ఆధునికీకరణ, ఉంటే అనేక సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా నిధులు అందిస్తుందని సర్పంచ్‌ల సంఘం పోరాట ఫలితమే అని పేర్కొన్నారు. గతంలో పంచాయతీలను నిర్వీర్యం పాలకులు నిర్వీర్యం చేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీలు పురోభివృద్ధి చెందుతున్నాయని, అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాయని, గ్రామాల్లో పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల అమలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఛాంబర్ ప్రతినిధులను ఎమ్మెల్యే శంకర్ శాలువాతో సత్కరించి అభినందించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్‌ను ఛాంబర్ ప్రతినిధులు శాలువతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ వైవి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు బానోజీ నాయుడు, రాష్ట్ర ప్రతినిధి అనేపు రామకృష్ణ, శాలివాహనం సర్పంచ్ కాంక్యాన ఆదినారాయణ, సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మి, ప్రతినిధి రమణమూర్తి, పలువురు సర్పంచులు, సర్పంచ్ల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చంద్రబాబు దార్శనికతకు, మంత్రి నారా లోకేశ్ నిబద్ధతకు నిదర్శనంగా ఏపీకి అత్యధిక పెట్టుబడులు : హోంమంత్రి అనిత



**విజయవాడ,.జనవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, మంత్రి నారా లోకేశ్ నిబద్ధతకు నిదర్శనంగా.. పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా నిలిచిందని హోంమంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలవడంపై ఏపీ వ్యాఖ్యానించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా - దిలీని విడుదల చేసిన నివేదిక ప్రకారం 25.3 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు 2025 ఏప్రిల్ - డిసెంబర్ మధ్య రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వాటా గణాంకాలు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలో వేధింపులు, కక్ష సాధింపులతో పతనావస్థకు చేరిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధి పరంగా ముందుకు దూసుకెళ్తుందని వెల్లడించారు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ వంటి సంస్కరణల ద్వారా పెట్టుబడిదారుల్లో పెరిగిన నమ్మకమే రాష్ట్రాన్ని టాప్ ప్లేస్‌కు చేర్చడంలో కీలకంగా నిలిచిందని వివరించారు. కేవలం 18 నెలల్లో ఏపీకి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగ అవకాశాలను తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## పరశురామేశ్వరాలయంలో మొదటిసారి ఆరుద్ర పూజలు



**శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో మొదటి సారి అరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు ఏర్పాటు చేసారు. ఆలయానికి పాలకమండలి నియమించిన తరువాత ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తలగిరి నాయుడు వారి సహచరులు ఆలయంలో వచ్చిన మొదటి పూజా కార్యక్రమాలను పౌర్ణమి సందర్భంగా నూతన సేవను ఏర్పాటు చేసారు. శనివారం జరిగిన కార్యక్రమాలకు ప్రజల నుంచి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చిందని చైర్మెన్ గిరినాయుడు ప్రభాతవార్తకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఈ ఆలయాభివృద్ధి,పూజలకు సంబంధించి స్పందించారు. ఈ నేపధ్యంలో శివయ్య జన్మనక్షత్రం సందర్భంగా మొదటి సేవా కార్యక్రమాలకుశ్రీకారం చుట్టటానికి ఎంఎల్‌ఏతో చర్చించినట్లు వివరించారు. నూతనంగా వస్త్ర సేవ ప్రారంభం: గుడిమల్లంలోని పరశురామేశ్వరాలయంలో కొత్త పూజలు చేపట్టాని భావించి శివయ్య జన్మనక్షత్రం సందర్భంగా 'వస్త్ర సేవను' ప్రవేశ పెట్టారు. మొదటి ఉభయదారులుగా సహస్ర ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ శబరి, ఢాక్టర్ శారద, కేఆర్ గ్రూప్ తిరుపతి యాజమాన్యం కందిశెట్టి యువకిషోర్ ధర్మపత్ని వైష్ణవి కోయిలమ్మలు వస్త్రసేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలతో పాటు పూజా సేవ లకు అవసరమైన సుగంధ ద్రవ్యాలను అందించారు. అంగరంగ వైభవంగా స్వామి వారికి అభిషేకాలు జరిపి నూతన వస్త్రాలతో అలంకరించారు. దాతలు తెచ్చిన వస్త్రాలతో పాటు పూలతో ముస్తాబు చేసారు. కాగా ప్రదోష కాలంలో నిర్వహించిన 'వస్త్ర సేవకు' గంగయ్య యాదవ్ వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఈ సేవకు టిక్కెట్లు ఖరారు చేసిన రూ.5వేల టిక్కెట్లును జారి చేసారు. ఈ సేవలను ప్రతి మాసం ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ రామచంద్రారెడ్డి ప్రభాతవార్తకు వివరించారు.

## పచ్చదనం దిశగా కుప్పం మున్సిపాలిటీ

### - ఫ్లైఓవర్ వంతెనపై కుండీలు.. మొక్కలు ఏర్పాటు !



**కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణం పచ్చదనం దిశగా అడుగులు వేస్తోంది. స్వచ్ఛకుప్పం - స్వర్ణకుప్పం లక్ష్యంతో ము ందుకుసాగుతున్న కుప్పం మున్సిపాలిటీ ఇదివరకే స్వచ్ఛత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్వచ్ఛాంధ్ర -2025 పురస్కారాన్ని అందుకున్న విషయం విదితమే.సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రస్తుతం ఈ ఏడాది జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మరో పక్క పట్టణ సుందరీకరణ పనులకు సైతం ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదివరకే పట్టణ ప్రధాన రహదారిలో ఏరియా ఆస్పత్రి సర్కిల్‌నుంచి ఎంఆర్‌రెడ్డి సర్కిల్, ప్యాలస్ రోడ్ - డికెపల్లి సర్కిల్, ఎంఆర్‌రెడ్డి సర్కిల్ - న్యూ లింక్‌రోడ్డులో రోడ్డు డివైడర్లు ఏర్పాటుచేసి వాటిలో మొక్కలు నాటడంతో పాటు రంగురంగుల ఎల్ఇడి విద్యుద్దీపాలు వేయించారు. ఇవి ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్‌డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పిడి వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం,పికెఎం ఉడా ఛైర్మన్‌డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌ల సూచనలతో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ప్రస్తుతం పగలురాత్రి పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు పట్టణ సుందరీకరణ పనులను విస్తృతం చేస్తున్నారు. స్థానిక బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ వంతెనపై పూలకుండీలు ఏర్పాటుచేయడంతో పాటు వాటిలో అందమైన మొక్కలను నాటించారు. ప్రస్తుతం ఇవి ఆ మార్గంలో వెళ్లే ప్రయాణీకులను ఆకట్టుకుంటున్నాయి.

## పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎపి : మంత్రి టిజి భరత్

## సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నాయకత్వంతోనే ఇది సాధ్యం

**సచివాలయం,జనవరి 3,ప్రభాతవార్త :** దేశంలో పెట్టుబడులకు గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిపోయిందని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు.కర్నూల్లోని ఆయన కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా సీ.ఎం.ఐ.ఈ డేటా ఆధారంగా విడుదల చేసిన నివేదికలో దేశవ్యాప్తంగా గత పంతొమ్మిది నెలల్లో వచ్చిన పెట్టుబడుల్లో 25.3శాతం వాటాతో ఏపి అగ్రస్థానంలో ఉందని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ బలమైన నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి అన్నారు.మాటిచ్చిన విధంగా రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.అధికారంలోనికి వచ్చిన మొదటి రోజునుండే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. సీబిఎన్ బ్రాండ్ చూసి ఏపికి పెట్టుబడిదారులు తరలివస్తున్నారని పేర్కొన్నారు.ఏపిలో పెట్టుబడులు పెట్టాలంటేనే భయపడే పరిస్థితిని గత పాలకులు తీసుకొస్తే...తమ ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తల్లో పూర్తి నమ్మకాన్ని కలిగించామన్నారు.విశాఖలో జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.13లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు.విశాఖలో జరిగిన ఒప్పందాలన్నీ గ్రౌండింగ్ అయ్యేలా తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు.జూమ్ కాల్‌లో మాట్లాడి రూ.1.35లక్షల కోట్ల పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్రానికి తీసుకొచ్చిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కిందన్నారు.గూగుల్ రాకతో ఇప్పుడు అందరిదృష్టి ఏపి వైపు మళ్లిందన్నారు.బెస్ట్ పాలసీలు తీసుకురావడంతో పాటు స్పీడ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అమలు చేస్తున్నట్లు చెప్పారు.ఎలాంటి అనుమతులు కావాలన్నా పెట్టుబడి దారులకు ఇబ్బంది కలగకుండా తొందరగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు.సంక్షేమం,అభివృద్ధిని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని మంత్రి టిజి భరత్ చెప్పారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు.

## మాజీ సైనికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### - మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా

**అనంతపురం, జనవరి 3 ప్రభాతవార్త బ్యూరో** మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి) మేజర్ జనరల్ అజయ్‌మిశ్రా పేర్కొన్నారు. అనంతపురంలో నూతనంగా నిర్మించిన ఎక్స్ సర్వీసెస్ కాంట్రి బ్యూటరీ హెల్త్ స్కీం (ఇసిహెచ్ఎస్) పాలి క్లినిక్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో అనంతపురం నగరంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాజీ సైనికుల వైద్య సేవల కోసం ఇసిహెచ్ఎస్ పాలీక్లినిక్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఈసిహెచ్‌లను ఆధునీకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈసిహెచ్ఎస్‌లలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. మాజీ సైనికులంతా అనేక సంఘాలుగా విడిపోకుండా ఒకే కుటుంబంలా కలిసి ఉండాలని ఆయన సూచించారు. మాజీ సైనికుల కోసం ఇంటిగ్రేటెడ్ కమ్యూటీలను ఒకే చోట నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సేవాభావంతో ప్రజా సంక్షేమం కోసం మాజీ సైనికుల సంక్షేమం కోసం పని చేస్తున్న మాజీ సైనికులకు సేవా అవార్డులను ఇవ్వబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు తీసుకొచ్చిన సమస్యలపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిఒసి కల్నల్ సంజయ్, ఓఐసి కల్నల్ ఓం ప్రకాష్, మాజీ సైనికుల సంఘం సంక్షేమ అధికారి తిమ్మప్ప, మాజీ సైనికులు చిరంజీవిరెడ్డి, వి.కె.రంగారెడ్డి, షేకన్నలతోపాటు పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.

## రాజధానిలో మంత్రులు, ఐఎఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాల ఏప్రిల్ నాటికి పూర్తి

### - మంత్రి నారాయణ

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై పురపాలక,పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ఫ్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. సమర్థవంతంగా ఉండాలంటే భౌగోళిక, జనాభా, పరిపాలనా అవసరాలకు అనుగుణంగా జిల్లాల నిర్మాణం ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుద దశకు చేరిందని.. అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు.

## కాగులుపాడులో 2 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జనవరి 3, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని కాగులపాడు గ్రామానికి జొన్నవాడ లింకురోడ్డు,కి కోవూరు కాలువపైన బ్రిడ్జికి 2 కోట్ల రూపాయాలతో ప్రతిపాదనలు పంపించడం జరిగిందని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. కాగులుపాడు గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతు గత ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం అన్ని సరి చేసి రాజముద్రతో పాసు పుస్తకాలు పంపిణి చేస్తున్నామని అన్నారు. 18 నెలలో కాగులుపాడులో 50 లక్షలా 70 వేల రూపాయాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌ని సూపర్ హిట్ చేసిందని ఆమె కొనియాడారు. ప్రజలందరు కూటమి ప్రభుత్వాన్ని ఆదరిస్తున్నారిని ఆమె ప్రశంసించారు ఈకార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేతుల మీదుగా చాంపియన్స్ పార్మర్స్ స్టాల్‌లో సోలార్ లైట్‌ట్రాప్స్, ఫిరమోన్ ట్రాప్స్, ట్రైకోగామాకార్డులు, వేపపిండి, జింకు సల్ఫేటు బయో పెర్టిలైజర్స్,నాన్ డిఏపిలను ఉచితంగా పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో కోవూరు వ్యవసాయశాఖ ఏడిఏ జి.అనిత, ఆత్మపిడి శారద, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రంతులయ్య ఉన్నారు.

# ఎస్వీయూ క్యాంపస్ స్కూల్‌కు రాష్ట్రంలో తృతీయ స్థానం

## అభినందించిన ఎస్వీయూ ఉపకులపతి



**తిరుపతి యూనివర్సిటీ ప్రభాతవార్త) :** జిల్లా స్థాయిలో మొదటి స్థానం, రాష్ట్రంలో తృతీయ స్థానం.. ఎస్వీయూ ఉన్నతాధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు స్వీకరఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, రిటైర్డ్ ఐఏఎస్ మోహన్ కందా నేతృత్వంలోని వారధి ఇండియా ఫౌండేషన్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలలో తిరుపతి జిల్లా కు చెందిన ఎస్వియు క్యాంపస్ స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించి ..27000/ వారితోషకం అందుకున్నారు. ఈ సందర్భంగా తృతీయ స్థానం సాధించిన విద్యార్థులు జ్రాపిక (9వ తరగతి) ధనుష్ కృష్ణ (8వ తరగతి), గగన్ కృష్ణ (8వ తరగతి), వీరి గైడ్ టీచర్ కే రాధమ్మను, ప్రధాన ఉపాధ్యాయురాలు శకీనమ్మ నూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య తాతా నర్సింగరావు, రెక్టార్ ఆచార్య చిప్పాడ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు, సిడిసి డీన్ ఆచార్య చెన్రాయుడు లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇదే వరవడితో శాస్త్రవేత్తలుగాను, ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థానానికి ఎదిగి సమాజంలో ఉన్న అనేక రుగ్మతలను తొలగించి పేద ప్రజలకు, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షి ంచారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానం..మొదటగా జిల్లాస్థాయిలో వారధి ఇండియా ఫౌండేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూ యూ క్యాంపస్ పాఠశాల, తిరుపతి లో 2025 సెప్టెంబర్ 16 న జరిగిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలలో ఎస్వీయూ క్యాంపస్ స్కూల్ ఉపాధ్యాయురాలు శ్రీమతి కే రాధమ్మ మార్గదర్శకత్వంలో జ్రాపిక (9వ తరగతి) ధనుష్ కృష్ణ (8వ తరగతి), గగన్ కృష్ణ (8వ తరగతి) లు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు.

# డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ పి. చంద్రశేఖర్



## వైద్య కళాశాల వైద్య అధ్యాపకుల, విద్యార్థులతో ముఖాముఖి

**తిరుపతి హెల్త్, జనవరి 3, ప్రభాతవార్త** ఎస్వీ వైద్య కళాశాలకు మొట్టమొదటి సారిగా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ పి. చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విచ్చేసి వైద్య అధ్యాపకులు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. వైద్య అధ్యాపకులు యూజీ, పిజి, వైద్య విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వి వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మెడిసిన్ విభాగం నందు నా ప్రయాణాన్ని కొనసాగించిన రోజులు నెమరు వేసుకుంటూ, కార్యాలయ విభాగంలో స్పెషలైజేషన్ సిఎంసి వైద్య కళాశాలలో పూర్తి చేసిన తర్వాత కర్నూల్ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపాల్ గా, సూపరిటెండెంట్, ఎన్నో పదవులు నిర్వహించి, ఇటు పేద రోగులకు, వైద్య విద్యార్థులకు, ఎన్నో సేవలందించామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వైద్య విద్యార్థుల్లో ఆత్మహత్యల నియంత్రణకు ప్రత్యేక శిక్షణ దేశంలోనే తొలిసారి ఏపీలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం వైద్య విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలను తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించిందన్నారు. అమెరికాకు చెందిన క్వశ్చన్, పర్స్యూవేడ్ రిఫర్ ఇన్స్టిట్యూట్ ఇండియా (క్యూపీఆర్ ఐ) సంస్థతో డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం ఒప్పందాన్ని చేసుకుంది అని తెలిపారు. ఎంబీబీఎస్‌లో ప్రథమ సంవత్సరం (2025-26)లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో చేరిన విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందింపచేసేందుకు, ఒత్తిడిని పారదోలేందుకు, ఆత్మహత్య ఆలోచనల నుంచి బయటపడేలా కళాశాలల వారీగా ఎంపికచేసిన తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

# సౌత్ ఇండియా సావిత్రిబాయి పూలే బెస్ట్ టీచర్ అవార్డుల వేడుక

**విజయవాడ, జనవరి 3, ప్రభాతవార్త :** విజయవాడలో గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సౌత్ ఇండియా సావిత్రిబాయి పూలే బెస్ట్ టీచర్ అవార్డ్స్ వేడుక శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఏపి. తెలంగాణ, కర్ణాటక లకుచెందిన ఉత్తమ ఉపాధ్యాయునులకి బహుమతులిచ్చారు. సభాధ్యక్షుడు, సంఘం అధ్యక్షులు పాలేలా రామాంజనేయులు మాట్లాడుతూ సావిత్రిబాయి గారి తెరిచిన బడి నాడు నాటిన మొక్క మహావృక్షమై నేడు దేశవ్యాప్తంగా ఫలాలు ఇస్తుందని, ఇక్కడ గౌరవించే ప్రతి ఉపాధ్యాయిని సావిత్రి భాయ్‌కి ఒక ఆధునిక రూపం అన్నారు. మీరు బోధిస్తున్నది కేవలం పాఠాలు కాదు జీవితాన్ని ఎలా నడపాలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోవాలో సమాజంలో మార్పు ఎలా తీసుకురావాలో మీ మీ పాఠలలో తెలియజేస్తున్నారన్నారు. ముఖ్య అతిథులు భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్, నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ జాతీయ బాధ్యులు తెలంగాణకు చెందిన శ్రీకాంత్ కాల్ కర్ణాటక నుంచి ప్రొఫెసర్ శైలజ లు మాట్లాడుతూ ఒక మహిళా ఉపాధ్యాయుని ఒక గ్రామాన్ని మేలుకొలుపుతూ ఒక తరాన్ని మార్చేస్తుందని ఒక దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలబడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి డిపిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎంటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటి రమేష్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి వీర శివ బాబు, పఠాన్ బాజీ, శ్రీమతి గౌరి, శ్రీమతి దేవి, గుర్రం మురళీమోహన్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నటరాజస్వామి కల్యాణం

## - వేదోక్తంగా ఆరుద్ర ఉత్సవాలు - హుండీ ఆదాయం రు.3కోట్లు



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జనవరి 3, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం వేడుకగా శ్రీ నటరాజస్వామి, శ్రీ శివకామ సుందరి అమ్మవార్ల దివ్య లీలా కళ్యాణ మహోత్సవం జరిగింది. ఆరుద్రోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలక మండలి, అధికారులు పాల్గొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు శనివారం లెక్కించగా రు.3,06,65,288ల నగదుతో పాటు 341 గ్రాముల బంగారం, 3కెజిల 586 గ్రాముల వెండి, 6523 యుఎస్ డాలర్స్, 1060 ఇంగ్లాండ్‌పౌండ్లు, 322 కువైట్ దీనార్లు, 10 ఆస్ట్రేలియా డాలర్స్, 12 సింగపూర్ డాలర్స్, 100 హాంకాంగ్ డాలర్స్, 700 ఒమన్ రియాల్స్, 1000 జపాన్ యెన్స్, 40 శ్రీలంక రూపాయలు, 40 యుఎఇ దిర్హామ్స్, 3500 మయన్మార్ క్యాట్‌లు, 11 మలేషియా రింగేట్స్, యూరోలు 40, దక్షిణాఫ్రికా రాండ్స్ 700, ఖతార్ 12 రియాల్స్ లభించినట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మవారిని శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పామిడిఘంటం శ్రీ నరసింహ దంపతులు, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే గోపుర బంగారు తాపడానికి రు.1లక్ష విరాళం హైదరాబాద్‌కు చెందిన ఎం గోపాల్ పేరిట అందించారు. విజయవాడకు చెందిన మరో దాత ఎం నాగలక్ష్మి సాయి సత్య రు.1,00,010లను తమ కుటుంబసభ్యులతో కలిసి విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు.

# బళ్లారి జిల్లా ఎస్పీ సస్పెన్షన్‌పై వివాదం

## విధుల్లో చేరిన 7 గంటల్లోనే ఎలా సస్పెండ్ చేస్తారని బిజెపి నేతల ఆగ్రహం



బాధిత కుటుంబానికి కర్ణాటక మంత్రి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

**అనంతపురం, జనవరి 3, (ప్రభాతవార్త బ్యూరో)** కర్ణాటక రాష్ట్రం లోని బళ్లారి జిల్లా కేంద్రమైన బళ్లారి నగరంలో అధిపత్య పోరులో భాగంగా బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య బ్యానర్ల ఏర్పాటు విషయంలో మొదలైన గొడవ కాల్పులు వరకు దారి తీసిన విషయం తెలిసిందే. బ్యానర్ తొలగించారని కారణంతో రెండు వర్గాలు రాళ్లు, కర్రలు, బీరు బాటిల్స్ తో దాడులు , ప్రతి దాడులు చేసుకోవడంతోపాటు కాల్పులు కూడా చేసుకున్నారు. ఈ సంఘటనలో కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్ రెడ్డి చనిపోవడం, రెండు వర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు, అధికారులు గాయపడ్డారు. ఈ సంఘటనపై కర్ణాటక ప్రభుత్వం సీరియస్ అయి బళ్లారి ఎస్పీ పవన్ నెజ్జర్ ను సస్పెండ్ చేసింది.. అయితే ఎస్పీ సస్పెన్షన్ను కూడా అక్కడ ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తప్పుపడుతోంది. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పవన్ కనీసం ఒకరోజు కూడా గడవలేదని, ఈ పరిస్థితుల్లో ఎస్పీని ఎలా సస్పెండ్ చేస్తారని, కాంగ్రెస్ కార్యకర్తగా వ్యవహరించిన బళ్లారి డీఎస్పీ నందన్ రెడ్డిని సస్పెండ్ చేయాలని బిజెపి పట్టుబడుతోంది.. ఇదిలా ఉండగా బళ్లారి నగరంలో బ్యానర్ల ఏర్పాటు సందర్భంగా జరిగిన గొడవలపై కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు మందితో సత్యశోధన కమిటీని నియమించింది. ఆ కమిటీ సభ్యులు శనివారం బళ్లారిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు . ఇందులో భాగంగా కర్ణాటక మంత్రి జహీర్ అహ్మద్, ఎమ్మెల్యేలు భరత్ రెడ్డి, నాగేంద్ర తదితరులు వచ్చి బాధిత కుటుంబానికి 25 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అదే సమయంలో శనివారం (జనవరి 3) బళ్లారి నగరంలో ఏర్పాటు చేయాల్సిన వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమం ను గొడవల కారణంగా కాంగ్రెస్ జిల్లా నేతలు వాయిదా వేశారు. అదే సమయంలో బళ్లారి నగరం ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన బ్యానర్ను కూడా బళ్లారి కార్పొరేషన్ అధికారులు శనివారం తొలగించారు. బళ్లారి నగరంలోని ప్రధాన వీధుల్లోనూ, నేతల ఇళ్ల వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. నివురు కప్పిన నిప్పులా బళ్లారి నగరం ఉంది.. శనివారం రోజు అధికార కాంగ్రెస్ నేతలు, ప్రతిపక్ష బిజెపి నేతలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించారు.. మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డి ప్రత్యేకంగా బళ్లారి ఎమ్మెల్యే భరత్ రెడ్డి , మరి కొంతమంది పై పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.. బ్యానర్ అల్లర్లకు ఎస్పీ నీ ఎలా సస్పెండ్ చేస్తారు అన్న మాజీ మంత్రి శ్రీరాములు ....... బళ్లారి నగరంలో జరిగిన బ్యానర్ అల్లర్లకు సంబంధించి జిల్లా కొత్త ఎస్పీ పవన్ నేజూర్‌ను సస్పెండ్ చేయడం తప్పుఅని మాజీ మంత్రి శ్రీరాములు అన్నారు,

# విజయవాడ బుక్స్ ఫెస్టివల్ 2026లో పౌర గ్రంథాలయ శాఖ బుక్ స్టాల్ ప్రారంభోత్సవం..

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతిధి:**భ విజయవాడలో ఇందిరా గాంధీ స్టేడియం నిర్వహిస్తున్న 36 వ బుక్స్ ఫెస్టివల్‌లో ఆంధ్ర ప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ చే బుక్ స్టాల్ ను ఏర్పాటు చేసారు. శనివారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల. కోటేశ్వరరావు పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఏ. కృష్ణమోహన్ గారితో కలసి ప్రారంభించారు.ఈ బుక్ స్టాల్ నందు రేర్ బుక్స్,తాళపత్ర గ్రంథాలు, విలువ గల పుస్తకములు,ఇతర అమూల్యమైన గ్రంథాలను ప్రదర్శనకు ఉంచారు. నన్నయ కాలం నాటి తాళ పత్ర గ్రంథములుచేతితో వ్రాసే ఘటం,, 13,, 14 శతాబ్దాల రాగి శాసనాలు,,పురాతన బైబిల్,, అమూల్యమైన గ్రంథాలు ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. స్వాతంత్ర సమరయోధుల/ గ్రంథాలయ ఉద్యమకారుల /సాహితీ మూర్తుల చిత్రపటాలను బుక్ స్టాల్ నందు ప్రదర్శనకు ఉంచారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అధికారులు,,కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి. రవికుమార్ ,గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్య దర్శితి వి. సుబ్బ రత్నమ్మ, ఇతర జిల్లాల గ్రంథా లయ సంస్థ కార్యదర్శి లు,,గ్రంథాల యాల సిబ్బంది,, శిక్షణా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

## - మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**అనుమసముద్రంపేట (నెల్లూరు), జనవరి 3, ప్రభాతవార్త :** రైతును రాజుగా చూడాలన్నదే ధృఢ సంకల్పంతో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏఎస్‌పేట మండలం హసనాపురంలో రైతుల ఆనందోత్సాహాల నడుమ ప్రభుత్వ రాజముద్రతో ముంద్రించిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను అధికారులతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి రైతుల ఇంటివద్దకే వెళ్ళి పంటాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ "మీ భూమి-మీహక్కు " కార్యక్రమం ద్వారా రైతులకు సంపూర్ణ భూ యజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజముద్రతోపాటు క్యూ ఆర్ కోడ్ వంటి ఆధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన నూతన పట్టాదారుపాస్‌పుస్తకాలను రైతులకు అందిస్తున్నా మన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం గత ముఖ్యమంత్రి ఫోటోలతో ముద్రించిన పట్టాదార పాస్‌పుస్తకాలను రద్దు చేసి ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాలు పంపిణీ చేస్తున్నా మన్నారు. అధికారం చేపట్టిన తొలి క్యాబినేట్ సమావేశంలోనే రైతులకు నష్టం కలిగించేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేశామన్నారు. గత ప్రభుత్వం కోటి మంది రైతుల భూములకు వారి హక్కులు లేకుండా చేసే విధంగా పనికిరాని పట్టాదారు పాస్‌పుస్తకాలను ముద్రించేందుకు ప్రయత్నించిందని ఎన్నికలకు మూడు నెలల ముందే ఈ దుర్మార్గపు ఆలోచనతో 35లక్షల రైతుల పాస్‌పుస్తకాలను మార్చేశారన్నారు. దొంగనోటు లాంటి పాతపాస్‌పుస్తకాల స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాస్‌పుస్తకాలను ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రం లో 7200గ్రామాల్లో గత ప్రభుత్వం 23లక్షల పట్టాలు పంపిణీ చేసిందని మరో 12 లక్షల పట్టాలను పంపిణీ చేశామన్నారు. నెల్లూరుజిల్లాలోని 235గ్రామాల్లో 1.05లక్షల మందికి పైగా రైతులకు గత ప్రభుత్వం జగన్‌ఫోటోతో కూడిన పాస్‌పుస్తకాలు పంపిణీ చేసిందని ఆత్మకూరు నియోజకవర్గంలోని 5మండలాల్లోని 13గ్రామాల్లో 5,486 పట్టాలను అందించామన్నారు. వాటిస్థానంలో నేడు ప్రభుత్వ రాజముద్ర, క్యూ ఆర్ కోడ్‌తో కూడిన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నూతన పాస్‌పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. ప్రతినెల 1నుంచి7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈకార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రతినెల 9వ తేదీ ఒక గ్రామంలో ముఖ్యమంత్రి స్వయంగా హాజరై పట్టాదారుపాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తారని ఆనం తెలిపారు. పట్టాదారుపాస్‌పుస్తకాల్లో ఎలాంటి చిన్న తప్పు ఉన్నా వెంటనే సరిదిద్దుతామన్నారు. రైతుకు అన్నంపెట్టే భూమికి రైతును రాజుగా చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

# రేపు గన్నవరం విమానాశ్రయంలో సబ్‌స్టేషన్ ప్రారంభం

**గన్నవరం, జనవరి 3, ప్రభాతవార్త :** గన్నవరం గన్నవరం నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తొలగించేందుకు గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.30.65 కోట్ల ఖర్చుతో నూతనంగా నిర్మించిన 132/33 కె.వి విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఈఉపకేంద్రం వల్ల నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంతోపాటు, ఉంగుటూరు, విజయవాడ రూరల్ మండలాల్లోని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటంతోపాటు, విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తొలగిపోనున్నాయి. తద్వారా 3.5లక్షల మంది ప్రజలకు విద్యుత్ సరఫరా ఇబ్బందుల నుండి విముక్తి లభిస్తుంది. ఈనెల 5వతేదీ ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఇంధనశాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఈవిద్యుత్ కేంద్రం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈకేంద్రంలో రెండు 50 యంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయటంతోపాటు, అధునిక నియంత్రణ వ్యవస్థలను ఏర్పాటు చేసారు. గన్నవరం విమానాశ్రయంతోపాటు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న గన్నవరం పరిసర ప్రాంతాలు, పెరుగుతున్న పారిశ్రామిక, గృహ, వ్యవసాయ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈకేంద్రం ఏర్పాటు చేసారు. ఈకేంద్రం ఏర్పాటు చేయటం ద్వారా గన్నవరం విమానాశ్రయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం కలిగింది. ఈకేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తదితరులు పాల్గొంటారని అధికారులు తెలిపారు.

# బిసిల రక్షణ చట్టం బిసివర్గానికి గొప్ప వరం

**విజయవాడ, జనవరి 3, ప్రభాతవార్త :** ఆర్ కృష్ణయ్య 40 సంవత్సరాల ఉద్యమ ఫలితం బీసీల రక్షణ చట్టం ముసాయిదా రూపకల్పనకు శ్రీకారం చుడుతున్న కూటమి ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ వారి చిత్రపటాలకు 30 కి పైగా బీసీ కుల సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా ఎన్.మారేష్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలుగా అవమానాలకు, దోపిడికి గురవుతున్న బీసీల ఆత్మగౌరవానికి రక్షణ కవచం లాంటి "బీసీల రక్షణ చట్టం చేయబోతున్న సిఎం చంద్రబాబు బీసీల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ చట్టం ద్వారా దక్కుతుందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలోనే బీసీ రక్షణ చట్టం బిల్లు చట్టం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కుల సంఘాల నాయకులు కూటమి ప్రభుత్వంకు, అధినేతలకు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్ల బాబు, ఆకునూరు సుబ్బారావు, తోకల రవి, దేరంగుల నాని, శ్రీనివాసరావు, అనిల్ మఖాన్ సుబ్బారావు, తిరుపతిరావు, నరసింహారావు, చలపతిరావు పాల్గొన్నారు.

# ఆవకాయ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు :కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

## - సమన్వయ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పన

**విజయవాడ,జనవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** సినిమా, సంస్కృతి, సాహిత్య అమరావతి ఉత్సవాలకు సమన్వయ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్షీ ృశ తెలిపారు.

కలెక్టర్ లక్షీ ృశ శుక్రవారం కలెక్టరేట్ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో ఆవకాయ్ ఉత్సవాలపై జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, టీమ్‌వర్క్ (సెలబ్రేటింగ్ ది ఆర్ట్స్) సంస్థ ప్రతినిధి సయ్యద్ శామ్స్‌తో కలిసి రెవెన్యూ, వీఎంసీ, పోలీస్, పర్యాటకం, వైద్య ఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సన్నద్ధతా సమావేశం నిర్వహించారు. పున్నమిఘాట్, భవానీ ద్వీపంలో జరిగే కార్యక్రమాలు, సందర్శకుల ఉచిత రిజిస్ట్రేషన్, సీటింగ్ అరేంజ్‌మెంట్, సందర్శకుల భద్రత, ట్రాఫిక్ ప్రణాళిక, వేదికల వద్ద ఏర్పాట్లు తదితరాలపై చర్చించారు. 8వ తేదీ సాయంత్రం ఉత్సవాల ప్రారంభోత్స ఊరేగింపు మొదలు 10వ తేదీ సాయంత్రం జావేద్ అలీ సంగీత కచేరీ వరకు వివిధ కార్యక్రమాల షెడ్యూల్‌ను పరిశీలించి.. చేస్తున్న, చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. గౌరవ ముఖ్యమంత్రితో పాటు ప్రముఖుల సందర్శన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపైనా సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్షీ ృశ మాట్లాడుతూ అమరావతిని సాంస్కృతిక సాహితీ రాజధానిగా తీర్చిదిద్దేందుకు సినిమా, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని ఒకేవేదికపైకి తెచ్చే గొప్ప ఉత్సవాలు ఇవని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వారసత్వ సంపదకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా ఈ ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో పారిశుద్ధ్య ప్రణాళిక, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుకు వీఎంసీ దృష్టిసారించాలన్నారు. సందర్శకుల భద్రత, బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్‌పై పోలీసు శాఖ దృష్టిపెట్టాలన్నారు. సూచికల బోర్డులను సరైన విధంగా ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాల ఏర్పాటుకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్షీ ృశ సూచించారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీ షేక్ షెరీన్ బేగం, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఏడీసీ డా. డి.చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

## - మంత్రి పయ్యావుల కేశవ్



పరికరాల నాణ్యతను పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, జనవరి 3 ప్రభాతవార్త** మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టు) రైతులకు ఎంతో ఉపయోగకరమని దీనిని కచ్చితంగా పూర్తిచేసి తీరుతామని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శనివారం ఆయన ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామంవద్ద మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన నెటాఫిం స్టాక్ గోడౌన్‌ను పరిశీలించారు. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, కూడేరు, బెలుగుప్ప మండలాలకు బిందు సేద్యం ద్వారా 50వేల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పేజ్-2లో భాగంగా 890.60 కోట్ల రూపాయల వ్యయంతో 2014-19 మధ్య రూపొందించిన మెగా డ్రిప్ ఇరిగేషన్ పనులను గత ప్రభుత్వం నిలిపివేయగా ఆ పనులను పునః ప్రారంభించే క్రమంలో ఆయన పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ ఎన్ని ఎకరాల్లో స్టాక్ గోడౌన్ ఉంది, ఏ రకమైన మెటీరియల్ ఇక్కడ నిల్వ చేశారు, వాటి మన్నిక తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏడున్నర ఎకరాల్లో స్టాక్ గోడౌన్ ఉందని, మెటీరియల్ గురించి, ఇతర వివరాలను మ్యాప్ ద్వారా అధికారులు మంత్రికు వివరించారు. పీవీసీ పైపులు, ఇతర మెటీరియల్‌కు సంబంధించి టెస్టింగ్‌కు పంపించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మెగా డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంజూరు చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మధ్యలోనే ఆపివేయడం చాలా దుర్మార్గమైన చర్యన్నారు. 2014-19 కాలంలో తమ ప్రభుత్వం మోదలు పెట్టిన ఈ ప్రాజెక్టును అమలు చేసి ఉంటే లక్షలాది మంది రైతులు బాగు పడేవారన్నారు. ఈ ప్రాజెక్టు అమలు చేయడం ద్వారా జీవితకాలం బాగుండాలని, మెటీరియల్ నాణ్యతలో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు సూచించారు.

# బడ్జెట్ రూపకల్పనకు సిద్ధమవుతున్న ఆర్థిక శాఖ

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన ఆర్థిక సంవత్సరం.2026-27క రాష్ట్ర బడ్జెట్ రూప కల్పనపై కసరత్తు మొదలైంది. అన్ని ప్రభుత్వ శాఖలు జనవరి నెలాఖరు లోగా తమ బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను సూచించింది. దీంతో పాటు 2025-26 అంచనాల సవరణ ప్రతిపాదనలు కూడా ఇవ్వాలని, అదే సమయంలో ఏ ప్రభుత్వ హెడ్ కింద ఎంత మొత్తం ఆదా అయ్యిందో ముందే గుర్తించాలని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి దాకా వివిధ ఖాతాల కింద ఎంత ఖర్చు చేశారు?మిగిలిన మూడు నెలల్లో ఎంత ఖర్చు చేసే అవకాశముందో స్పష్టమైన అంచనాలతో సవరణలు ప్రతిపాదించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తోంది. ఇళ్ళ నిర్మాణం, రహదారులు, ఇతర రవాణా సౌకర్యాల అభివృద్ధి,రక్షిత నీటి కల్పన,విద్య,వైద్యం తదితర అంశాల్లో ప్రమాణాల పెరుగుదల,పారిశ్రామికీకరణ విస్తృతిని దృష్టిలో ఉంచుకొని మూలధన బడ్జెట్ ప్రణాళిక రూపొందించాలి.

# ఆంధ్రప్రదేశ్ జిల్లా , నగర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షుల నియామకం

**విజయవాడ.జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్ జిల్లా ,నగర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులను పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం నాడు ఒక లిస్ట్ రిలీజ్ చేశారు. జిల్లాలు, ముఖ్య పట్టణాలకు కలిపి 41 మంది అధ్యక్షుల పేర్లను ఏఐసీసీ ప్రకటించింది. వీరి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రకటనలో స్పష్టం చేశారు కేసీ వేణుగోపాల్. ప్రతి జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన ఏఐసీసీ పర్యవేక్షకులు.. అనేక సమీక్షలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, ముఖ్య వ్యక్తులతో చర్చలు జరిపి సమగ్ర నివేదికను సమర్పించారని.. ఆ నివేదికల ఆధారంగా కొత్త అధ్యక్షులను నియమిచండం జరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు సతక బుల్లిబాబు అనకాపల్లి బొడ్డు శ్రీనివాస్. అనంతపురం వై. మాధుసూదన్ రెడ్డి,. అనంతపురం సిటీ షేక్ ఇమామ్ వలి. అన్నమయ్య (రాజంపేట్) గాజుల భాస్కర్ బాపట్ల అమాంచి కృష్ణ మోహన్,. చిత్తూరు దెయ్యాల రమేష్ బాబు. చిత్తూరు సిటీ జి. టికరామ్. డాక్టర్ అంబేద్కర్ కొనసీమ కోతూరి శ్రీనివాస్. తూర్పుగోదావరి (రాజమహేంద్రవరం) బోడ లక్షీ ృ వెంకట ప్రసన్న.. ఏలూరు రాజనాల రమ్మోహన్ రావు. ఏలూరు సిటీ పి. బాల వెంకట ఉన్నారు.

# స్వదేశీ వస్తువులను ప్రోత్సహిద్దాం మేకిన్ ఇండియాకి మద్దతిద్దాం

## - ఎంపి కేశినేని శివనాథ్


**విజయవాడ,జనవరి 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తులను ప్రోత్సహించి మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామీణ భారతాన్ని నిర్మిద్దాం అని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు.స్థానిక పంటకాలువ రోడ్డులోని మేరిస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ రాష్ట్ర స్థాయి ఖాదీ మహోత్సవ్ 2025- 2026 లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను శనివారం విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ప్రదర్శనలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రాష్ట్రాల నుండి అనేకమంది హస్తకళాకారులు మరియు పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడానికి విజయవాడకు తదలి వచ్చారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన ఖిమేక్ ఇన్ ఇండియాఖి మరియు ఖిస్వదేశీ వస్తువుల వినియోగంఖి అనే లక్ష్యాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా ఎంతోమంది యువతీ యువకులు సబ్సిడీ లోన్లు పొంది, స్వయం ఉపాధి సాధిస్తూ సొంత కాళ్లపై నిలబడటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే ప్రధాని మోదీ ఆశయానికి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రలక్ష్యానికి లోకల్ బ్రాండ్‌లను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. విజయవాడ నగర ప్రజలందరూ ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి, ఇక్కడి స్టాళ్లను మరియు హస్తకళాకారులను ప్రోత్సహించాలని పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ పిలుపునిచ్చారు. భావితరాలకు మన వారసత్వంగా ఖాదీ వస్తువులను అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇలా ప్రోత్సహించడం వల్ల తక్కువ ధరలకే నాణ్యమైన వస్తువులు లభించి వారి జీవనోపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందేలా ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర సంచాలకులు డా.ఎస్. గ్రేప్ మాట్లాడుతూ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (రీజు।ది), భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో పీఎంఈజీపి ఖాదీ మార్కెటింగ్ రాష్ట్రస్థాయి సంయుక్త మార్కెటింగ్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం జరిగిందన్నారు.

# ఆగస్టు వరకు ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు

**విజయవాడ.జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగుల మెడికల్ రీయింర్స్‌మెంట్ బిల్లులను ఆగస్టు-2025 వరకు క్లియర్ చేసినట్లు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ దినేష్ కుమార్ తెలిపారు. ఉద్యోగుల వైద్య బిల్లులు,హెల్త్ కార్డులు,నెట్‌వర్కింగ్ ఆస్పత్రుల్లో చికిత్సలపై ఉద్యోగ సంఘాల నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...'అన్ని క్లెయింలను వీలైనంత త్వరగా పరిష్కరించి పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# చుక్కనీటినీ వదలం!

## తెలంగాణ హక్కులకు భంగం కలగనీయను



- ప్రాజెక్టుల ప్లాన్ మార్చి రూ.వేల కోట్లు దోచుకున్నారు..
- తోలు తీస్తా అన్న వాళ్ల నాలుక కోస్తా: అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- పాలమూరుకు అనుమతులు ఇవ్వాలి, బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు
- 2 తీర్మానాలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి3:** 'తెలంగాణ నీళ్ల విష యంలో, అభివృద్ధి విషయంలో మేమంతా ఏకాభిప్రాయంతో పనిచేస్తాం, తెలంగాణ రావాల్సిన నీటి హక్కుల కోసం పోరాడుతాం చచ్చినా తెలంగాణ కోసం చస్తాం.. బ్రతికినా తెలంగాణ కోసం బ్రతుకుతాం.. ప్రాణమున్నంత వరకు తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాం తెలంగాణ ప్రజలకు మేలు చేయాలన్నదే నా ఆలోచన. దేవుడి మీద ఆన.. నేను ఉన్నంత కాలం తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనీయను' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ,రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వెల్లడించారు. కృష్ణా నదీ జలా లపై అసెంబ్లీలో సిఎం సుదీర్ఘ ప్రసంగించారు. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర నాయకులతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు కొట్లాడి పాలమూరు రంగా రెడ్డిని సాధించుకున్నారు.ఆ సమయంలో మహబూబ్ నగర్ ఎంపీగా ఉన్న కెసీఆర్ పాలమూరు ఎత్తిపోతల ఇవ్వాలని అడగలేదు ఏ నైతిక హక్కుతో కేసీఆర్ ఇవాళ మాట్లాడుతున్నారు? అని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై బహిరంగ సభలు కాదు.. సభలోనే చర్చించాలని మేం కెసీఆర్, హరీష్‌ను ఆహ్వానించామని తెలపారు.పదేళ్లు కృష్ణా నీటిని ఏపీ తరలించుకుపోయేం దుకు సహకరించి తెలంగాణకు తీరని అన్యాయం చేశారు.వివరాలతో సభలో చర్చిద్దామంటే సభకు రాకుండా వెళ్లిపోయారని ఆగ్రహించారు.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కట్టాలని మొట్ట మొదట 2009 లో ఆనాటి ఎంపీ విఠల్ రావు వైఎస్ రాజశేఖరరెడ్డికి లేఖ రాశారు.చరిత్రలో పాలమూరు రంగారెడ్డికి ఎలా పునాదులు పడ్డాయో తెలంగాణ సమాజానికి తెలియాల్సిన అవసరం ఉంది విఠల్ రావును ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 70 టీఎంసీల వరద జలాలను మళ్లించి సాగునీటిని అందించేందుకు పాలమూరు ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి రాష్ట్ర ఆమోదం తెలిపింది.జూరాల నుంచి 70 టీఎంసీల వరద జలాలతో పాలమూరు ప్రాజెక్టు సర్వేతో పాటు డీపీఆర్ తయారు చేయాలని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా వాళ్లకు ఈ జీవో ద్వారా బాధ్యతలు అప్పగించింది. జూరాల సోర్స్‌గా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మించాలని ఆనాడు తెలంగాణ ఉద్యమకారులు, తెలం గాణ రిటైర్డ్ ఇంజనీర్ ఫోరంకు చెందిన నిపుణులు, ఇంజనీర్లు సూచించారు. 26 రోజుల తర్వాత ఈ ప్రాజెక్టును కేసీఆర్ పథకం ప్రకారం డైవర్ట్ చేశారు. జూరాల నుంచి కాకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు సోర్స్‌ను శ్రీశైలం నుంచి మార్చాలని ఆదేశాలు జారీచేశారని ఆరోపించారు.జూరాల వద్ద నిర్మిస్తే పంపులకు రూ.5,185 కోట్లు అంచనా వేస్తే .. సోర్స్ ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి పంపులు, లిఫ్టుల సంఖ్య పెంచారు.37 పంపులకు రూ.10,335 కోట్లకు అంచనాలు పెంచారని చెప్పారు.

ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే అప్పటి ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలో వీలైనన్ని సాగునీటి ప్రాజెక్టులు మంజూరు చేసింది. 2005 నుంచి 2014 నాటికే కృష్ణా బేసిన్‌లో ఎస్ఎల్‌బిసి, కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి, డిండి, మక్తల్ నారాయణపేట కొడంగల్, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు చేపట్టింది. 2014లో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ఈ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాల్సిందిపోయి అసంపూర్తిగా వదిలేసిందని తప్పుపట్టారు. 490 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు కేటాయిస్తే.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక.. కేసీఆర్, హరీష్ రావు బాధ్యతలు చేపట్టాక తెలంగాణ ప్రజలకు మరణ శాసనం రాశారు 2015 జూన్‌లో జరిగిన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో 299 టీఎంసీలకు అంగీకరించారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీలల్లో తెలంగాణకు 490 టీఎంసీలు అడగాల్సిందిపోయి 299 టీఎంసీలకు ఒప్పుకుని సంతకం పెట్టారు 21.09.2016 న జరిగిన అపెక్స్ కమిటీ మీటింగ్‌లోనూ మనకు 299 టీఎంసీలు చాలు అని కేసీఆర్ తాత్కాలిక నీటి వాటాలకు ఒప్పుకొని వచ్చారు.06.10.2020లో జరిగిన రెండో అపెక్స్ మీటింగ్‌లోనూ ఈ కేటాయింపులే కొనసాగించండి. అని శాశ్వతంగా ఒప్పుకొని వచ్చారని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ద్వారా రూ.55వేల కోట్లు కొల్లగొట్టాలని కెసిఆర్ ప్లాన్ చేశారని సిఎం ఆరోపించారు.డిపిఆర్ లేకుండా రూ.25వేల కోట్లు ఖర్చు చేశారు. తుమ్మిహట్టి వద్ద ప్రాణహిత చేవేళ్ల కట్టకుండా మేడిగడ్డ దగ్గర కాళేశ్వరం నిర్మించి అంచనాను రూ.38వేల కోట్ల నుంచి రూ.లక్ష కోట్లకు పెంచారని,అలాగే జూరాల దగ్గర కట్టాల్సిన పాలమూరును శ్రీశైలానికి మార్చి రూ.32,800 కోట్ల నుంచి రూ.90వేల కోట్లకు పెంచారని తెలిపారు. వలసల జిల్లా పాలమూరు బిడ్డగా కరువు కష్టాలు, పేదరికం ఎలా ఉంటుందో నాకు పూర్తిగా తెలుసు అని చెప్పారు. అయితే తెలంగాణ ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతుందని, ఇందుకు కాంగ్రెస్ కారణమని కెసీఆర్ విమర్శించారు గత ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు ఎలా ఉపయోగపడతాయో, ఈ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై తన అనుభవంతో సూచనలు ఇస్తారని అనుకున్నాం అని పేర్కొన్నారు. అందుకే కృష్ణా జలాలపై ఒకరోజు, గోదావరి జలాలపై ఒకరోజు సభలో చర్చిద్దామని ఆహ్వానించామని చెప్పారు. ఈ శాసన సభకు ఒక పవిత్రత ఉంది.ఈ సభలో జరిగే చర్చలను, విషయాలను, అందులోని వాస్తవాలను ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో నమ్ముతారు. ఎందుకంటే... ఇక్కడ అబద్దానికి ఆస్కారం లేదు. మాటల గారడీలకు స్థానం లేదు అని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలే తప్ప రాజకీయ ప్రయోజనాలకు ఇది వేదిక కాబోదు.తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ప్రాతినిధ్యానికి ప్రతిరూపం ఈ సభ.ఈ సభలో మాట్లాడే ప్రతిమాట రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఉంటుందన్న నమ్మకం ప్రజల్లో ఉంటుంది అని చెప్పారు. గడచిన రెండేళ్లుగా ప్రతిపక్ష నాయకుడు సభకు రావడం లేదు. సభకు రండి అని నేను పదే పదే విజ్ఞప్తి చేశా అని పేర్కొన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉంది అని చెప్పుకునే ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాలేదు సభలోకి రాము, చర్చలో పాల్గొనం అని హరీష్ రావు మాట్లాడటం చట్టసభలను అవమానించడమే అని పేర్కొన్నారు. మీరు సభ పెట్టండి మీ బట్టలు ఒడదీస్తామన్నారు తోలు తీస్తామని కేసీఆర్ మాట్లాడారు వారు సభలో చర్చలో పాల్గొని ఉంటే.. ఎవరి బట్టలు ఎవరు ఊడదీస్తారు.. ఎవరి తోలు ఎవరు తీస్తారు అనేది తెలంగాణ ప్రజలకు తెలిసేది అని వ్యాఖ్యానించారు. కెసిఆర్ తోలు తీస్తా అన్నాడు కదా. తెలంగాణ రైతుల పట్ల తమ చిత్తశుద్ధిని ఎవరైనా ప్రశ్నిస్తే తోలు తీయడం కాదు నాలుక కోస్తా,ఇంకేదైనా మాట్లాడు, అడ్డగోలుగా మాట్లాడితే తోలు తీస్తా అన్నవాళ్ల నాలుక కోస్తా, దేవుడిపై ఆన... తెలంగాణ ప్రజల హక్కులకు భంగం కలగనివ్వను అని స్పష్టం చేశారు. పదే పదే తనకు ఇంగ్లీష్ రాదంటూ హేళన చేస్తున్నారని, చైనా,జపాన్,జర్మనీ వాళ్లకు ఇంగ్లీష్ వచ్చా మెస్సీకి కూడా స్పానిష్ తప్ప ఏమి రాదు, ఆటగాడికి ఆట రావాలి, పాలకుడికి పాలన తెలియాలి. భాష అనేది మాట్లాడుకోవడానికి దాని వల్ల జ్ఞానం రాదు, అమెరికాలో బిచ్చం ఎత్తుకునేవాడికి ,బాత్‌రూమ్‌లు కడిగేవాడికి ఇంగ్లీష్ వస్తుందని, వారికి వేరే భాష రాదు, తెలుగు మాట్లామనండీ చూద్దాం అని తెలిపారు. అసెంబ్లీలో సిఎం రేవంత్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అపితేనే చర్చలకు వస్తామని చంద్రబాబుకు సూటిగా చెప్పినట్లు వెల్లడించారు. తాను తెలంగాణకు అన్యాయం చేయనని, ప్రాంతం తర్వాతే పార్టీ అంటూ నాడు బయటికొచ్చినట్లు చెప్పారు. రాష్ట్రం కోసం ఎవరితోనైనా పోరాడుతానని రేవంత్ తేల్చి చెప్పారు. నీటి వివాదాలపై అసెంబీల్లలో సుదీర్ఘ చర్చ పెట్టిన ప్రభుత్వం రెండు కీలక తీర్మానాలు చేసింది. పాలమూరుకు అనుమతులు ఇవ్వాలంటూ ఏకగ్రీవంగా తీర్మానించింది. అలాగే ఏపీ చేపట్టే పోలవరం-బనకచర్ల,పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్ట్‌లకు కేంద్రం అనుమతులు ఇవ్వవద్దంటూ తీర్మానం చేసింది. వీటిని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నఉట్ల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.

## వెనిజులా ఆపరేషన్ స్వయంగా వీక్షించా!

### అమెరికా సైనికుల ఆపరేషన్ అమోఘం: అధ్యక్షుడు ట్రంప్ కితాబు

**వాషింగ్టన్, జనవరి 3:** వెనెజులాలో అమెరికా సైన్యం సంచలన సైనిక చర్య చేపట్టింది. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకుంది. ఈ ఆపరేషన్‌ను తాను మార్‌ఎలాగో విడిది నుంచి ప్రత్యక్షంగా వీక్షించానని, ఇది వేగంగా, కచ్చితత్వంతో పూర్తి చేసిన ఒక అద్భుతమైన మిషన్ అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. ఆపరేషన్ జరిగిన కొద్ది గంటల తర్వాత ఫాక్స్ ఫ్రెండ్స్ వీకెండ్ కార్యక్రమంతో మాట్లాడు తూ ఆయన ఈ వివరాలు వెల్లడించారు. అమెరికా సైనికులు చేసిన పని అమోఘం. సెకన్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలగొట్టడం నేను ఎప్పుడూ చూడలేదని ట్రంప్ తెలిపారు. ఈ ఆపరేషన్‌లో అమెరికా సైనికులు ఎవరూ చనిపోలేదని, అయితే ఒక హెలికాప్టర్‌పై దాడి జరగడంతో కొందరు గాయపడి ఉండవచ్చని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. మదురో దంపతులను హెలికాప్టర్‌లో కరేబియన్‌లోని యూఎస్ఎస్ ఇవో జిమా యుద్ధనౌకకు, అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలిస్తున్నట్లు ఆయన ధృవీకరించారు. మాదకద్రవ్యాల సంబంధిత నేరాలతో సహా పలు తీవ్రమైన ఆరోప ణలపై మదురో దంపతులపై న్యూయార్క్‌లో ఇప్పటికే అభియోగాలు నమోదయ్యాయని అటార్నీ జనరల్ పామ్ బాండీ స్పష్టం చేశారు.



## అరుదైన గుండె రిథమ్‌కు నిమ్స్‌లో చికిత్స

### త్రీడి మ్యాపింగ్‌తో ఇద్దరు రోగులకు విజయవంతమైన ఆర్ఎఫ్ఎ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జనవరి 3, ప్రభాతవార్త:** తీవ్రమైన గుండె రిథమ్ లోపాలతో ప్రాణాపాయం ఎదుర్కొంటున్న ఇద్దరు యువ రోగులకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) వైద్యులు కొత్త జీవితం అందించారు. దాదాపు ప్రతి రెండో గుండెదడ అసాధారణంగా మారిన వెంట్రిక్యులర్ ప్రీమేచ్యూర్ కాంట్రాక్షన్స్ (వీపీసీస్) సమస్యను అత్యాధునిక త్రీడీ ఎలక్ట్రో-అనాటమికల్ మ్యాపింగ్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ (ఆర్ఎఫ్ఏ) సాయంతో పూర్తిగా నివారించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం నిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం లో విజయవంతంగా చికిత్స నిర్వహించిన వైద్య బృందం వెల్లడించింది. ఈ ఇద్దరు రోగుల్లో 40-50 శాతం వరకు గుండె దడలు లోపభూయిష్టంగా ఉండటంతో గుండె క్రమంగా బలహీనపడిందని, దీర్ఘకాలంపాటు ఇలా కొనసాగితే గుండె కండరాలు దెబ్బతిని, వీపీసీ(ఇండ్యూస్డ్ కార్డియోమయోపతి)గా మారుతుందన్నారు. ఒక కేసులో ఐదేళ్లుగా వీపీసీలతో బాధపడుతున్న 31 ఏళ్ల యువతికి గుండె పనితీరు తీవ్రంగా తగ్గిందని, గర్భధారణ సమయంలో ఈ సమస్య ప్రాణాంతకంగా మారడంతో గర్భస్రావం చేయాల్సి వచ్చిందన్నారు. అనంతరం శాశ్వత చికిత్స కోసం ఆమె నిమ్స్‌ను ఆశ్రయించారన్నారు. మరోవైపు, ఆరు నెలలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతున్న 20 ఏళ్ల యువకుడికి కూడా తీవ్రమైన గుండె బలహీనతతో పాటు 40 శాతం వీపీసీ సమస్య ఉన్నట్లు నిర్ధారణైంది. అత్యాధునిక త్రీడి మ్యాపింగ్ ద్వారా గుండెలో లోపభూయిష్ట ప్రాంతాన్ని ఖచ్చితంగా గుర్తించారు. ఒక రోగిలో సమస్య రైట్ వెంట్రిక్యులర్ అవుట్‌ఫ్లో ట్రాక్ట్లో ఉండగా, మరొక రోగిలో లెఫ్ట్ కరోనా కస్ప్ వద్ద, అత్యంత కీలకమైన లెఫ్ట్ మెయిన్ కరోనా ఆర్టరీకు అతి సమీపంలో ఉన్నట్లు తేలిందన్నారు. ఈ ప్రాంతంలో అబ్లేషన్ చేయడం అత్యంత సున్నితమైన ప్రక్రియ అయినప్పటికీ, ఇక్కడ అందించిన చికిత్సతో అది విజయవంతమైం దన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ కార్డియాలజీ డా. ఓ సాయి సతీష్ నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఈ చికిత్స అనంతరం, హోల్టర్ పరీక్షల్లో వీపీసీ భారం పూర్తిగా తగ్గిందన్నారు. త్రీడీ ఎకో పరీక్షల్లో గుండె పనితీరు గణనీయంగా మెరుగుపడిందన్నారు. ప్రస్తుతం ఇద్దరు రోగులూ లక్షణాల నుంచి పూర్తిగా ఉపశమనం పొందారన్నారు. ఈ చికిత్సలు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా అందించినట్లు వివరించారు.

## వెండి, పసిడి మార్కెట్లలో అదే దూకుడు



**2026లో కూడా బంగారం తులం రూ.1.50 నుంచి 1.75 లక్షల వరకూ**

**వెండి కిలో ఒక్కొంటికి రూ.3 లక్షల వరకూ వెళ్లే అంచనా**

**న్యూఢిల్లీ,** జనవరి 3: బులియన్ మార్కెట్‌లో గత ఏడాది కొనసాగిన ర్యాలీ 2026 కేలండర్‌సంవత్సరంలో కూడా కొనసాగుతుందని బులియన్‌రంగ నిపుణులు అంచనావేస్తున్నారు. పసిడి, వెండి రెండూ కూడా దేశీయంగాను, గ్లోబల్ మార్కెట్‌లోనూ ర్యాలీతీసాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతతో పెట్టుబడులన్నీ బులియన్‌రంగం వైపు మళ్లడంతో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. పసిడి 2025లో 80శాతం పెరుగుదల నమోదుచేసింది. రూ.71,500 నుంచి రూ.1.39 లక్షలవరకూ పెరిగింది. వెండిధరలు కూడా అదేస్థాయిలో పెరిగింది. కిలో వెండి 90,500 నుంచి రూ.2,32 లక్షలవరకూ గత ఏడాది ఎగబాకింది. భౌగోళిక ఉద్రిక్తతలతో ఈక్విటీ సూచీల్లో హెచ్చుతగ్గులు, ఒడిదొడుకులు నమోదుకావడంతో ఇన్వెస్టర్లు మొత్తం వెండి బంగారు మార్కెట్లపైకి పెట్టుబడులు కుమ్మరించారు. డాలర్‌కరెన్సీ ట్రేడింగ్‌కావడంతో అంతరాజతీయంగా కొనుగోలుదారులకు ఎంతో చీప్‌గా కనిపిస్తుండటం కూడా ఒక కీలకం. ఇక విద్యుత్ వాహనాలు, 5జి, సోలార్ ప్యానెళ్లలో వెండి వినియోగం భారీగాపెరిగింది. దీనితో భారీ ఎత్తున సరఫరా కొరత నెలకొనడంతో దరలు ఒక్కసారిగాపెరిగాయి. దీనికితోడు 2026లోకూడా ఫెడ్‌రిజర్వు వడీరేట్లను సవరిస్తుందని అంచనాలు భారీగా ఉన్నాయి. దీనితో బంగారం వెండిధరలు మరింతగా పెరుగుతాయని అంచనా. స్థిరమైన రాబడులకు ఇపుడు వెండి, బంగారం మార్కెట్లే ఇన్వెస్టర్లకు కనిపిస్తున్నాయి. ప్రపంచ పసిడిమండలి, గోల్డ్‌మానశాక్స్ వంటివి 2026లో కూడా ఈ రెండు విలువైన ఖణిజాలు 20 నుంచి 30శాతంపెరుగుతాయని అంచనావేసాయి. బంగారందరలు రూ.1.50 లక్షలనుంచి రూ.1.75 లక్షలవరకూ చేరుతుందని, వెండిధరలు కూడా కిలో ఒక్కొంటికి రూ.3 లక్షలవరకూ చేరుకునే ఛాన్స్ ఉందని చెపుతున్నాయి.


## కార్పొరేట్ రాబడులు రూపీ చెలామణిలే కీలకం!

### ఈవారం మార్కెట్లతీరుపై అంచనాలు

**న్యూఢిల్లీ, జనవరి 3:** దేశీయంగా స్థూల ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా కనిపించడంతో పాటు వివిధ విభాగాల్లో ర్యాలీలు వంటివి 2026లో కూడా కొనసాగవచ్చని నిపుణులు అంచనా. ఆటో, మెటల్స్‌రంగాల్లో ఈవారం భారీ మద్దతు లభించగా వచ్చే వారం కూడా కార్పొరేట్ త్రైమాసిక పలితాలు కీలకం అవుతాయి. ఇక డాలర్‌తోరూపాయి చెలామణి కూడా మూలధన వనరుల రాకకకు కీలకంగా మారుతుంది. 89.97 వద్ద చెలామణి జరిగిన సంగతి తెలిసిందే. ఇక హెచ్ఎస్‌బిసి సేవలరంగ పిఎంఐ డిసెంబరులో 59.1 పాయింట్లకుపడిపోయింది. అంతకుముందున వంబరులో 59.8 పాయింట్లువరకూ ఉంది. అయితేసేవలరంగ కార్యకలాపాలుజనవరినుంచి ఊపందుకుంటాయని అందువల్లవచ్చేవారం మరింత మెరుగవుతుందని అంచనాలున్నాయి. ఉత్పత్తి,సేవలరంగంలో కూడా సానుకూల వృద్ధి ఈక్విటీ మార్కెట్లకు లాభం కలిగిస్తుందనిన ఇపుణుల అంచనా. ఇక ఏడో తేదీ బుధవారం ఎం3 మనీ రఫరా గణాంకాలు విడుదలవుతాయి. డిసెంబరు 26తేదీనే ఈ డేటా విడుదలయింది. మనీ సప్లయి ఎం3 భారత్‌లో రూ.2,91,363.75 బిలియన్‌లకు పెరిగింది. అదే నవంబరులో




అయితే రూ,2,89,454.93 బిలియన్ రూపాయలుగా ఉంది. ఇక 9వ తేదీ బానయంకురుణాల్లోప్రగతి నివేదికలు ప్రకటిస్తారు. వార్షిక ప్రాతిపదికన గత ఏడాది డిసెంబరునాటి రుణాలవద్ధి 11.5శాతంగా ఉంది. అదేరోజు డిపాజిట్ల వృద్ధిగణాంకాలు కూడా విడుదలవుతాయి. భారత్‌లో బ్యాంకింగ్ డిపాజిట్లు 10.2శాతం పెరిగినట్లు ఇప్పటికే ఆర్బీఐ ప్రకటించింది. ఇక విదేశీ కరెన్సీ రిజర్వులు కూడా కీలకం అవుతాయి. భారత విదేశ ఈకరెన్సీ ఖజానా 696.61 బిలియన్ డాలర్లకుపెరిగింది. పసిడి నిల్వలుకూడా 2.956 బిలియన్ డాలర్లుపెరిగి మొత్తం 113.32 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక అమెరికా ఉత్పత్తిరంగ పిఎంఐ సూచీ గణాంకాలు సోమవారం విడుదలవుతాయి. నవంబరులో 48.2 పాయింట్లకు తగ్గిన సూచీ పెరుగుతుందన్న అంచనాలున్నాయి.అలాగే జనవరి9వ తేదీ అమెరికా వ్యవసాయేతరరంగ గణాంకాలు కూడా విడుదల చేస్తుంది. అమెరికా ఉపాధిగణాంకాలపరంగా 64 వేలు నవంబరులో పెరిగాయి. అయితే అమెరికా నిరుద్యోగతి రేటు 4.6శాతానికి పెరిగింది. అలాగే ముడిచమురుధరలు, పసిడి గ్లోబల్ ఫ్యూచర్స్ సెటిల్‌మెంట్లు కూడా ఈ వారం మార్కెట్లను ప్రభావితంచేస్తాయని అంచనా.



## 5% రూపాయి పతనం!

### పరిస్థితిలో మార్పు వస్తుందంటున్న ఎస్‌బిఐ ఫండ్స్!

**న్యూఢిల్లీ, జనవరి 3:** భారత రూపాయి 2025 ఏడాది మొత్తంగా ఐదుశాతం పతనం చెందింది. రెండేళ్లక్రితం చూపించిన వార్షిక పనితీరుతో సమానంగా పతనం చెందినట్లు తెలుస్తోంది. అయితే కొత్త సంవత్సరంలో డాలర్ రూపాయి చెలామణిలో కొంత మార్పులు రావచ్చని ఎస్‌బిఐ అంచనావేసింది. కొన్ని గ్లోబల్ కరెన్సీలతో పోలిస్తే డాలర్ కొంత క్షీణించిందని, ఇతర గ్లోబల్‌కరెన్సీలు కొంతమేరలబ్ధి పొందినా రూపాయి మాత్రం ట్రేడింగ్ అంతంతమాత్రంగానే జరిగింది. ఎస్‌బిఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ అంచనాల ప్రకారంచూస్తే కరెన్సీ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ పెట్టుబడులు మందగించడం ప్రధాన కారణంగాచూస్తోంది. ఎగుమతుల స్థాయి కూడా ఎక్కువ ఉన్నప్పటికీ చెల్లింపులకు డాలర్ ప్రామాణికం కావడంతో డాలర్‌కు డిమాండ్‌పెరిగింది. భారత్ ఈక్విటీలనుంచి విదేశీ ఇన్వెస్టర్లు సుమారు 18 బిలియన్ డాలర్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. కార్పొరేట్ రాబడులు తగ్గుతాయన్న అంచనాలే ఇందుకు మూలం. ఎఐ ఆధారిత అంతర్జాతీయ వృద్ధి, వర్ధమాన మార్కెట్లకు మంచి అవకాశాలు కనిపించడంతో పెట్టుబడులు దారిమళ్లాయి. ఈపరిస్థితులమధ్య ఎస్‌బిఐ రూపాయి వచ్చే ఆర్థికసంవత్సరంలోకూడా రెండుశాతం వరకూ క్షీణించవచ్చని అంచనావేసింది. డాలర్‌తో రూపాయి చెలామణి 92 రూపాయల చుట్టూనే తిరుగుతుందని కూడా స్పష్టంచేసింది. భారత్ కరెంటుఖాతాలోటు జిడిపిలో ఒకటిశాతంగానే ఉంది. సేవలరంగ ఎగుమతులు, ముడిచమురుదరలు తగ్గడం, ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ 4శాతం అంచనాలకు అనుగుణంగానే కొనసాగడంతో కొంత తీరు మారుతుందని చెపుతున్నారు. అలాగే ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను సడలిస్తుందన్న అంచనాలున్నాయి. వీటికి అదనంగా మూలధననిధులు ప్రవాహం కూడా పెరగవచ్చన్న అంచనాలున్నాయి. ప్రభుత్వ బాండ్లను గ్లోబల్ మార్కెట్లలో లిస్టింగ్‌చేయడం, కార్పొరేట్ రాబడుల్లో స్థిరత్వం, విదేశీ పోర్టుఫోలియో ఈక్విటీ పెట్టుబడులు మరింతగా రావడం వంటి అంచనాలతో రూపాయిపై ఒత్తిడి తగ్గుతుందని చెపుతున్నారు.

## ఐదు రాష్ట్రాలకు రూ.26.62 లక్షలకోట్ల పెట్టుబడులు!



**న్యూఢిల్లీ, జనవరి 3:** భారత్‌లో పెట్టుబడుల రాక గణనీయంగా పెరుగుతోంది. గత ఏడాది ఏప్రిల్‌నుంచి డిసెంబరు నెలలమధ్యకాలంలో రూ.26.62 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. ప్రభుత్వం మూలధన వ్యయం పెంచడం, పన్నులరంగంలో సంస్కరణలు, మౌలికవనరులపై ఫోకస్ పెంచడం, పునరుత్పత్తి విద్యుత్, మెటల్స్ రంగాల్లో పెట్టుబడులు ఎక్కువ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలు ఈ పెట్టుబడుల్లో అగ్రగామిగా నిలిచాయి. గత ఏడాదికంటే ఈసారి మరింతగా పెట్టుబడులు రావడానికి కారణం పటిష్టమైన మూలధన వ్యయం కేటాయింపులు పెరగడమే. గత ఏడాది తొమ్మిదినెలల్లో 23.88 లక్షలకోట్లు వస్తే ఈ ఏడాది తొమ్మిదినెలల్లో 26.62 లక్షలకోట్లు వచ్చినట్లు ప్రభుత్వ డేటా స్పష్టంచేస్తోంది. విద్యుత్ పునరుత్పత్తి 22.6శాతం, రసాయనాలు 21.8శాతం, మెటల్స్ 17.3శాతం, కన్స్యూమర్ రంగంలో మూడుశాతం కంటే తక్కువ పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. మొత్తం పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్‌కు 25.3శాతం, ఒడిశాకు 13.1శాతం, మహారాష్ట్రకు 12.8శాతం, తెలంగాణకు 9.5శాతం, గుజరాత్‌కు 7.1శాతం పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. పెట్టుబడుల పరంగా మౌలికవనరుల రంగంలో కేటాయింపులు పెంచడం, పన్నులరంగంలో సంస్కరణలు ప్రత్యేకించి జిఎస్టీ 2.0, వడ్డీరేట్లు సరళీకరించడం వంటివి మూల కారణాలుగా తెలుస్తోంది. కీలక పరిశ్రమల రంగంలో పెట్టుబడులు పెరగడంతోపాటు హరిత ఇంధనంవైపు భారత్ ఫోకస్ పెంచడంతోపెట్టుబడులు కూడా పెరిగినట్లు స్పష్టం అవుతోంది.



## గ్లోబల్ ఇవి సేల్స్ లీడర్‌గా 'బివైడి'!

**న్యూఢిల్లీ, జనవరి 3:** బిలియనీర్ ఎలాన్ మస్క్ మానసపుత్రిక టెస్లా అమ్మకాల్లో వెనకబడింది. చైనా తయారీ బివైడి విద్యుత్ కార్లు 2025లో నంబర్‌వన్ ఈవీ సెల్లర్‌గా నిలిచింది. వార్షికపద్ధతిలో వాహణ డెలివరీల్లో మున్నెన్నడూ లేనివిధంగా టెస్లా వెనుకబడింది. అదే సమయంలో చైనా తయారీ బివైడి పటిష్టమైన వృద్ధిని నమోదుచేసింది. చైనా ఉత్పత్తి సంస్థ గ్లోబల్ ఈవిమార్కెట్ లీడర్‌గా నిలిచింది. టెస్లా గత ఏడాది 1.63 మిలియన్ల వాహనాలు డెలివరీచేసింది. వార్షిక వృద్ధి 8.6%గా ఉంది. కంపెనీ వార్షిక ఉత్పత్తి మాత్రం 6.7శాతం క్షీణించి 1.73 మిలియన్‌యూనట్లకు పడిపోయింది. బివైడి, హుండై కంపెనీలనుంచి ఒత్తిడిని ఎదుర్కొనడమే కారణంగా కనిపిస్తోంది. బివైడి 2025లో 4.6 మిలియన్ యూనిట్లు డెలివరీచేసింది. అంతకుముందు ఏడాదికంటే 7.7శాతం వృద్ధిని నమోదుచేసింది. ఈ మొత్తంలో కేవలం విద్యుత్ వాహనాల వినరకయాలు 28శాతానికిపెరిగి 2.25 మిలియన్ యూనిట్లకు చేరింది. ఉత్పత్తి సామర్థ్యం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ రీసెర్చి డెవలప్‌మెంట్ విభాగంలో భారీ పెట్టుబడులు పెడుతోంది. కీలక టెక్నాలజీలన్నింటిని అందిపుచ్చుకుంటున్నది. చైనా ఉత్పత్తిరంగ బేస్, మౌలికవనరులు, పాలసీ విధానాలను బివైడి తనకు అనుకూలంగా మార్చుకుందని నిపుణుల అంచనా. చైనా కేంద్రంగా ఉన్న గిగాఫ్యాక్టరీ డెలివరీ టార్గెట్లను భర్తీచేయగలదన్న అంచనాలున్నాయి. పారిశ్రామికసరఫరా కూడా పెరుగుతోంది.చైనా ఇండస్ట్రియల్ సరఫరా నెట్‌వర్క్‌ను మరింత పటిష్టంచేసుకుంటున్నది. గ్లోబల్ డెలివరీల్లోకూడా నిర్ణీత వ్యవదిలోపే డెలివరీలు అందించేవిధంగా బివైడి ప్రణాళికలు అమలుచేస్తుండటంతో గ్లోబల్ లీడర్‌గా నిలిచింది.

# గ్యాస్ సమస్యల్ని తగ్గిస్తాయి !

మహిళల్లో వివిధ దశల్లో ఏర్పడే హార్మోన్ల అసమతౌల్యత, గ్యాస్ సమస్యల్ని తగ్గించుకోవడానికి ఆహారమూ కొంతమేర సాయపడుతుంది. అదెలాగంటే.. ప్రొటీన్, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి, ముఖ్యంగా పాలకూర, ముల్లంగి ఆకు, యాపిల్, దోస, బొప్పాయిల్లో ఎక్కువగా పీచు ఉంటుంది. వీటిల్లోని ఫైబర్ జీర్ణ సమస్యల్ని తగ్గిస్తుంది. ఇందులోని పోషకాలు హార్మోన్ల పనితీరునీ క్రమబద్ధీకరిస్తాయి. సంప్రదాయ ఆహారంగా, సుగంధ ద్రవ్యాల్లో ఒకటిగా పిలిచే జీల కర్రకు జీర్ణ వ్యవస్థ పనితీరుని మెరుగుపరి చేశక్తి ఎక్కువట. ఇందులోని ఐరన్ రక్తహీనత సమస్య ను రానివ్వదు. జీలకర్ర లో ప్లాంట్ బేస్డ్ కాంపౌండ్స్ అధికం. ముఖ్యంగా ఫైటో ఈస్ట్రోజన్లు... మహిళల్లో మెనోపాజ్ దశలో కనిపించే మూడ్ స్వింగ్స్, వేడి ఆవిర్లను తగ్గిస్తాయి. హార్మోన్ల అసమతౌల్యతను సక్రమంగా చేసే సహజ మూలికగా అల్లానికి పేరు. ఇందులోని జింజిరోల్స్ జీర్ణశక్తిని మెరుగు పరిచి హార్మోన్ల పనితీరుని బాగు చేస్తాయి. ▫

## యాపిల్ డిలైట్

**కావలసినవి:** మైదా అర కప్పు, మిల్క్ మెయిడ్ 200 గ్రాములు, చిక్కటి పాలు ముప్పావు కప్పు, యాపిల్స్ 3, బాదం, జీడిపప్పు పలుకులు కప్పు, బటర్ 50 గ్రా, దాల్చినచెక్క పొడి అర చెంచా, బేకింగ్ పౌడర్ చెంచా టాపింగ్ కోసం: మైదా, బటర్, పంచదార పొడి 2 టేబుల్స్పూన్ల చొప్పున **తయారీ:** యాపిల్ పండ్ల చెక్కు, విత్తనాలు తీసి ముక్కలుగా కోసుకోవాలి. మిక్సింగ్ బౌల్లో మైదా, మిల్క్ మెయిడ్, పాలు, బటర్, బేకింగ్ పౌడర్, దాల్చినచెక్క పొడి, యాపిల్ ముక్కలు, బాదం, జీడిపప్పు పలుకులు వేసి కలపాలి. బేకింగ్ డిష్లో వెన్న రాసి.. యాపిల్ మిశ్రమాన్ని సమంగా సర్దాలి. ఒక ప్లేటులో పంచదార పొడి, బటర్, మైదాలను కలిపి.. యాపిల్ మిశ్రమం పైన చల్లాలి.



అవెన్లో 180 డిగ్రీ వద్ద ప్రీహీట్ చేసి.. అరగంట బేక్ చేయాలి. అంతే.. బంగారు రంగులో నోరూరించే యాపిల్ డిలైట్ సిద్ధం.

# హస్త కళలకు కొత్త ఊపిరి



**ఏ ప్రాంతమైనా తీసుకోండి.. మన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చే కొన్ని సంప్రదాయాలు, కళలు ఉంటాయి. తరవాతి తరాలు వాటిని కొనసాగిస్తే అవి బతుకుతాయి. లేదంటే కనుమరుగవుతాయి. తన బామ్మ నుంచి నేర్చుకున్న కళ అలా అంతరించి పోవద్దు అనుకున్నారు రీతా! ఆమె ప్రయత్నం విదేశీయులను ఆకర్షించ డమే కాదు.. వందలమందికి ఉపాధినీ కల్పిస్తోంది.**

రీతా ఆదివాసి మహిళ. ఈమెది ఉద్ధమ్ నగర్. తరవాత వారణాసిలో స్థిరపడ్డారు. అప్పట్నుంచీ ఆమె ప్రయత్నం ఒక్కటే తన హస్త కళను బతికించుకోవడం! ఈమె 'ముంజ్' అనే క్రాఫ్ట్‌ను సాధన చేసేవారు. ఇది తన పూర్వికుల కళ. రీతా తన అమ్మమ్మ, నానమ్మల నుంచి దీన్ని నేర్చుకున్నారు. ఈ కళ దాదాపు అంతరించిపోయే దశకు చేరుకుందట. తనూ వదిలేస్తే తరవతి తారలకు అంద దన్న ఉద్దేశంతో కొనసాగిస్తూ వచ్చారు. ముంజ్ అనే ఒక గడ్డిని అల్లుతూ బుట్టలు, బొమ్మలు, గృహాలంకరణ వస్తువులు చేస్తారు. 'ఇది ఉత్తరాది రాష్ట్రాల్లో నదీ ప్రాంతాల్లో మాత్రమే దొరికే గడ్డి రకం. పర్యావరణహితం ఎక్కువ కాలంపాటు మన్నుతాయి. మా తెగల వేడుకలు, పండుగ లేవైనా ఈ గడ్డితో చేసిన వస్తువు లు ఉండాల్సిందే. వీటిని శుభప్రదంగానూ భావిం చాం. కాబట్టే పూజ వస్తువులను ఈ గడ్డితో చేసిన బుట్టల్లో పెట్టుకుని మరీ తీసుకెళతాం. వీటి తయారీకి నదుల వద్దకు వెళ్లి ఈ గడ్డిని సేకరిస్తాం. శుభ్రపరిచి ఒక్కొక్కటిగా విడదీసి ఎండ బెడతాం. ఈ క్రమంలో పాడవకుండానూ, కుళ్లిపోకుం డానూ చూసుకోవాలి. ఒక్కో వస్తువు తయారవడానికి 23 రోజులు పడుతుంది అంటారు రీతా. తొలిరోజుల్లో ఈమె ఒక్కరే. క్రమంగా మరికొందరిని చేర్చుకుని నేర్పించి, ఉపాది కల్పించడం మొదలు పెట్టారామె. ప్రభుత్వం, ఎన్జిఒలు సాయంగా నిలవడంతో వీటి ఉత్పత్తులకు మార్కెటింగ్ ఏర్పడింది. దీంతో వీళ్లూ ఆధునికతను అందిపుచ్చుకున్నారు. గృహాలంకరణ వస్తువులు, పిల్లల ఆట వస్తు వులు, ఆభరణాలు, పెన్ హోల్డర్లు.. ఇలా ఎన్నింటినో తీసుకొచ్చారు. గత ఏడాది ఈ మహిళలు ప్రధాని మోదీని కలిసినప్పుడు వీరికి అండగా ఉంటామని మాటనిచ్చారట. దీంతో ఎక్కడ ఎగ్జిబిషన్లు జరిగినా వీరికి స్టాల్స్ పెట్టుకునే అవకాశం కల్పిస్తు న్నారు. ఫలితంగా 500 మంది మహిళలు ఉపాధి పొందు తుండటమే



కాదు .. నెలకు రూ.15-20 వేలు సంపాదించుకోగలుగు తున్నారు. అంతే కాదు, వీరి ఉత్పత్తులకు విదేశాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. జర్మనీలో వీటికి ఎక్కువ గిరాకీ ఉందట. ఒకప్పుడు డబ్బులు అవసరమైతే ఇంట్లో మగవాళ్లనీ అడిగేవాళ్లం. ఇప్పుడు మా కాళ్ల మీద నిలు బడుతున్నాం. ఇంటి స్థితిగతులనీ మార్చుకు న్నాం అంటారీ మహిళలు. వార సత్వ కళని ముందుకు తీసుకెళ్లడమే కాదు.. వాటితో తమ జీవితాల్నీ మార్చుకుంటున్న రీతానీ ఆమె బృందాన్నీ అభినందించాల్సిందే కదూ! ▫

# తిరుప్పావై

## 20వ పాశురము



ముప్పత్తుమూవర్
అమరర్కుమున్ శెన్ఱ,
కప్పమ్ తవిర్కుమ్ కలియే!
తుయిలెళాయ్,
శెప్పముడై యాయ్ ! తిఱలుడై
యాయ్! శెత్తార్కు
వెప్పం కొడుక్కుమ్ విమలా !
తుయిలెళాయ్
శెప్పన్న మెన్ములైచ్చెవ్వాయ్ చ్చిఱు
మరుఙ్గుల్
నప్పిన్నై నఙ్గాయ్! తిరువే !
తుయిలెళాయ్
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్
మణాళనై
ఇప్పోతే యెమ్మై నీరాట్టేలో
రెమ్బవాయ్ .

ముప్పది మూడుకోట్ల దేవతలకు ఆపద వచ్చు నేమో యని, వారి భయమును పోగొట్టుటకై శత్రువులను భయపెట్టువాడు, మనోవాక్కాయ కర్మలచేత ఆశ్రితశత్రు వులకు భయజ్వరము కలిగించువాడు. బలముగల వాడు అయిన ఓ కృష్ణా మేల్కొనుము". "బంగారు చెండులవంటి మరియు సుకుమార మైన స్థానసౌందర్యముకల ఎర్రని పెదవులు సన్నని నడుము కల లక్ష్మీ సమసంపన్నురాలా ! నీలా ! నిద్ర మేల్కొని నడిచిరావమ్మా ! విసనకర్ర మీద అద్దము ఇవ్వవమ్మా ! నీ వల్లభుని మాతో స్నానమాడుటకు ఒప్పించవమ్మా ! " అని వెలుపలికి వెళ్ళు

ఫలం: "అన్యోన్య దాంపత్యం"

# పండుగ తీపి రుచులు

ఏ ప్రత్యేక సందర్భం వచ్చినా ఏవేవో వంటలు చేస్తుంటాం. మళ్లీ పండుగ వరకు గుర్తిండిపోవాలి. ఆత్మీయులతో కబుర్లు చెబుతూ పసందైన మిఠాయిలు తింటుంటే.. అంతకంటే మజా ఏముంటుంది? అందుకే మీ కోసం ఈ స్పెషల్ రెసిపీలు.

## సోహాల్ హల్వా



**కావలసినవి** గోధుమపిండి, పురా, మిల్క్ పౌగర్ 4 టేబుల్స్పూన్ల చొప్పున, పంచదార కప్పున్నర. నెయ్యి కప్పు, పిస్తా బాదం, జీడిపప్పు పలుకులు కప్పు **తయారీ** ఒక పాత్రలో గోధను పిండి, మైనా, మిను కలపాలి. ఫ్యాన్లో నెయ్యి, పంచదార . గోధుమపిండి, మైదా, మిల్క్ పౌడర్ల మిశ్రమం చేసి కలియ తిప్పుతూ రెండు నిమిషాల తర్వాత దించాలి. చిన్న బౌల్స్ నెయ్యి రాసి, డ్రైఫ్రూట్స్ పలుకులు వేయాలి. వాటి మీద హల్వా వేసి సమంగా సర్దాలి. అంతే.. రుచికరమైన మిఠాయిని ఆస్వాదించండి.

## ధార్వాడ్ పేడా



**కావలసినవి:** తరిగిన పనీర్ 2 కప్పులు, ఖోయా కప్పు, పంచదార ఒక కప్పు 2 టేబు ల్స్పూన్లు, నెయ్యి 2 చెంచాలు, పాలు 6 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి పావుచెంచా **తయారీ:** కడాయిలో స్పూన్ నెయ్యి వేడిచేసి పన్నీరు లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించాలి. అందులో పంచదార, 2 టేబుల్ స్పూన్ల పాలు జతచేసి కలుపుతుండాలి. పనీర్ క్రిస్పీ అయ్యాక దించాలి. చల్లారాక 2 టేబుల్స్పూన్ల పాలు జతచేసి గ్రైండ్ చేయాలి. ప్యాన్లో నెయ్యి, మిగిలిన పాలు, యాలకుల పొడి కూడా వేసి కలపాలి. మిశ్రమంలో తడి ఇంకిపోయి కడాయి అంచులకు అంటుకోకుండా విడిపోతున్నప్పుడుసెగ తీయాలి. మిశ్రమం కాస్త చల్లారాక.. పేడా చేసుకుని పంచదారలో ముంచి తీస్తే.. తియ్యటి ఖిధార్వాడ్ పేడఖి రెడీ. కర్నాటక వారి ఈ స్వీటు 175 ఏళ్ల చరిత్ర ఉంది.



## రాజ్ భోగ్

**కావలసినవి:** పాలు లీటర్, పంచదార కప్పున్నర, యాలకుల పొడి అర చెంచా, కుంకుమపువ్వు కొద్దిగా, నిమ్మరసం చెంచా, రోజ్ వాటర్ కొన్ని చుక్కలు, గుల్కంద్ చెంచా, బాదం, పిస్తా పలుకులు చారెడు**తయారీ:** మరుగుతున్న పాలలో నిమ్మరసం వేయాలి. విరిగిన పాలను వడకట్టాలి. అందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి వడకడితే పులుపు వాసన పోతుంది. ఈ పన్నీరు పావుగంట పక్కనుంచాలి. ఈలోగా పంచదారలో యాలకుల పొడి, కుంకుమపువ్వు, 4 కప్పుల నీళ్లు పోసి మరిగించాలి. ఇప్పుడు పన్నీర్ ను నాలుగైదు నిమిషాలు చపాతీపిండిలా కలపాలి. బాదం, పిస్తా పలుకుల్లో గుల్కంద్, రోజ్వాటర్, కొంచెం పంచదార సిరప్ కలిపి.. చిన్న బాల్స్ చేసుకోవాలి. పనీర్ను చిన్న అప్పల్లా చేయాలి. మధ్యలో డ్రైఫ్రూట్స్ బాల్ ఉంచి గుండ్రంగా కప్పేయాలి. అన్నీ అయ్యాక పంచదార సిరప్ లో వేసి సన్న సెగ మీద పది నిమిషాలు ఉడికించి సెగ తీయాలి. చల్లారాక ఏడెనిమిది గంటలు ఫ్రిజ్లో ఉంచాలి. బయటకు తీసి మిగిలిన బాదం, పిస్తా పలుకులత్తో గార్నిష్ చేస్తే వహ్వా అనిపించే "రాజ్‌భాగ్ రెడీ.

## నెయ్యప్పమ్

**కావలసినవి:** బియ్యప్పిండి కప్పు, మైదా, మొక్క జొన్న పిండి అర కప్పు చొప్పున, బెల్లం పావు కిలో, కొబ్బరి ముక్కలు 2 టేబుల్ స్పూన్లు, నల్ల నువ్వులు, నెయ్యి టేబుల్ స్పూన్ చొప్పున, యాలకుల పొడి అరచంచా, ఉప్పు, బేకింగ్ సోడా చిటికెడు, నూనె వేయించేందుకు సరిపడా **తయారీ:** బెల్లంలో కొన్ని నీళ్లు పోసి మరిగించి ఆ నీటిని వడకట్టాలి. అందులో బియ్యప్పిండి, మైదా, మొక్క జొన్న పిండి, యాలకుల పొడి, ఉప్పు, బేకింగ్ సోడా వేసి మళ్లీ మళ్లీ కలపాలి. కొబ్బరి ముక్కలు, నువ్వులను నేతిలో వేయించి.. వాటిని కూడా పిండిలో కలపాలి. ఈ పిండిని కాగుతున్న నూనెలో గరిటెడు చొప్పున వేసి.. రెండు వైపులా వేయించుకోవాలి. అంతే తియ్యటి 'నెయ్యప్పమ్' తిని ఆనందించడమే తరువాయి. ▫



## రంగవల్లి



- ధనలక్ష్మి
నెల్లూరు

16 చుక్కలు,
2 వరుసలు
2 వరకు
సరి చుక్క



**ముగ్గులకు ఆహ్వానం:**

**మా చిరునామా:** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు

# తెర

## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సాంగ్ లాంచ్



మహాశయులకు విజ్ఞప్తి. ఈ చిత్రంలో రవితేజ సరసన డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. మొదటి రెండు పాటలు ఇప్పటికే అద్భుతమైన స్పందనను పొందాయి. ఇప్పుడు, మేకర్స్ మూడవ ట్రాక్ వామ్మో వాయ్యో ను వరంగల్ లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్ లో లాంచ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో మరోసారి మాస్ ఆడియన్స్ కట్టిపడేసే సాంగ్ కంపోజ్ చేశారు. 'వామ్మో వాయ్యో' ఫుల్ జోష్‌తో సాగే ఫోక్ ట్రాక్‌గా నిలుస్తూ, వినగానే ఎనర్జీని ఇస్తుంది. రవితేజ తన ట్రేడ్‌మార్క్ ఎనర్జిటిక్ డాన్స్ తో మరోసారి అభిమానులను అలరించారు. ఆశికా రంగనాథ్, డింపుల్ హాయతి ఇద్దరూ గ్లామర్‌తో పాటు డ్యాన్స్ సినిమాకు ప్రసాద్ మురెళ్ల సినిమా టోగ్రఫీ అందిస్తుండ గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తు న్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఎఖీ ప్రకాశ్. ఈ సంక్రాంతికి జనవరి 13న వస్తున్న భర్త మహాశయు లకు విజ్ఞప్తిఖి తప్పకుండా చూడాల్సిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ కిషోర్ తిరుమల మాట్లాడుతూ.. హాయ్ వరంగల్. భద్రకాళి అమ్మవారు, రుద్రమదేవి పుట్టిన నేల ఇది. ఇక్కడికి వస్తే చాలా ధైర్యంగా అనిపించింది. భర్త మహాశయులకు విజ్ఞప్తి జనవరి 13న రిలీజ్ అవుతుంది.

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఖచ్చితంగా మీ అందరికీ నచ్చుతుంది: సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ కిషోర్ తిరుమల మాస్ మహారాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వంలో, సుధాకర్ చెరుకూరి ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఖిభర్త

## 'మన శంకర వర ప్రసాద్ గారు' ట్రైలర్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి, హిట్ మెషిన్ అనిల్ రావిపూడి హైలీ యాంటిసిపేటెడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు', విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్, ఆకట్టుకునే ప్రచార కార్యక్రమాలతో భారీ సంచలనం సృష్టిస్తోంది. భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. 'మీసాల పిల్ల' పాట 100 మిలియన్లకు పైగా వ్యూస్ దాటగా, 'శశిరేఖ' పాట దాదాపు 40 మిలియన్ల వ్యూస్ తో ట్రెండింగ్‌లో కొనసాగు తోంది. చిరంజీవి, వెంకటేష్ నటించిన పాట 'సంక్రాంతి అదిరి పోది' ఒక ఫెస్టివల్ సాంగ్ లా మారింది. అనిల్ రావి పూడి ఇప్పటికే ఇది హైవోల్టేజ్ మాస్ ఎలిమెంట్స్‌తో పాటు క్రైమ్ డ్రామా షేడ్స్ కలిగిన ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా ఉండబోతుందని హింట్స్ నేపథ్యంలో ట్రైలర్ కోసం ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. మన శంకర వర ప్రసాద్ గారు సంక్రాంతి పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12, 2026న థియేటర్లలోకి గ్రాండ్‌గా విడుదల కానుంది.

## 'స్కై' లిరికల్ సాంగ్ రిలీజ్,



ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న మూవీ..మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృధ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృధ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. "స్కై" సినిమా ఫిబ్రవరి 6న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'నిను కసిరిన సమయాన...' అనే లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల మంచి లిరిక్స్ రాయగా, వైష్ణవి ఆకట్టుకునేలా పాడారు. శివప్రసాద్ బ్యూటిఫుల్ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'నిను కసిరిన సమయాన' పాట ఎలా ఉందో చూస్తే ఖినిను కసిరిన సమయాన, నను మరచిన నా హృదయం, అడుగడుగున నిను వెతికి, అణువణువున నిను తలచి, ఆలోచనంతా నీ వెనకే, ఆరాధనంతా నీ కొరకే.. అంటూ లవ్ ఫీల్ తో ఆకట్టుకుంటోందీ పాట. "స్కై" సినిమా నుంచి ఇప్పటిదాకా రిలీజ్ చేసిన తపనే తెలుపగ.., పోయేకాలం నీకు.., నిన్ను చూసిన.. సాంగ్స్ ఛాట్ బస్టర్స్ గా మారి మిలియన్ వ్యూస్ రీచ్ అయ్యాయి. ఈ సాంగ్ కూడా మ్యూజిక్ లవర్స్ ఆదరణ పొందుతుందని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా ఉన్నారు.

## 'సఃకుటుంబానాం' సక్సెస్ మీట్



హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా నేడు ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. సఃకుటుంబానాం చిత్ర బృందం సక్సెస్ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నట కిరీటి రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ... "నా తెలుగు ప్రేక్షకులు అందరికీ పేరుపేరునా నమస్కారాలు తెలియచేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను. నేను 48 సంవత్సరాలుగా అందరికీ ఒక కుటుంబ సభ్యుడిలా ఉన్నాను. ఇటువంటి మంచి సినిమాను ఆదరించి సఃకుటుంబానాం చిత్రాన్ని హిట్ చేశారు. కుటుంబం అంటే తెలుగు ప్రేక్షకులు ఆదరించడానికి ముందుంటారు.

## 'గోదారి గట్టుపైన' టీజర్ లాంచ్



గోదారి గట్టుపైన సినిమా టికెట్ కొని థియేటర్లో కూర్చుంటే గోల్డెన్ అవర్ లో గోదారి పడవ ఎక్కినట్టుగా ఉంటుంది. చాలా ఎంజాయ్ చేస్తారు: టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో సుమంత్ ప్రభాస్

మేమ్ ఫేమస్ తో స్ట్రాంగ్ డెబ్యు చేసిన న్యూ ఏజ్ యాక్టర్ సుమంత్ ప్రభాస్ ఖిగోదారి గట్టుపైనఖి సినిమాతో అలరించబోతున్నారు. ఈ చిత్రం రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ కు ఫస్ట్ వెంచర్. లీఖి ప్రొడక్షన్స్ షార్ట్ ఫిల్మ్‌లతో పాపులరైనా సుభాష్ చంద్ర దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిధి ప్రదీప్ కథానాయికగా అరంగేట్రం చేస్తుండగా, జగపతి బాబు, రాజీవ్ కనకాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. గోదారి గట్టుపైన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ ఈరోజు లాంచ్ చేశారు. గోదావరి తీర ప్రాంతం నేపథ్యంగా రూపొందిన ఈ చిత్రం, గ్రామీణ జీవితంలోని ఉత్సాహాన్ని"ఆస్కార్ప్పుప్పు గ్యాంగ్‌గా పాపులరైన ఫ్రెండ్స్ గ్యాంగ్ ద్వారా ఆకట్టుకునేలా చూపించారు. సుమంత్ ప్రభాస్ రాజు పాత్ర సరదా మనస్తత్వం కలిగిన యువకుడిగా కనిపించారు. అతని జీవితంలో మాయ (నిధి ప్రదీప్) రావడంతో మొదలయ్యే ప్రేమకథ జాలీగా, హ్యూమర్, స్నేహం-పండుగ వాతావరణాల మధ్య ఆహ్లాదంగా సాగుతుంది..సుమంత్ ప్రభాస్ సహజంగా రాజు పాత్రలో ఒదిగిపోయాడు. అతని కామిక్ టైమింగ్ ఆకట్టుకుంటుంది. నిధి ప్రదీప్ అందంగా కనిపించింది. సాయి సంతోష్ సినిమాటోగ్రఫీ గోదావరి ప్రాంతాన్ని సహజత్వంతో, కళ్లకు విందుగా చూపిస్తే, నాగ వంశీ కృష్ణ సంగీతం సినిమాకు పర్ఫెక్ట్ లైట్ బ్రీజీ గ్రామీణ వాతావరణాన్ని అందిస్తుంది. సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ.. అందరికి నమస్తే. అందరికీ హ్యాపీ న్యూ ఇయర్. చాలా రోజుల తర్వాత ఈ స్టేజ్ పైకి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా షూటింగ్ కోసం ఫస్ట్ టైం గోదావరి వెళ్ళాను. ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు అర్థమైంది

## తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ 'ది టాస్క్'



డ్రామా, యాక్షన్ థ్రిల్లర్ ఇతివృత్తంతో కన్నడంలో రూపొందిన 'ది టాస్క్' చిత్రం అక్కడ ఘన విజయం సాధించింది. ఇప్పుడు అదే పేరుతో ఈ చిత్రం తెలుగులో రానుంది. జయసూర్య ఆర్.ఆజాద్, సాగర్ రామ్, శ్రీలక్ష్మి, రఘు శివమొగ్గ ప్రధాన పాత్రధారులు. రఘు శివమొగ్గ దర్శకత్వం వహించారు, కన్నడంలో ఇటీవలనే విడుదలై...అక్కడ విశేష ప్రేక్షకాదరణను చూరగొన్న ఈ చిత్రాన్ని ప్రముఖ దర్శకులు ముత్యాల సుబ్బయ్య తనయుడు ముత్యాల అనంత కిశోర్ తెలుగులో విడుదల చేయనున్నారు. గతంలో 'తల్లి మనసు' వంటి చక్కటి ఫ్యామిలీ కథా చిత్రం ద్వారా అభిరుచి గల నిర్మాతగా ముత్యాల అనంత కిశోర్ పేరు తెచ్చుకున్నారు. యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కిన ఈ చిత్రంలో అంతా కొత్త వారు నటించారని, తెలుగు ప్రేక్షకులకు కూడా ఈ చిత్రం ఎంతగానో నచ్చుతుందన్న అభిప్రాయాన్ని ముత్యాల అనంత కిశోర్ వ్యక్తంచేశారు. మిగతా వివరాలను త్వరలో అందజేస్తామని ఆయన తెలిపారు.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్లో

# అమీరా ఉత్కంఠ గెలుపు



**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్‌లో అమీరా అర్షద్ ఉత్కంఠభరితంగా గెలవగా, పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ స్వర్ణం సాధించాడు. మధ్యప్రదేశ్ షూటింగ్ అకాడమీలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఫైనల్‌లో అమీరా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె రైల్వేస్‌కు చెందిన రాజశ్రీ అనిల్‌కుమార్ సాంచెటిని 0.1 పాయింట్ల తేడాతో ఓడించి 251.9 స్కోరుతో ముగించింది. సంచేటి 251.8తో రజతం, ప్రాంజు శ్రీ సోమాని 230.5తో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. తర్వాత న్యూఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ 43 హిట్‌లతో స్వర్ణం సాధించాడు. షాట్‌గన్ రేంజ్‌లో జూనియర్ పురుషుల ట్రాప్ కాంస్య పతక విజేత జుహైర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో 43 హిట్‌లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక శపత్ భరద్వాజ్ 40 హిట్‌లతో రజతం, ఒలింపియన్ కైనన్ చెనాయ్ 33 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించారు. పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో అహ్వార్ రిజ్వి, మొహమ్మద్ అసద్ సుల్తాన్ (118), రయాన్ రిజ్వి (107) సంయుక్తంగా 345 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ మహిళల ఫైనల్లో తిలోత్తమ సేన్ ఫైనల్లో 253.1 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. సమీక్ష సుభాష్ పాటిల్ 250.0 స్కోరుతో రజతం, రమిత 230.0 స్కోరుతో కాంస్యాన్ని సాధించింది. యూత్ ఉమెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో తిలోత్తమ 251.6 పాయింట్లతో తన రెండో స్వర్ణాన్ని సాధించింది.

## టాటా స్టీల్ చెస్‌లో గుకేష్ ఔట్

### అతని స్థానంలో నిహాల్



**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 2026 టాటా స్టీల్ రాపిడ్ మరియు బ్లిట్జ్ టోర్నమెంట్ నుండి ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ వైదొలిగాడు. వ్యక్తిగత కారణాల వల్ల, గుకేష్ ఈ సంవత్సరం టాటా స్టీల్ చెస్ ఇండియాలో పాల్గొవడం లేదు. దీంతో ఈ టోర్నమెంట్‌లో గుకేష్ స్థానంలో కోల్‌కతాలో జరిగిన రాపిడ్ ఈవెంట్ మాజీ విజేత నిహాల్ సరిన్ బరిలోకి దిగనున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ ఛాంపియన్ అయిన ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో జనవరి 7 నుండి 11 తేదీ వరకు కోల్‌కతాలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో విశ్వనాథన్ ఆనంద్‌తో తలపడాల్సి ఉంది. ప్రమోషనల్ ప్రచారాలలో గుకేష్ విస్తృతంగా పాల్గొన్నాడు. అంతేకాకుండా డిసెంబర్ 18న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ టోర్నీలో పాల్గొనేవారి జాబితాలో గుకేష్ పేరు ఉంది. అయితే ఈ సంవత్సరం మొదటి టాప్ ఈవెంట్ అయిన టాటా స్టీల్ రాపిడ్, బ్లిడ్జ్ టోర్నీ ఏడవ ఎడిషన్‌లో ఆడటం లేదని తాజాగా వెల్లడైంది. గుకేష్ స్థానంలో నిహాల్ సరిన్ ఎంపికయ్యాడు. కాగా ఈ ఏడాది ప్రధాన ఆకర్షణగా ప్రముఖ సీనియర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాడు. ఈ నేపథ్యంలో గుకేష్ టోర్నీ నుండి వైదొలగడానికి అధికారికంగా ఎటువంటి కారణం పేర్కొనబడనప్పటికీ, డిసెంబర్ 30న దోహాలో ముగిసిన వరల్డ్ రాపిడ్, బ్లిట్జ్‌లో టోర్నీలో ఆనంద్ చేతిలో గుకేష్ ఓటమిపాలయ్యాడు. ఈ సంవత్సరం మొట్టమొదటి ఎలైట్ క్లాసికల్ టోర్నమెంట్ టాటా స్టీల్ మాస్టర్స్‌లో ఆనంద్ పాల్గొంటుండటంతో దీని నుండి గుకేష్ వైదొలగినట్లు తెలుస్తోంది.





# పాక్‌తో భారత్ ఢీ

### మళ్లీ హై ఓల్టేజ్ మ్యాచ్‌లు

### ఉత్కంఠగా మూడు టోర్నీలు

**న్యూఢిల్లీ:** భారత్,పాక్ మ్యాచ్‌అనగానే మైదానంలో ఇరు దేశాల మధ్య జరిగే యుద్ధంలా భావిస్తారు. ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పాక్ పోరుకు మరింత క్రేజ్ పెరిగింది. ఇరు దేశాలే కాకుండా యావత్ క్రికెట్ ప్రపంచం ఈ దాయాదుల పోరుపై ఆసక్తికనబరుస్తోంది. కొత్త ఏడాదిలోనూ పాకిస్థాన్‌తో భారత్ ఢీ కొట్టనుంది. ఈ దాయాది దేశాల మధ్య మూడు టోర్నమెంట్లలో హై ఓల్టేజ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అండర్ 19 ప్రపంచ కప్‌తో పాటు, పురుషుల, మహిళల టీ20 ప్రపంచ కప్‌లు దాయాదీ మ్యాచ్‌లకు వేదికగా నిలవనున్నాయి. గతేడాది భారత్, పాకిస్థాన్ జట్లు పలుమార్లు తలపడ్డాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఒక సారి తలపడగా, ఆసియా కప్‌లో మూడు సార్లు ఢీకొన్నాయి. మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఒకసారి ఆడగా, అండర్ 19 ఆసియాకప్‌లో రెండు సార్లు తలపడ్డాయి. అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ మినహా ప్రతీ మ్యాచ్‌లోనూ భారత్‌నే విజయం వరించింది. ఇక 2026లో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే అండర్ 19 ఐసీసీ పురుషుల ప్రపంచ కప్‌లోనూ భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి.అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరు జట్లు లీగ్‌దశలో తలపడటం లేదు. తొలిసారి భారత్, పాకిస్థాన్ జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉన్నాయి. భారత్ గ్రూప్ బీలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, యూఎస్ఏతో ఉండగా, పాకిస్థాన్ గ్రూప్ సీలో ఇంగ్లండ్,స్కాట్లాండ్, జింబాబ్వేలు ఉన్నాయి. వేర్వేరు గ్రూప్‌లో ఉన్నందున లీగ్ స్టేజితో పాటు సూపర్6లో తలపడే ఛాన్స్ లేదు. కానీ ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో తలపడే ఛాన్స్ ఉంది.అలాగే ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా శ్రీలంక, కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు తటస్థ వేదికగా మ్యాచ్‌లు ఆడాలనే ముందస్తు ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్ శ్రీలంకలో జరగనుంది. ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేస్తే సెమీఫైనల్, ఫైనల్లో మరోసారి తలపడనున్నాయి. ఇక మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో మాత్రం భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ టోర్నీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జూన్ 14న జరగనుంది. మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో మరోసారి తలపడవచ్చు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదన్న సంగతి తెలిసిందే. కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రమే భారత్, పాకిస్థాన్ జట్లు తలపడుతున్నాయి.

### యూత్ కంటెండర్ టోర్నీలో

### దివ్యాంశి, సిండ్రెలా

# శుభారంభం

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టోర్నీలో భారత యువ ప్లేయర్లు దివ్యాంశి భౌమిక్, సిండ్రెలా దాస్ శుభారంభం చేశారు. ఈ టోర్నీలో బాలికల అండర్ 17 సింగిల్స్ లీగ్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ దివ్యాంశి 11-4, 11-1, 11-2తో నిజా కామత్‌పై అలవోక విజయం సాధించింది. గత ఏడాది ఇదే టోర్నీలో అండర్15 తో పాటు, అండర్17 టైటిళ్లు దక్కించుకున్న దివ్యాంశి ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచింది. ఇందులో భాగంగా ఈ టోర్నమెంట్‌లో వరుసగా మూడు గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది.మరో సింగిల్స్‌లో సిండ్రెలా 11-6, 11-6, 11-2తో తానియా కర్మాకర్‌పై ఘనవిజయంసాధించింది. జపాన్ టీటీ ప్లేయర్ మికు మత్సుషిమా 11-6, 11-3, 11-8తో అన్వి గుప్తాపై గెలిచి నాకౌట్‌లోకి ప్రవేశించింది. ఇక బాలుర అండర్17 విభాగంలో టాప్‌సీడ్ రిత్విక్ గుప్తా 11-9, 11-5, 11-5తో ధృవా మల్లిఖార్జున్‌పై గెలిచాడు. లోకల్ ప్యాడ్లర్ వేద్ పంచల్ వరుసగా రెండు గేముల్లో గెలిచి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే సమయంలో బాలుర అండర్ 13 విభాగంలో శౌర్య గోయల్ 10-12, 11-9, 13-11, 7-11, 11-6తో సుచేత్ ధర్నెవార్‌పై గెలిచి ముందంజ వేశాడు.





ఆట



# ఉమెన్స్ హాకీ లీగ్‌లో రాంచీ రాయల్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ 2025-26లో రాంచీ రాయల్స్ 2-0 తేడాతో సూర్మా హాకీ క్లబ్‌ను ఓడించింది. రుతుజా దాదాసో పిసల్ (30వ నిముషం), సాక్షిరాణా (54) రెండు గోల్స్ చేశారు. రాంచీ రాయల్స్ ప్రారంభంలో ఆధిక్యంలో ఉన్నా, సూర్మా దాడిని ప్రదర్శించి మొదటి 15 నిమిషాల్లోనే 10 సర్కిల్ చొచ్చుకుపోయింది. 12వ నిమిషంలో సూర్మా మొదటి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ పెన్నీ స్క్విబ్ కొట్టిన షాట్‌ను మొదటి రషర్ ఆపాడు. 18వ నిమిషంలో, రుతుజా దాదాసో పిసల్ తీసిన షాట్‌ను సవిత సేవ్ చేసింది, హన్నా కాటర్ రీబౌండ్‌లో బంతిని నియంత్రించలేకపోయింది మరియు ఆ అవకాశాన్ని రాయల్స్ వృధా చేసుకుంది. 25వ నిమిషంలో, రాంచీ రాయల్స్‌కు చెందిన ఇషిక సర్కిల్ లోపల ఫౌల్ చేసి, సూర్మా హాకీ క్లబ్‌కు పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చింది, అయితే, మాధురి కిండో చేసిన అద్భుతమైన సేవ్ కారణంగా స్క్విబ్ తిరస్కరించబడింది. మరుసటి నిమిషంలో, సూర్మా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, వారు ఒత్తిడిని పెంచుతూనే ఉన్నారు, కానీ స్క్విబ్ స్ట్రైక్‌ను మళ్ళీ మొదటి రషర్ ఆపాడు. ఇది కూడా చదవండి 202526 పురుషుల హాకీ ఇండియా లీగ్ గురించి మీరు తెలుసుకోవలసినవన్నీ మొదటి అర్ధభాగం ముగియడానికి కొన్ని సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ జట్టు తొలి గోల్ సాధించింది. అగోస్టినా అలోన్సో మిడ్‌ఫీల్డ్ నుండి సర్కిల్‌లోకి శక్తివంతమైన పాస్‌ను అందించాడు, రుతుజా దాదాసో పిసల్ బంతిని పరిపూర్ణంగా పట్టుకుని, నెట్‌లోకి మళ్లించి గోల్ చేయడంలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. మూడవ క్వార్టర్ ప్రారంభ నిమిషాల్లో, సూర్మాకు చెందిన ఒలివియా షానన్ అద్భుతమైన వ్యక్తిగత ప్రయత్నం చేసింది, ప్రమాదకరమైన స్థితిలో ఆమె బ్యాక్ హ్యాండ్ షాట్ కొట్టి బంతిని గెలుచుకుంది, దీనిని రాంచీ రాయల్స్‌కు చెందిన బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించింది. 34వ నిమిషంలో, మరియా ఓర్టిజ్ ఆటపట్టించే విధంగా రాయల్స్‌కు ఆధిక్యాన్ని పెంచింది, ఆమె తన మార్కర్‌ను అధిగమించి గోల్ వైపు తక్కువ దూరం నుండి షాట్ వేయడంలో బాగా రాణించింది, కానీ బంతి పోస్ట్‌ను తాకింది. ఆట ముగియడానికి కేవలం రెండు సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ బంతిని సమర్థవంతంగా ట్రాప్ చేయకపోవడంతో అవకాశం చేజారిపోయింది. 54వ నిమిషంలో, రాంచీ రాయల్స్ మరో అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. రాయల్స్ తమ ఆధిక్యంలో కొనసాగుతుండగా, సాక్షిరాణా (54ఖి) గోల్‌పోస్ట్ యొక్క కుడి ఎగువ మూలలోకి గట్టి కోణం నుండి శక్తివంతమైన స్ట్రైక్‌ను విడుదల చేసింది. మ్యాచ్ చివరి నిమిషంలో సూర్మా హాకీ క్లబ్ కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, స్క్విబ్ డ్రాగ్‌ఫ్లిక్‌ను బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించడంతో ఆమె ఆట క్లీన్ షీట్‌తో ముగిసింది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.